

ఎస్ఈ అబుల్ అలీ నేతృత్వంలో ప్రీబిడ్ సమావేశం

వెలిగొండ టెండర్ల కోసం కంపెనీల ఆసక్తి

- ప్రీ-బిడ్ మీటింగ్‌కు నాలుగు సంస్థల ప్రతినిధుల హాజరు
- రూ.370.42 కోట్లతో ఫీడర్ కాలువల ఆధునికీకరణ కోసం టెండర్లు పిలిచిన అధికారులు

ఒంగోలు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కాలువ ఆధునికీకరణ పనుల కోసం పలు కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయి. ఇందుకు సంబంధించి గురువారం ప్రాజెక్టు అధికారులు నిర్వహించిన ప్రీ-బిడ్ మీటింగ్‌కు ఆ రంగంలో అనుభవం ఉన్న నాలుగు కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. టెండర్‌కు సంబంధించిన పలు అంశాలను వారు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అందులో ఒకటి, రెండు కంపెనీల ప్రతినిధులు ఫీడర్ కాలువను సందర్శించి చేయాల్సిన పనులు, ప్రాంతాలను పరిశీలించే అవకాశం ఇవ్వాలని కూడా కోరినట్లు సమాచారం. వెలిగొండ ప్రాజెక్టు తొలిదశను వచ్చే ఏడాది ఆగస్టుకు పూర్తిచేసి నీరివ్వాలన్న లక్ష్యాన్ని అధికార యంత్రాంగానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టం చేయడంతో పాటు ప్రభుత్వ పరంగా ఆ దిశగా అవసరమైన చర్యలు చేపట్టిన విషయం విదితమే. అందులోభాగంగా అత్యంత కీలకమైన ఫీడర్ కాలువ ఆధునికీకరణ పనుల కోసం రూ.456 కోట్లను మంజూరు చేస్తూ గతనెల 26న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ వెంటనే ప్రాజెక్టు అధికారులు సంబంధిత పనులకు టెండర్లు పిలిచారు. మొత్తం 21.80 కి.మీ ఫీడర్ కాలువ పొడవు ఉండగా కాలువ మొత్తం లైనింగ్ అలాగే మూడుచోట్ల 5.36 కి.మీ కాంక్రీటు గోడలు నిర్మించేందుకు అధికారులు ప్రతిపాదించారు. మొత్తం రూ.456 కోట్లతో ప్రభుత్వం మంజూరు ఉత్తర్వులు ఇవ్వగా ప్రతిపాదిత పనులకు రూ.370.42 కోట్లతో ప్రాజెక్టు ఎస్ఈ అబుత్ అలీ ఈనెల 1న టెండర్లు పిలిచారు. ఆన్‌లైన్‌లో టెండర్ల దాఖలకు ఈనెల 15 వరకు గడువు ఉండగా టెండర్ల నిబంధనల ప్రకారం ముందుగా ప్రీ-బిడ్ సమావేశాన్ని గురువారం నిర్వహించారు.

ప్రీబిడ్ మీటింగ్‌కు కంపెనీల ప్రతినిధులు

ఆసక్తి ఉండే నిర్మాణ కంపెనీల ప్రతినిధులు ఆన్‌లైన్‌లో పెట్టిన టెండర్ వివరాలను పరిశీలించుకొని అందుకు సంబంధించి తమకు ఉండే సందేహాల నివృత్తి, అలాగే అదనపు సమాచారం కోసం అధికారులను సంప్రదించేందుకు నిబంధనలు అనుమతిస్తాయి. అందుకోసం టెండర్ చివరి తేదీకి వారం ముందు ప్రీబిడ్ మీటింగ్ పేరుతో టెండర్ పిలిచిన అధికారి సమక్షంలో సమావేశాన్ని నిర్వహిస్తారు. కంపెనీల ప్రతినిధులు ఆ సమావేశానికి హాజరై అధికారుల నుంచి

మిగతా 6లో...

ఒడిదొడుకుల సాగు

తగ్గిన మెట్ట పంటలు... పెరిగిన మాగాణి

- ఖరీఫ్ సీజన్‌లో 84.84శాతం విస్తీర్ణంలో పంటలు
- వర్షాలున్నా అనుకూలించని వాతావరణం
- ముమ్మరంగా వరి నాట్లు
- మెట్టనేలల్లో బర్లీ పొగాకు సాగు

ఖరీఫ్ పంటల సాగుకు వాతావరణం ఈ ఏడాది అంతగా అనుకూలించలేదు. కీలక మెట్టపంటల సాగు తగ్గింది. పత్తి, బర్లీ పొగాకును సాగు చేస్తున్నారు. కంది సాగు తగ్గింది. మాగాణి పంటలు మెరుగ్గానే సాగయ్యాయి. వరితోపాటు కొందరు రైతులు ఆయకట్టు చివరి భూముల్లో మొక్కజొన్న వేశారు. ఈ ఏడాది సాగర్ నీరు పుష్కలంగా వచ్చింది. దీనికితోడు జిల్లాలోని ఆయకట్టు భూముల్లో వర్షాలు ముమ్మరంగా కురవడంతో రైతులు పంటలు సాగు చేస్తున్నారు.

మార్కాపురం డివిజన్‌లో ఈ ఖరీఫ్ సీజన్‌లో వివిధ రకాల పంటలు 58శాతం మాత్రమే సాగయ్యాయి. ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో సాధారణ విస్తీర్ణంలో కూడా పంటలు సాగు కాలేదు. ఖరీఫ్ ఆరంభంలో వర్షాలు సక్రమంగా లేక వేసవి పరిస్థితులు నెలకొన్నాయి. మెట్ట పంటలు కొంతమేర సాగైనా ప్రతికూల వాతావరణంతో ఎదుగుదల నిలిచింది. గతంతో పోల్చితే మిర్చి సాగు విస్తీర్ణం పూర్తిగా తగ్గింది. రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గుచూపారు. మొక్కజొన్న, బొప్పాయి సాగు కొంతమేర పెరిగింది. పత్తి ఒక్కటే గతంలో మాదిరిగానే ఆశాజనకంగా ఉంది. దిగుబడులు కూడా బాగానే ఉన్నాయి.



మార్కాపురంలో ఆశాజనకంగా పత్తి

దర్శి ప్రాంతంలో పంటలు ముమ్మరంగా సాగవుతున్నాయి. సాగర్ జలాలు పుష్కలంగా సరఫరా అవుతుండటంతో ఆయకట్టు భూముల్లో వరి నాట్లు వేస్తున్నారు. ముందుగా బోర్ల కింద వరి నారు పోసిన రైతులు నెల కిందటే నాట్లు వేయడంతో లేత పైరు కళకళలాడుతోంది. దర్శి ఎన్నెస్పీ డివిజన్ పరిధిలో లక్ష ఎకరాల ఆయకట్టు భూమి ఉండగా, ఈ ఏడాది అత్యధికంగా 60వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. మిగిలిన భూముల్లో ఆరు తడి పంటలు వేస్తున్నారు.

అధికంగా వరి, మొక్కజొన్న

అదే సమయంలో ముందస్తుగా సాగర్ నీరు రావడంతో వరి, మొక్కజొన్న అధిక విస్తీర్ణంలో సాగు చేశారు. ఈ సీజన్‌లో 12,826 హెక్టార్లలో వరి సాధారణ విస్తీర్ణం కాగా 14,147 హెక్టార్లలో వేశారు. ఈనెల 15 వరకు వరి పంటను ఖరీఫ్‌గా జిల్లాలో భావిస్తారు. దాంతో మరో ఐదారువేల హెక్టార్లలో అధికంగా సాగు అవుతుంది. ఇక ఈసారి మొక్కజొన్న భారీగా సాగు చేశారు. ఖరీఫ్ సీజన్‌లో మొక్కజొన్న సాధారణ విస్తీర్ణం 312 హెక్టార్లు మాత్రమే కాగా 7,880 హెక్టార్లలో సాగు చేశారు. ఇతర పంటలు పరిశీలిస్తే వినుము, పెసర, శనగ వంటివి నామమాత్రంగానే సాగు కాగా నువ్వు ఒక మోస్తరుగా సాగైంది. అలాగే ఉద్యాన పంటల పరిధిలోకి వచ్చే మిర్చి, కూరగాయల సాగు ఒక మోస్తరుగా సాగైనట్లు సమాచారం.

ఒంగోలు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి)/దర్శి/మార్కాపురం : జిల్లాలో ఖరీఫ్ సీజన్ సాధారణం కన్నా తక్కువగానే ఉంది. ఈ సమయంలో మొత్తంగా వర్షం బాగానే ఉన్నట్లు కనిపించినా అవసరమైన సమయంలో కురవకపోవడంతో పంటల సాగు ఆశించిన స్థాయిలో జరగలేదు. రాష్ట్రవ్యాప్తంగా జూన్ ఆరంభం నుంచి సెప్టెంబరు ఆఖరు వరకు ఖరీఫ్ సీజన్‌గా గుర్తిస్తారు. ఈ సమయంలో జిల్లాలో వ్యవసాయ శాఖ పరిధిలో లక్షా 29వేల హెక్టార్లలో పంటలు సాగు కావాలి. అయితే ఈ ఏడాది 84.84శాతంతో లక్షా 9వేల 532 హెక్టార్లలో సాగయ్యాయి. గతేడాదితో

మిగతా 6లో...



అదే తీరు.. ఎప్పటికి మారేను?

- కేసులు నమోదు చేస్తున్నా ఆగలేదు
- పది నెలల్లో 145 నమోదైన వైనం
- 5,142.05 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం



రేషన్ అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు కూటమి ప్రభుత్వం ఎన్ని పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నా అక్రమార్కులు మాత్రం రేషన్ బియ్యాన్ని వదలడం లేదు. రేషన్ పంపిణీ ప్రారంభమైన పక్షం రోజుల్లోనే ఈ వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయలుగా వర్థిల్లుతోంది. అధికార పార్టీ నాయకుల అండదండలతో రేషన్‌షాపుల నుంచి బియ్యాన్ని కొనుగోలు చేసి వాటిని గోతాలు మార్చు చేసి వాహనాల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా జనవరి నుంచి ఇప్పటి వరకు పౌరసరఫరాలశాఖ అధికారులు దాడులు నిర్వహించి 145 కేసులు నమోదు చేయడంతోపాటు 5,140.05 క్వింటాళ్ల బియ్యంను స్వాధీనం చేసుకున్నారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. జిల్లాలో 1,392 రేషన్ షాపుల పరిధిలో 6.61 లక్షల మంది కార్డుదారులకు సరుకుల పంపిణీ జరుగుతోంది. అందుకోసం ప్రభుత్వం ప్రతినెలా జిల్లాకు సుమారు 10,380 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సబ్సిడీపై సరఫరా చేస్తుంది. కేంద్రప్రభుత్వం కరోనా కారణంగా ఇప్పటికీ ఆ బియ్యాన్ని ఉచితంగా అందిస్తోంది. అటువంటి బియ్యాన్ని పేదలకు దక్కకుండా అక్రమార్కులు భారీగా సొమ్ము చేసుకుంటున్నారు.

వ్యాపారులకు అప్పనంగా లాభం

కార్డుదారులకు కిలోకి రూ.10 ఇస్తున్న డీలర్లు, ఆ తర్వాత ఆ బియ్యాన్ని మధ్య దళారికి కిలో రూ.15 నుంచి రూ.16కు అమ్ముతున్నారు. అక్కడి నుంచి కిలోకు కొంత లాభం తీసుకొని మరొకరికి అప్పగిస్తున్నారు. పేదల వద్ద నుంచి పదికి కొనుగోలు చేసిన బియ్యంతో వ్యాపారులు కిలోకు రూ.20 వరకు లాభం పొందుతున్నారు. ఈ వ్యాపారం మొత్తం పక్షం రోజుల్లోనే ముగుస్తుండటం, ఆదాయం అధికంగా ఉండటంతో కొన్ని ప్రాంతాల్లో అధికార పార్టీకి చెందిన ద్వితీయశ్రేణి నాయకులు బినామీలను ఏర్పాటు చేసుకొని దందా సాగిస్తున్నారు. అలా ఆ బియ్యాన్ని ఏదో ఒక ప్రాంతంలోని మిల్లులకు తరలించి అక్కడ గోతాలను మార్చు చేసి లారీలు, ఆటోలు, ఇతర వాహనాల్లో

మిగతా 6లో...

డీసీసీబీ విచారణాధికారి మార్పు పిటిషన్‌పై హైకోర్టు నోటీసులు

ఒంగోలు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ)లో సాగుతున్న సెక్షన్ 51 విచారణలో విచారణాధికారి మార్పు కోరుతూ దాఖలైన పిటిషన్‌పై ప్రతివాదులకు హైకోర్టు గురువారం నోటీసులు జారీ చేసింది. గత వైసీపీ ప్రభుత్వ కాలంలో డీసీసీబీలో భారీగా అవినీతి, అక్రమాలు, అవకతవకలు జరిగాయన్న ఫిర్యాదులపై ప్రాథమిక విచారణ అనంతరం ప్రభుత్వం సెక్షన్ 51 విచారణకు ఆదేశించింది. అందుకు విచారణాధికారిగా సహకారశాఖ కమిషనరేట్‌లో అదనపు కమిషనర్ వి.గౌరీశంకర్‌ను

మిగతా 6లో...



విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలిస్తున్న షార్ చీఫ్ జనరల్ మేనేజర్ వెంకటరెడ్డి

ముగిసిన అంతరిక్ష వారోత్సవాలు

వివిధ పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం 7



పాఠశాల పిలుస్తోంది!

- కొత్త ఉపాధ్యాయుల కోసం ఎదురుచూపు
- కౌన్సెలింగ్‌లో సొంత ప్రాంత ఖాళీలకు ప్రాధాన్యం ఇవ్వాలి
- మీ గ్రామాల్లో విద్యాభివృద్ధిని గుర్తుంచుకోండి

7

కొనసాగుతున్న సాగర్ నీటి పైప్‌లైన్ పనులు

- దశాబ్దాలుగా 10వ వార్డు ప్రజల ఎదురుచూపులు
- పట్టించుకోని ప్రజారోగ్య శాఖ

మార్కాపురం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణంలో అత్యంత కీలకమైన ప్రాంతం 10వ వార్డు. సుమారు 8 బ్లాకులు ఇక్కడే ఉన్నాయి. పేద, మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా జీవించేది కూడా ఇక్కడే. కూలీ నాలీ చేసుకుని ఏ రోజుకు ఆ రోజు కడుపునింపుకునే ప్రజలే అధికం. తెలుగుదేశం పార్టీకి ఈ ప్రాంతం పెట్టని కోట. ఈ కారణంచేతనో ఏమో గతంలో పాలకులు 10వ వార్డు అభివృద్ధిని విస్మరించారు. మరీ ముఖ్యంగా నేటికీ రక్షిత నీటికి కూడా నోచుకోలేని దుస్థితి ఉంది. దశాబ్ద కాలంగా పట్టణమంతా సాగర్ నీరు సరఫరా అవుతున్నా 10వ వార్డు ప్రజలకు మాత్రం ఎదురుచూపులు తప్పడంలేదు. గత వైసీపీ పాలనలో 2023లో 18 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ వేసేందుకు పనులు ప్రారంభించినా నేటికీ 25 శాతం మాత్రమే పనులు పూర్తి చేశారు. పైప్‌లైన్ వేసిన చోట కూడా రహదారులకు మరమ్మతు పనులు పెండింగ్‌లోనే

మిగతా 6లో...



మార్కాపురం 10వ వార్డులో డీప్ బోర్ల ద్వారా నీటిని సమకూర్చుకునేందుకు ప్లాస్టిక్ పైపులే దిక్కు

‘సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్’పై అవగాహన ర్యాలీ

- జీఎస్టీ సంస్కరణలతో వైద్య చికిత్సలు పరికరాలు, మందులు అందుబాటులోకి
- జేసీ గోపాలకృష్ణ

7

పెన్షనర్లకు నష్టం కలిగించే విధానాలను రద్దు చేయాలి

శాసనమండలి మాజీ సభ్యుడు కేఎస్ లక్ష్మణరావు 7

సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ బదిలీ

7



మంత్రి లోకేశ్‌తో పండిత పరిషత్ నాయకులు

విద్యా మంత్రికి పండిత పరిషత్ కృతజ్ఞతలు

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : బాషా పండితులకు ఉద్యోగోన్నతులు కల్పించిన విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలిసి పండిత పరిషత్ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పండిత పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిచంద్ర కుమార్ మాట్లాడుతూ.. డీఈవో భాషా పండితులకు మంత్రి ఉద్యోగోన్నతులు కల్పించారని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని భాషా బోధకులకు గౌరవం కల్పించాలనే సత్ సంకల్పంతో ప్రభుత్వం రాష్ట్రంలోని 10,224 బాషా పండిత పోస్టులను స్కూల్ అసిస్టెంట్ భాషాలుగా ఉన్నతీకరణ చేస్తూ 2018లో ప్రభుత్వ ఉత్తర్వులు 91 విడుదల చేసిందని తెలిపారు. కానీ గత ప్రభుత్వంలో కొన్ని ఉపాధ్యాయ సంఘాల నిర్వాకం వల్ల ఎస్జీటీలకు ఉద్యోగోన్నతులు కల్పించడంతో సుమారు 1,200 మందికిపైగా బాషా పండితులు ఉద్యోగోన్నతి లేక ఇబ్బందులు పడ్డారని తెలిపారు. ఈ సమస్యపై మంత్రి లోకేశ్ స్పందించి దసరా కానుకగా భాషా పండితులకు ఉద్యోగోన్నతులు కల్పించారని తెలిపారు. కార్యక్రమంలో పండిత పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు సంపత్ కృష్ణ, బాధ్యులు పెదబాబు, శ్రీరాజ్, రాజేష్ పాల్గొన్నారు.



టపాసుల హోల్‌సేల్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న సీఐ సుబ్బారావు

నకిలీ టపాసులు అమ్మితే చర్యలు

మార్కాపురం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : నకిలీ టపాసులు అమ్మితే చర్యలు తప్పవని మార్కాపురం సీఐ పి.సుబ్బారావు హెచ్చరించారు. పట్టణంలోని పలు హోల్‌సేల్ టపాసుల దుకాణాలను ఆయన గురువారం తనిఖీ చేశారు. ముందుగా స్టాక్‌ను, ప్రమాదాలు జరగకుండా తీసుకుంటున్న రక్షణ చర్యలు, బిల్లులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర ప్రాంతాల నుంచి ఎలాంటి బిల్లులు లేకుండా టపాసులు తెచ్చి అమ్మితే కఠిన చర్యలు తప్పవన్నారు. అధీకృత హోల్‌సేల్ దుకాణాల నుంచే రిటైల్ వ్యాపారులు బిల్లుతో కొనుగోలు చేసి అమ్మకాలు చేసుకోవాలని సూచించారు. దీపావళి పండుగ సందర్భంగా డిమాండ్‌ను అడ్డుపెట్టుకుని అధిక ధరలకు అమ్మితే లైసెన్స్‌లు రద్దు చేస్తామని సీఐ తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ ఎం.సైదుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

త్రిపురాంతకం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : బైక్‌పై వెళుతున్న యువకులను ఎదురుగా వచ్చిన ఫోర్‌వీలర్ ఆటో ఢీకొట్టిన ఘటనలో యువకుడు మృతిచెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. గురువారం మండల పరిధిలోని మేడపి సమీపంలో ప్రమాదం జరిగింది. గణపవరం గ్రామం నుంచి ఐటివరం వెళ్లేందుకు ముగ్గురు యువకులు బైక్‌పై బయలు దేరారు. మేడపి దాటిన తరువాత అటువైపు నుంచి వస్తున్న వాహనం ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న మందా పేరయ్య (19) అక్కడికక్కడే మృతిచెందగా, మందా కోటేశు, బెజవాడ ప్రవీణ్ తీవ్రంగా గాయపడ్డారు. వారిలో కోటేశు పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరు తరలించారు. అయితే గత ఏడాది పేరయ్య తండ్రి చనిపోయారు. వెటర్నరీ కోర్సు చదువుతున్న పేరయ్య ఒక్కడే కుమారుడు కావడంతో కుటుంబీకుల రోదన మిన్నంటాయి. బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలంటూ కుటుంబ సభ్యులు కొంతసేపు అందోళన చేపట్టారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎర్రగొండపాలెం ఏరియా వైద్యశాలకు తరలించారు. ఎస్సై శివబసవ రాజు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న సీఐ అసాన్ బాధిత కుటుంబాలతో మాట్లాడారు.



పేరయ్య (ఫైల్)



స్లాబ్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఈఈ పీవీ రావు

నిర్మాణాలు పటిష్ఠంగా ఉండాలి

రాచర్ల అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : చేపట్టే నిర్మాణాలు పటిష్ఠంగా ఉండాలని సమగ్ర శిక్షా అభియాన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ఎస్ఏఈఈ పీ వెంకటరత్నంరావు అన్నారు. రాచర్ల కేజీబీవీ పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణాలను గురువారం ఆయన పరిశీలించారు. స్లాబును త్వరగా పూర్తి చేయాలని, నిర్మాణాల్లో నిబంధనలు పాటించాలని ఆయన తెలిపారు. అనంతరం ఆదర్శ పాఠశాలను పరిశీలించి సమస్యలు తెలుసుకున్నారు. పాఠశాలలో హాస్టల్ బిల్డింగ్ గదుల మరమ్మతులు, మరికొన్ని సమస్యలు ఉన్నట్లు గుర్తించి, రూ.11లక్షల నిధులు మంజూరయ్యాయని, వాటిని వినియోగించుకొని మైనర్ పనులన్నీ పూర్తి చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏఈ మహేష్, అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

మణికంఠ గ్రానైట్‌పై మూకుమ్మడి దాడులు

విజిలెన్స్, రెవెన్యూ, మైన్స్ అధికారుల సంయుక్త సర్వే

అక్రమ క్వారీయింగ్ కార్యకలాపాలపై తనిఖీలు

నేడూ కొనసాగనున్న పరిశీలన

చీమకుర్తి,అక్టోబరు9 (ఆంధ్రజ్యోతి): చీమకుర్తి పరిధిలో ఉన్న మణికంఠ గ్రానైట్(కృష్ణసాయి గ్రూప్ ఆఫ్ కంపెనీస్) సంస్థపై గురువారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, మైన్స్‌రెవెన్యూ అధికారులు మూకుమ్మడి దాడులు నిర్వహించారు.కృష్ణసాయి గ్రూప్ ఆఫ్ కంపెనీస్‌లో భాగంగా ఉన్న మణికంఠ గ్రానైట్ సంస్థ ప్రభుత్వ భూములు ఆక్రమించుకోవటమే కాక వాటిలో అక్రమ క్వారీయింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతుందని, ఈ సంస్థపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని ఏపీ డిప్యూటీ జనరల్ ఆఫ్ మైన్స్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు మలినేని కోటేశ్వరరావు అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు.దీనికి స్పందించిన డీజీ ఆదేశాల మేరకు గురువారం ఆకస్మికంగా మూకుమ్మడి తనిఖీలు నిర్వహించారు. చీమకుర్తి పట్టణంలోని సర్వేనంబర్లు 973బై1 నుంచి 6,9,11,12 (పి),13(పి), 974బై1 నుంచి 9,11,971 బై5,533 (పి)534బై4,5, 971బై6పిలలో గెలాక్సీ గ్రానైట్‌కు సంబంధించి అక్రమ క్వారీయింగ్ కార్యకలాపాలను సాగిస్తుందన్న ఫిర్యాదు మేరకు అధికారులు ఆయా సర్వే నంబర్లలో తనిఖీలు జరిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మణికంఠ గ్రానైట్ అనధికారికంగా ప్రభుత్వ భూముల్లో డంపుల నిర్వహణ, కటింగ్ ఫ్యాక్టరీ నిర్మించి,అందులో కార్యకలాపాలు నిర్వహిస్తున్నారా లేదా అనే అంశాలపై అధికారులు ఫోకస్ చేశారు.ఆయా సర్వే నంబర్లలో మండల సర్వేయర్ మోజెస్ తన సిబ్బందితో కలిసి కొలతలు తీశారు.మైన్స్ అధికారులు రికార్డులు పరిశీలించారు. అన్ని సర్వే నంబర్లలలో కొలతలు పూర్తికాకపోవటంతో శుక్రవారం కూడా సర్వే ఇతర విభాగాల్లో తనిఖీలు నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. కొలతలు, తనిఖీలు పూర్తయిన తర్వాత ఉన్నతాధికారులకు నివేదికను అందించనున్నారు.

కృష్ణసాయి గ్రూపు కార్యకలాపాలపై ఆరోపణలు

కృష్ణసాయి గ్రూపు క్వారీయింగ్ కార్యకలాపాలపై మొదటినుంచి ఫిర్యాదులు,ఆరోపణలు సాగుతూనే ఉన్నాయి.ప్రభుత్వ, వాగు, కొండపోరంబోకు భుములను ఆక్రమించుకొని క్వారీయింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు గత కొన్నేళ్లుగా వస్తున్నాయి. రెవెన్యూ అధికారులకు ఈ విషయం తెలిసినా ఏనాడు పట్టించుకున్న పాపాన పోలేదు. రెవెన్యూ రికార్డుల్లో క్లియర్‌గా ప్రభుత్వ భూములు అని ఉన్న సర్వే నంబర్లలో క్వారీయింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నా చూసి,చూడకుండా పోతున్నారే తప్ప చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.ఫిర్యాదులు వచ్చినపుడు సర్వే నిర్వహించటం తర్వాత మమ అనిపించటం ఓ తతంగం ఏళ్ల తరబడి సంస్థ పలుకుబడితో సాగుతూనే ఉంది.ఒంగోలు నుంచి కర్నూలు వెళ్లే రాష్ట్రరహదారికి ఇరువైపులా అత్యంత విలువైన గెలాక్సీ గ్రానైట్ నిక్షేపాలున్న భూములు ఈ సంస్థకున్నాయి. వీటిలో తమ కార్యకలాపాలు చేసుకుంటే ఎవరికి ఇబ్బం ది ఉండదు.కానీ ఇవి చాలవన్నంటుగా ప్రభుత్వ భూములను సైతం ఆక్రమించుకొని కార్యకలాపాలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వస్తుండటం,పదే పదే ఫిర్యాదులు రావటం అధికారులు తనిఖీలు జరపటం గత కొన్నేళ్లుగా ప్రహసనంలా జరుగుతుండటం సంస్థ ప్రతిష్ఠ మసకబారేలా చేస్తుంది. ప్రస్తుతం అధికారులు జరిపే తనిఖీలు అయినా నిష్పక్షపాతంగా,పక్కాగా జరిపి నిజాలు నిగ్గు తేలిస్తే సంస్థపై ఆరోపణ పర్వానికి చెక్ పడే అవకాశం ఉంటుంది.లేదా ఆరోపణలు నిజమైతే చర్యలు తీసుకొనే అవకాశం ఉన్నతాధికారులకు ఏర్పడి పదే పదే ఫిర్యాదులకు చోటు ఉండకుండా ఉంటుంది.



సర్వే చేస్తున్న మైన్స్,విజిలెన్స్,రెవెన్యూ అధికారులు

సర్వే పూర్తయిన తర్వాత వివరాలు వెల్లడిస్తాం

మణికంఠ గ్రానైట్ సంస్థ అక్రమ క్వారీయింగ్ కార్యకలాపలకు పాల్పడుతుందని వచ్చిన ఫిర్యాదును పరిశీలించిన రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయా సర్వే నంబర్లలో సంయుక్త తనిఖీలు, సర్వే నిర్వహిస్తున్నాం.సర్వే ఇంకా పూర్తి కాలేదు.సర్వేతనిఖీలు పూర్తయిన తర్వాత నివేదికను ఉన్నతాధికారులకు నివేదించి వివరాలను వెల్లడిస్తాం.

- రాఘవ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ,మైన్స్ విభాగం

కొన'సాగు'తున్న సాగర్ నీటి పైపులైన్ పనులు

(5వ పేజీ తరువాయి)

ఉన్నాయి. ప్రజా ప్రభుత్వంలోనైనా సాగర్ నీరు అందుబాటులోకి వస్తుందని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

మొదటి నుంచి శీతకన్నే..

మార్కాపురం పట్టణ ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు 2011లో ప్రపంచ బ్యాంక్ నిధులు రూ.52కోట్లతో అండర్ గ్రౌండ్ పైప్‌లైన్ పనులను ప్రారంభించారు. 2014 కల్లా ఆ పనులు పూర్తయ్యాయి. అప్పట్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడంతో అన్నిచోట్లా అండర్ గ్రౌండ్ పైప్‌లైన్ వేసినా స్థానిక 28వ బ్లాక్ నుంచి 34వ బ్లాక్ వరకు వివక్ష చూపింది. కేవలం జవహర్‌నగర్ కాలనీ ప్రాంతంలో మాత్రమే పైప్‌లైన్ వేశారు. ఆ తర్వాత గత వైసీపీ 2023లో 7బ్లాకుల్లో 18 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ వేసేందుకు ప్లాన్ గ్రాంట్ నిధులు రూ.5.2కోట్లు మంజూరు చేసింది. పనులు దక్కించుకున్న ఏవీఆర్ ఇన్ ఫ్రా అప్పట్లో కేవలం 2 కిలోమీటర్ల మేర మాత్రమే అండర్‌గ్రౌండ్ పైప్‌లైన్ వేసింది. సాధారణ ఎన్నికలు రావడం ప్రభుత్వం మారడంతో ఆ సంస్థ పనులు నిలిపివేసింది. కొన్నాళ్ల కిందట ఈ పనిని రఘురామ్ పైప్స్ సంస్థ సబ్ లీజుకు తీసుకుంది. అయినా పనుల్లో వేగం పెరగలేదు. ఆ సంస్థ కూడా 2.2 కిలో మీటర్ల మేర మాత్రమే పనులు చేసింది. పైప్‌లైన్ వేసేందుకు రహదారులను తవ్వినా మరమ్మతు పనులు పూర్తి చేయలేదు. దీంతో ఆ 4.2 కిలో మీటర్ల మేర ఉన్న ప్రాంతాల వాళ్లు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల ప్రజలే సొంత నిధులతో పైప్‌లైన్ వేసిన ప్రాంతంలో మరమ్మతులు చేసుకున్నారు. వాస్తవానికి పనులు రెండు సంవత్సరాల కాలవ్యవధిలో పూర్తి కావాల్సివుంది. ప్రస్తుతం జరుగుతున్న పనుల తీరును గమనిస్తే మిగిలిన 13.8 కిలో మీటర్ల మేర పైప్‌లైన్ పనులు పూర్తి చేయడానికి ఎన్నేళ్లు పడుతుందో తెలియకుంది. దశాబ్దాలుగా రక్షిత నీటికోసం ఎదురుచూస్తున్న ఈ ప్రాంత ప్రజలు మరికొన్నాళ్లు వేచి చూడాల్సిందే. పనులను పర్యవేక్షిస్తున్న ప్రజారోగ్య శాఖ ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడంతోనే నత్తనడకన పనులు సాగుతున్నట్లు తెలుస్తోంది.

పైపులు అందుబాటులోకి వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తాం

ప్రస్తుతం కాంట్రాక్టర్ పైపులు అందుబాటులో లేకపోవడంతో పనులు ఆపారు. వాటికి ఆర్డర్ పెట్టారు. వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. పైప్‌లైన్ వేసిన ప్రాంతాల్లో సీసీ రహదారులకు మరమ్మతులను త్వరలోనే చేయిస్తాం. రెండు రోజుల్లో పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం.

- శ్రీనివాసరావు, డీఈ, ప్రజారోగ్యశాఖ



మహాజనసభలో మాట్లాడుతున్న చైర్మన్ కామేపల్లి సీతారామయ్య

పీడీసీసీ బ్యాంకులో డివిడెండ్ పెంపు

- చైర్మన్ డాక్టర్ సీతారామయ్య

ఒంగోలు విద్య, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పీడీసీసీ బ్యాంకు ఖాతాదారులకు లాభాల్లో డివిడెండ్‌ను 0.10శాతం పెంచి చెల్లించనున్నట్లు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య తెలిపారు బ్యాంకు 74వమహాసభ గురువారం సాయంత్రం ఒంగోలులోని పీడీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ సీతారామయ్య మాట్లాడుతూ ఖాతాదారులకు బ్యాంకు ఆర్జించే లాభాల్లో డివిడెంట్‌ను ప్రకటించారు. నాన్ క్రెడిట్ వ్యాపారం చేసేందుకు సొసైటీలు ముందుకు వస్తే తాము ప్రోత్సహిస్తామన్నారు. సొసైటీల భవన నిర్మాణాలకు పాలకవర్గాలు తీర్మానాలు చేసి పంపిస్తే నిధులు సమకూరుస్తామని చెప్పారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ శ్యామలకాశిరెడ్డి, జిల్లా సహకారాధికారి డి.శ్రీలక్ష్మి, బ్యాంకు సీఈవో శర్మ, బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సీజనసల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ సేవల పట్ల ప్రజల్లో సంతృప్తి స్థాయి పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు, మందుల పంపిణీ, ఆలయాల్లో మౌలిక సదుపాయాలు, అట్రాసిటీ చట్టం కింద బాధితులకు పరిహారం చెల్లింపు తదితర అంశాలపై కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజాబాబు, జేసీ గోపాలకృష్ణ, డీఆర్వో చిన ఓబులేష తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో తురిమెళ్ల కళాశాల విద్యార్థుల ప్రతిభ

కంభం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఎస్‌జీఎఫ్ అండర్-19 విభాగంలో తురిమెళ్లకు కాలేజీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఒంగోలులో ఈనెల 9వ తేదీ జరిగిన జిల్లా స్థాయి క్యారమ్స్ క్రీడా పోటీల్లో తురిమెళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు జిల్లా స్థాయిలో గెలుపొంది, రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ జీ సోని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. 7వ తేదీన సింగరాయకొండలో జరిగిన క్రీడా పోటీల్లో కూడా తురిమెళ్ల విద్యార్థి మహేష్ 800మీటర్ల పరుగుపందెంలో డిస్కత్రోలో సత్తా చాటిన విషయం తెలిసిందే.

రేపు మద్దిరాలపాడులో ఏపీటీఎఫ్ విద్యా సదస్సు

నాగులుప్పలపాడు అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు, ఉద్యోగ, కార్మికుల సమస్యలు, పాలకుల విధానాలు అనే అంశంపై ఈనెల 11న ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో మద్దిరాలపాడు గ్రామంలో విద్యా సదస్సు నిర్వహిస్తున్నట్లు మండల కార్యదర్శి గుమ్మడి సురేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఒడిదొడుకుల సాగు

(5వపేజీ తరువాయి)

పోల్చితే సుమారు 9వేల హెక్టార్లలో పంట తగ్గింది. ఈ సీజన్‌లో ప్రధానంగా కంది, పత్తి, సజ్జ వంటి మెట్ట పంటలు, వరి వంటి మగాణి సాగు అధికంగా ఉంటాయి. అత్యధికంగా 68,287 హెక్టార్లలో కంది, 26,981 హెక్టార్లలో పత్తి, 12,826 హెక్టార్లలో వరి, 7,020 హెక్టార్లలో సజ్జ సాగు చేస్తారు.

కీలక సమయంలో వర్షాభావం

సాధారణంగా మే ఆఖరులో కురిసే వర్షాలతో దుక్కులు దున్ని జూన్ ఆరంభంలో పడే జల్లులతో తొలకరి పైర్లుగా పిలిచే సజ్జ, నువ్వు, పెసర, ఇతర పశుగ్రాస పంటలను వేస్తారు. ఆగస్టులో కీలకమైన కంది పత్తి, మొక్కజొన్న కొనసాగింపుగా ఆగస్టు రెండవ పక్షం నుంచి వరి నాట్లు వేస్తుంటారు. అయితే మే ఆఖరులో ఒక రకంగా మంచి వర్షాలే పడినా జూన్‌లో వర్షాభావం నెలకొంది. జూన్‌లో జిల్లాలో సాధారణ వర్షపాతం 58.0 మి.మీ కాగా 37 మి.మీ మాత్రమే నమోదైంది. ఆ ప్రభావం తొలకరి సాగుపై పడింది. ఇక జూలైలో 88 మి.మీ.కు 102 మి.మీ, ఆగస్టులో 92 మి.మీ.లకు 102 మి.మీ, సెప్టెంబరులో 129 మి.మీ.లకు 139మి.మీ కురిసినా తగు సమయంలో వర్షం పడక పంటల సాగు ఊపందుకోలేదు. కీలకమైన మెట్టపంటలైన కంది పంట 68,287 హెక్టార్లకు 55,099 హెక్టార్లలో సాగు కాగా పత్తి పంట 26,981 హెక్టార్లకు 17,085 హెక్టార్లలో మాత్రమే సాగైంది. అలాగే సజ్జ కూడా 7,020 హెక్టార్లకు 3,933 హెక్టార్లలో మాత్రమే వేయగలిగారు.

అదే తీరు.. ఎప్పటికి మారేను?

(5వ పేజీ తరువాయి)

తరలింపు చేస్తున్నారు. ఎక్కడైనా ఎధైనా వివాదం వచ్చిన అధికారులకు ఫిర్యాదులు వస్తే తప్ప లేకపోతే దాడులు నిర్వహించని పరిస్థితి ఏర్పడింది.

50శాతం బయటకు.. మిగతావి స్థానికంగా..

జిల్లాకు కేటాయించిన బియ్యంలో 50శాతం బియ్యం కాకినాడ, కృష్ణపట్నం, చెన్నై పోర్టులకు తరలిపోతుండగా, 10 శాతం బియ్యం స్థానికంగా టిఫిన్ హోటల్స్‌కు సరఫరా అవుతున్నాయి. ఒక 20శాతం మంది కార్డుదారులు మాత్రమే కొనుగోలు చేస్తుండగా మిగిలిన 20శాతం బియ్యాన్ని ఇతర అవసరాలకు వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. సాధారణంగా పౌరసరఫరాల శాఖ ద్వారా అక్రమ రేషన్ వ్యాపారాన్ని అడ్డుకట్టే వేసే విధంగా చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ ప్రస్తుతం ఆ శాఖ అధికారులు ఎక్కడైనా నుంచి ఫిర్యాదులు వస్తే తనిఖీలు చేసి ఆయా రేషన్ షాపుల్లో ఏదైనా తేడాలు ఉంటే 6(ఏ) కేసులు నమోదు చేసి వదిలేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

డీసీసీబీ విచారణాధికారి మార్పు పిటిషన్‌పై హైకోర్టు నోటీసులు

(5వ పేజీ తరువాయి)

నియమించారు. గత నెలలో రెండు విడతలుగా విచారణాధికారి బ్యాంకును సందర్శించినా తగు రీతిలో విచారణ సాగలేదన్న విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో సదరు విచారణాధికారిని మార్పు చేయాలని అలాగే గతంలో పలు ఆర్థిక ఆరోపణలు ఎదుర్కొన్న బ్యాంకు సిబ్బంది ప్రస్తుతం కూడా ప్రధాన కార్యాలయంలో ఉన్నందున వారిని కూడా స్థానాల నుంచి మార్పు చేయాలని ఉమ్మడి జిల్లాలోని ఇంకొల్లుకు చెందిన రావి అంకమ్మ, జి.హరికృష్ణ అనే వారు హైకోర్టును ఆశ్రయించారు. గతనెల 26న సదరు పిటిషన్‌ను హైకోర్టు విచారణకు స్వీకరించగా గురువారం జస్టిస్ శ్రీనివాసరెడ్డి విచారించారు. ఈ పిటిషన్‌లో ప్రతివాదులుగా సహకారశాఖ ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి, కమిషనర్, కలెక్టర్, డీసీవో, విచారణాధికారి గౌరీశంకర్, సహకార కేంద్ర బ్యాంకు సీఈవోలు ఉండగా 15 రోజుల్లో వివరణ కోరుతూ నోటీసులు ఇవ్వాలని జస్టిస్ శ్రీనివాసరెడ్డి అదేశించారు.

వెలిగొండ టెండర్ల కోసం కంపెనీల ఆసక్తి

(5వపేజీ తరువాయి)

వివరాలు తెలుసుకోవచ్చు. అలాంటి ప్రీబిడ్ సమావేశం గురువారం ఇక్కడి ప్రాజెక్టుల ఎస్ఈ కార్యాలయంలో ఎస్ఈ అబుత్ అలీ సమక్షంలో జరిగింది. ఇరిగేషన్ పనులలో అనుభవం ఉన్న, గతంలో జిల్లాలో ప్రాజెక్టులు పనులు చేసిన ఎన్‌సీసీ కంపెనీ రాజమండ్రికి చెందిన, హైదరాబాద్‌కు చెందిన కేఎంఎల్ అలాగే బీఎస్ఆర్ కంపెనీ, రాజమండ్రికి చెందిన జీడీఆర్ కంపెనీల ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరైనట్లు సమాచారం. అందులో పాల్గొన్న ఆయా కంపెనీల ప్రతినిధులు పలు అంశాలపై వివరాలను అడగ్గా ఎస్ఈ, ఇతర అధికారులు ఇచ్చారు. ఈనెల 15 వరకు టెండర్ల దాఖలకు గడువు ఉండగా ఒకటి, రెండు కంపెనీల ప్రతినిధులు పనులు చేయాల్సిన కాలువ ప్రాంతాన్ని పరిశీలించేందుకు అనుమతి కోరడంతో అందుకు అధికారులు అంగీకరించారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఏపీబీఎస్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాబ్ మేళా

ఒంగోలు కల్చరల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య (ఏపీబీఎస్ఎస్ఎస్) ఆధ్వర్యంలో డిసెంబర్ 13న నిరుద్యోగులకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను గురువారం ఒంగోలులో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఐటీ, నాన్ ఐటీ, ఫార్మా, బ్యాంకింగ్, ఫైనాన్స్ వంటి సుమారు 50 కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొంటాయని, గుంటూరులో నిర్వహించే ఈ జాబ్ మేళాలో పాల్గొనటానికి నిరుద్యోగులు నవంబరు 22వ తేదీ లోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్ శర్మ తెలిపారు. జాబ్ మేళాలో పేర్లు నమోదు, వివరాల కోసం 9030353651, 9989773451, 9949722792 సెల్ నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఈ సందర్భంగా మ్మెల్యే దామచర్ల నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో సమాఖ్య మహిళా అధ్యక్షురాలు కామరాజుగడ్డ కుసుమకుమారి, ఉపాధ్యక్షులు ఆదిపూడి గిరిజా శంకర శాండిల్య, ప్రచారకార్యదర్శి ముక్తినూతలపాటి వాసు, ఎస్ఏటీ రాజేష్, కె.మారుతీ వినయ్, పలువురు బ్రాహ్మణ ప్రముఖులు పాల్గొన్నారు.

స్పాసెంటర్లలో పోలీసుల తనిఖీలు

ఒంగోలు క్రైం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలో ఉన్న స్పా సెంటర్లలో గురువారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. మొత్తం 10 సెంటర్లలో 9 బృందాలు ఏకకాలంలో తనిఖీలు చేశారు. డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు వన్‌టౌన్ సీఐ నాగరాజుతోపాటుగా మరో 8మంది ఎస్ఐలు తనిఖీలు చేపట్టగా కొన్ని సెంటర్లు మూసివేసినట్లు గుర్తించారు. మిగతా సెంటర్లలో ఎలాంటి అసాంఘీక కార్యక్రమాలు జరగడంలేదని సీఐ నాగరాజు వెల్లడించారు.

ముగ్గురు యువకులపై కేసు నమోదు

- మైనర్‌ను వేధించి, ఆమె తల్లిపై కూడా దాడి
- గతంలోనే ఇలానే మరో యువతికి వేధింపులు

మార్టూరు, అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతున్న మైనర్‌ను వేధించడంతోపాటు ప్రశ్నించిన ఆమె తల్లిపై దాడి చేసిన ముగ్గురు యువకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఉన్నాయి. ముగ్గురు యువకులైన తన్నీరు రవితేజ, పల్లపు కేశవ, తన్నీరు గోపీలు ఆకతాయిగా తిరుగుతుంటారు. మండలంలోని వలపర్ల గ్రామంలో ఓ విద్యార్థిని ఇంటర్ చదువుతోంది. అయితే అదేగ్రామానికి చెందిన ఈ ముగ్గురు యువకులు తరచు బాలికను వేదిస్తున్నారు. దీంతో ఈ విషయమై తల్లి అనూరాధ బుధవారం సాయంత్రం గ్రామంలో ముగ్గురు యవకులను ప్రశ్నించింది. దీంతో వారు అనూరాధపై భౌతిక దాడి చేశారు. ఈ నేపథ్యంలో అనూరాధ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా, హెడ్ కానిస్టేబుల్ పులి ఆంజనేయులు కేసు నమోదు చేశారు. ఇదే క్రమంలో గ్రామంలోని మరో మహిళ కూడా ముగ్గురు యువకులపై మరో ఫిర్యాదు చేశారు. గతంలో తమను కూడా వీరు వేధించారని, ప్రశ్నిస్తే బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.



హెచ్ఎం కొట్టిందని సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న విద్యార్థిని తల్లి

పాఠశాలకు ఆలస్యంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు

- మార్కాపురం జడ్పీ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన సబ్‌కలెక్టర్ వెంకట్ త్రివినాగ్
- హెచ్ఎంపై ఆగ్రహం.. ఇలా అయితే చర్యలు తీసుకుంటామని హెచ్చరిక

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలకు ఉపాధ్యాయులు, విద్యార్థులు, వార్డెన్లు ఆలస్యంగా వస్తే చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ హెచ్చరించారు. స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలను గురువారం ఉదయం 9.30గంటలకు ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆలస్యంగా రావడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయినితో మాట్లాడి ఆలస్యంగా వస్తే చర్యలు తప్పవని సబ్‌కలెక్టర్ హెచ్చరించారు.

హెచ్ఎం కొట్టడంతో విద్యార్థినికి ఫిట్స్.. ఫిర్యాదు చేసిన తల్లి

పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కీర్తనను ప్రధానోపాధ్యాయిని కొట్టడంతో ఫిట్స్‌కు గురైందని తల్లి పాఠశాలకు వచ్చిన సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. తరచూ పాఠశాలకు లేట్‌గా వస్తుందనే కారణంతో బుధవారం హెచ్ఎం శ్రీదేవి కీర్తనను కొట్టడంతో తమ కూతురికి ఫిట్స్ వచ్చిందని తల్లి తెలిపింది. వెంటనే పాపను ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించారని, ఇంటికి వచ్చిన తర్వాత తమకు తెలిసిందని బాలిక తల్లి సబ్ కలెక్టర్ వద్ద విలపించింది. హెచ్ఎంపై విచారణ జరిపి నివేదిక పంపాలని సబ్‌కలెక్టర్ త్రివినాగ్ ఎంఈవోను ఆదేశించారు. గతంలో మధ్యాహ్న భోజనం బియ్యం, సరుకుల విషయమై కూడా హెచ్ఎంపై ఫిర్యాదులుండడంతో విచారణకు ఆదేశించారు.



చతుకుపాడు వద్ద ఉన్న పోలేరమ్మ ఫైర్ క్రాకర్స్ గోడౌన్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో కళావతి, తహసీల్దార్ మురళి, అధికారులు

టపాసుల గోడౌన్ల తనిఖీ

- చినకండ్లగుంటలో సామర్థ్యానికి మించి సరుకు నిల్వపై ఆర్డీవో ఆగ్రహం

జరుగుమల్లి (కొండపి), అక్టోబరు9 (ఆంధ్రజ్యోతి): జరుగుమల్లి, కొండపి మండలాల్లోని టపాసుల విక్రయ హోల్‌సేల్ దుకాణాలు, గోడౌన్‌లను ఒంగోలు ఆర్డీవో కళావతి, రెవెన్యూ అధికారులు, సిబ్బందితో కలిసి గురువారం తనిఖీ చేశారు. దీపావళి సందర్భంగా ప్రమాదాలు జరగకుండా దుకాణాలు, గోడౌన్‌ల వద్ద యజమానులు తీసుకున్న ప్రమాద నివారణ చర్యలు, సరుకు నిల్వలు, అగ్నిమాపక వసతులను ఆమె పరిశీలించారు. జరుగుమల్లి మండలంలోని చతుకుపాడు వద్ద ఉన్న పోలేరమ్మ ఫైర్ క్రాకర్స్ దుకాణాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి. మురళి, ఆర్ఐ ఐ. ప్రసూన, వీఆర్వోలు మధు, చైతన్య పాల్గొన్నారు.

కొండపి మండలంలో...

కొండపి మండలంలోని చినకండ్లగుంట గ్రామం వద్ద ఉన్న శ్రీరామా ఫైర్ క్రాకర్స్ విక్రయ దుకాణాన్ని, గోడౌన్‌ను ఆర్డీవో పరిశీలించారు. గోడౌన్‌లో ఉండాల్సిన సరుకు, దుకాణంలో సామర్థ్యానికి మించి ఉండటం పట్ల ఆర్డీవో ఆక్షేపించారు. వెంటనే సరుకును గోడౌన్‌లోకి మార్చాలని దుకాణ యజమానులను ఆదేశించారు. ఆమె వెంట తహసీల్దార్ ఎస్. శ్రీనివాసులు, ఆర్ఐ ఎం. శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎన్‌టీఆర్ వైద్యసేవ డీసీ డాక్టర్ హేమంత్

జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలపై
అవగాహన పెంచుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపు వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని ఎన్‌టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ పీ హేమంత్ అన్నారు. స్థానిక హెచ్‌సీఎం ఎంఎన్ఆర్ కేన్సర్ సెంటర్‌లో గురువారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపు వల్ల అనేక మందుల ధరలు కూడా తగ్గాయన్నారు. రోగులకు అత్యవసరమైన మందులను కొనుగోలు చేసే సమయంలో కేంద్ర ప్రభుత్వం కల్పించిన రాయితీ అందుతుందా లేదో పరిశీలించుకోవాలన్నారు. జీఎస్టీ తగ్గడం వల్ల మందులతో పాటు వైద్యసేవల పరంగా రోగులకు పలు ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రేడియోషన్ అంకాలజిస్ట్ డాక్టర్ ఆర్‌వీ రఘునందన్, సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ దీప్తి, సెంటర్ మేనేజర్ డి. లక్ష్మీ నరసింహం, డాక్టర్ బీవీ నారాయణ, ఎన్‌టీఆర్ వైద్యసేవ జిల్లా మేనేజర్ సీహెచ్ కిరణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.



రైటర్లు, స్టేషన్ ఎస్‌హెచ్‌వోల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

కొత్త చట్టాల అమలుతో పారదర్శకత

- అహగాహన కార్యక్రమంలో ఎస్పీ హర్షవర్ధనరాజు

ఒంగోలు క్రైం,అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో కొత్త చట్టాల అమలుతో జవాబుదారీతనం, పారదర్శకత పెరుగుతుందని ఎస్పీ వి.హర్షవర్ధనరాజు తెలిపారు. గురువారం స్థానిక ఎస్పీ కార్యాలయంలోని గెలాక్సీ భవన్‌లో పోలీసు స్టేషన్ రైటర్‌లు, ఎస్‌హెచ్‌ఓలకు నూతన చట్టాలు అమలు ,రికార్డుల నిర్వహణపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కొత్తగా అమలులోకి వచ్చిన క్రిమినల్ చట్టాల ప్రకారం ప్రతిపోలీస్ స్టేషన్‌లో రికార్డుల నిర్వహణకు నూతన ప్రొఫార్మపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. నూతన చట్టాల ప్రధాన లక్ష్యం డిజిటలైజేషన్, వేగవంతమైన న్యాయసాధన అని చెప్పారు. దీనిలో ఈ ఎఫ్ఐఆర్, జీరో ఎఫ్ఐఆర్ విధానాలు సమర్థవంతంగా చేయాలని అన్నారు. నేరాల దర్యాప్తు వేగవంతం చేయడానికి డిజిటలైజేషన్ దోహదపడుతుందన్నారు. రికార్డులు అన్నీ క్రైమ్‌అండ్‌క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్‌లో (సీసీటీఎన్ఎస్) అప్‌డేట్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్‌బీసీఐ దేవప్రభాకర్, సీఐ సూర్యనారాయణ, సిబ్బంది తదితర ఎస్సైలు పాల్గొన్నారు.

గ్రంథాలయాల సెస్సుకు సహకరించండి

- జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శివారెడ్డి

రాచర్ల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాలకు పంచాయతీలు కట్టాల్సిన సెస్సు కట్టేలా సహకరించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి డీవీ శివారెడ్డి ఎంపీడీవో ఎస్ వెంకటరామిరెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో ఐ వెంకటేష్‌ను కోరారు. గురువారం ఆయన రాచర్ల గ్రంథాలయాన్ని తనిఖీ చేశారు. గ్రంథాలయాల నిర్వహణ, విధి విధానాలు తదితర విషయాలపై గ్రంథపాలకుడు కే శ్రీధర్‌రెడ్డితో చర్చించారు. గ్రంథాలయంలో ఉన్న పుస్తక సామగ్రి రికార్డులు సక్రమంగా నిర్వహించుకోవాలని సూచించారు. లైబ్రరీ స్థలాన్ని పరిశీలించి అభివృద్ధి కోసం కమిటీని నియమించుకోవాలని అన్నారు. అనంతరం ఆయన ఎంపీడీవో కార్యాలయానికి చేరుకొని పంచాయతీలు, గ్రంథాలయాలకు చెల్లించవలసిన సెస్సు గురించి అధికారులతో చర్చించారు.



గ్రంథాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా కార్యదర్శి శివారెడ్డి

బడి పిలుస్తోంది..!

సినిమాలో కథలాగా వెనుకబడిన కరువు ప్రాంతం నుంచి వెళ్లేవారే కానీ వచ్చేవారే లేరన్నది గుర్తొస్తుంది. ఎప్పుడు ఉపాధ్యాయుల బదిలీలు జరిగినా జిల్లాలో ఎర్రగొండపాలెం ప్రాంతం నుంచి వెళ్లేవారే కానీ వచ్చేవారు కనిపించరు. అప్పడప్పుడూ ప్రభుత్వాలు డీఎస్సీలు నిర్వహించి కొత్తగా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తున్నా కౌన్సెలింగ్ ద్వారా భర్తీ అయ్యే ఖాళీల్లో జిల్లా కేంద్రానికి సమీపంలోని పాఠశాలలు, పట్టణ ప్రాంతాలు, రహదారికి ఆనుకుని ఉండే గ్రామాల పాఠశాలలను కోరుకోవడం తప్ప మారుమూల పల్లెల వైపు వారు కన్నెత్తి కూడా చూడరు. అదేమంటే మా ప్రయాణాలు సజావుగా జరగాలి కదా? మా పిల్లలను కూడా మేము పట్టణాల్లో చదివించుకోవాలి కదా అనే సమాధానాలు వాళ్లవైపు నుంచి వినిపిస్తుంటాయి. మరి మారుమూల పల్లెల పరిస్థితి ఏమిటనే దానికి సమాధానం దొరకడం లేదు. ఈసారి కొత్తగా మన గ్రామాల నుంచి ఉపాధ్యాయ పోస్టులు పొందిన వారైనా కనీసం మా గ్రామాల పాఠశాలలకు రావాలని ప్రజలు పిలుస్తున్నారు.

- కొత్త ఉపాధ్యాయుల కోసం ఎదురుచూపు
- కౌన్సెలింగ్ సమయంలో సొంత ప్రాంత ఖాళీలకు ప్రాధాన్యం ఇవ్వాలి
- మీ గ్రామాల్లో విద్యాభివృద్ధిని గుర్తుంచుకోండి
- ఇక్కడకొచ్చి పని చేయాలని ప్రజల విజ్ఞప్తి

త్రిపురాంతకం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) :జిల్లాలో ఇటీవల డీఎస్సీ ద్వారా మొత్తం 661 మంది ఎంపికైతే అందులో ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని గ్రామాల నుంచి ఎంపికైన వారు 94 మంది ఉండడం విశేషం. దీనిపైనే ఇప్పుడు ఎర్రగొండపాలెం ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రులు ఆశలు పెట్టుకుని ఉన్నారు. ప్రస్తుతం శిక్షణలో ఉన్న వీరు మరో రెండు రోజుల్లో కౌన్సెలింగ్ తరువాత పాఠశాలలను ఎంచుకుని కొత్తగా విధుల్లోకి చేరబోతున్నారు. ఈ కౌన్సెలింగ్‌లో ఇతర ఉపాధ్యాయులు వారికి అనుకూల ప్రాంతాలను ఎంచుకుంటే మళ్లీ ఇక్కడ పరిస్థితి అగమ్యగోచరమే. ఉదాహరణకు గతంలో జరిగిన బదిలీలు తదితర పరిణామాల వల్ల కొత్తపట్నం మండలంలో ఇప్పుడు 5 ఖాళీలు మాత్రమే ఉన్నాయి. కొరిశపాడు 5, లింగసముద్రం మండలంలో 3 ఖాళీలు మాత్రమే ఉన్నాయి. కానీ ప్రస్తుతం ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో అత్యధిక పాఠశాలల్లో ఖాళీలు ఉన్నాయి. ఎర్రగొండపాలెం మండలంలో 169, పుల్లలచెరువు మండలంలో 138, పెద్దారవీడు మండలంలో 98, దోర్నాల మండలంలో 89, త్రిపురాంతకం మండలంలో 81 ఖాళీలు ఉన్నాయి. ఇవన్నీ ఇక్కడ పనిచేస్తూ ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లిపోయిన వారి కారణంగా ఏర్పడిన ఖాళీలు. అంటే ఇక్కడకు వచ్చేవారి సంఖ్య తక్కువ, వెళ్లే వారి సంఖ్య ఎక్కువ. ప్రతీసారీ ఇదే జరుగుతుంది. అందుకే కనీసం ఇప్పుడు కౌన్సెలింగ్‌లో ఈ ప్రాంతం నుంచి ఉద్యోగం పొందిన వారైనా ఇక్కడ పనిచేసేందుకు రావాలని వారికి ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. సొంత గ్రామాల్లో మీరందించే సేవలు భావితరాలకు బంగారు బాటలు వేసేలా ప్రాధాన్యత కల్పించాలి. ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా స్థానికంగా పనిచేసేందుకు వస్తే, వారితో పాటు కోరుకునే ఇతరులతో కలిపి కనీసం ఉన్న ఖాళీల్లో 40 శాతం భర్తీ అయ్యే అవకాశాలు ఉన్నాయని ఉద్యోగ వర్గాలు కూడా చెప్తున్నారు. మరి త్వరలోనే పాఠశాలలకు రాబోతున్న వారిలో ఎంతమంది ఇక్కడకు వస్తారో అని ప్రజలు ఆశతో ఎదురుచూస్తున్నారు.



పుల్లలచెరువు ప్రభుత్వ ఉన్నత పాఠశాల

ముగిసిన అంతరిక్ష వారోత్సవాలు

- వివిధ పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం

ఒంగోలు విద్య, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : షార్, ఇస్రో, క్విస్ ఇంజనీరింగ్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన అంతరిక్ష వారోత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. క్విస్ విద్యా సంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీగాయత్రిల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో షార్ చీఫ్ జనరల్ మేనేజర్ వెంకటరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వెంకటరెడ్డి మాట్లాడుతూ ఇస్రో చేసిన వివిధ ప్రయోగాలను వివరించారు. రానున్న రోజుల్లో మరిన్ని ప్రయోగాలను చేయనున్నట్లు తెలిపారు. వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రభుత్వం సైన్స్ రంగంలో అనేకం చేపట్టనుందని, భారతీయ అంతరిక్ష స్టేషన్‌ను నిర్మించే దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది లివ్ ఇన్ స్పేస్ కాన్సెప్ట్‌తో అంతరిక్ష వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల్లో, విద్యార్థుల్లో సైన్స్‌పై అవగాహన కల్పించాలనే లక్ష్యంతో ఇటువంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఒంగోలులో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎంతో మంది విద్యార్థులు తరలివచ్చారని, క్విస్ విద్యా సంస్థల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కాగా వివిధ పాఠశాలలు, కాలేజీలకు చెందిన 3వేల మందికి పైగా విద్యార్థులు ఈ వారోత్సవాల్లో పాల్గొని స్పేస్ ఎగ్జిబిషన్, ప్రాజెక్టు ఎక్స్‌పోను తిలకించారు. ఎక్స్‌పో, పెయింటింగ్ పోటీలు, క్విజ్, పోస్టర్ ప్రజెంటేషన్ తదితర పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్విస్ కళాశాల డీపీఎస్ఆర్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కేవీజే భార్గవ్, డైరెక్టర్ డాక్టర్ బీవీ సుబ్బారావు, వరల్డ్ స్పేస్ వీక్ 25 ఒంగోలు సబ్ కమిటీ చైర్మన్ లీలా నాగ శ్రీనివాసరావు, మెంబర్ సెక్రటరి ఆదిత్య, ఇస్రో అధికారులు రామాంజనేయులు, అప్పారావు, శివ నాగిరెడ్డి, క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ హనుమంతరావు తదితరులు ఉన్నారు.





స్పేస్‌పై డ్రాయింగ్ పోటీలలో పాల్గొన విద్యార్థినులు (ఇన్‌సెట్లో) రాకెట్ గురించి వివరిస్తున్న విద్యార్థిని



స్పేస్‌లో వ్యవసాయంపై మాట్లాడుతున్న క్విస్ విద్యార్థులు

సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్‌పై అవగాహన ర్యాలీ

- జీఎస్టీ సంస్కరణలతో వైద్య చికిత్సలు పరికరాలు, మందులు అందుబాటులోకి
- జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీఎస్టీ 2.0 సంస్కరణలతో వైద్యచికిత్సలు పొందేందుకు నిత్యం ప్రజలు వినియోగించే మందులు, వైద్య పరికరాలు, అత్యవసర మందులు అందుబాటు ధరలకు లభించే విధంగా చర్యలు తీసుకుందని జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ అన్నారు. ఔషధ నియంత్రణ శాఖ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రమైన ఒంగోలులో గురువారం సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ అవగాహన ర్యాలీని జాయింట్ కలెక్టర్ ప్రారంభించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి నెల్లూరు బస్టాండు మీదుగా మినీస్టేడియం వరకు ఈ ర్యాలీజరిగింది.

ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో జేసీ మాట్లాడుతూ ఆయా మందులను 12శాతం నుంచి ఐదుశాతానికి తగ్గించిందన్నారు. అందువల్ల ఆ తగ్గింపు వినియోగదారులకు చేరేలా చూడాల్సిన బాధ్యత సంబంధిత శాఖల అధికారులపై ఉందన్నారు. సవరించిన ధరల జాబితాలను ప్రతిమెడికల్ షాపులో స్పష్టంగా ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని జేసీ సూచించారు. ఔషధ నియంత్రణ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వీఎస్ జ్యోతి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మెడికల్ షాపులను తనిఖీలు నిర్వహించి సవరించిన జీఎస్టీ ధరల ప్రకారం విక్రయాలు జరుగుతున్నాయో లేదో పరిశీలించాలన్నారు. సవరించిన జీఎస్టీ2.0 నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయించాలన్నారు. ఎక్కడైనా అధిక ధరలకు విక్రయించే షాపులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు వల్ల అత్యవసర మందులు కొనుగోలు చేసేందుకు ధరలు బాగా తగ్గాయన్నారు. ధరలు తగ్గుదలపై ప్రతి ఒక్కరూ అవగాహన పొందాలని అన్నారు. ఈకార్యక్రమంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీరామమూర్తి, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు డాక్టర్ ఎం. శ్రీనివాస్‌నాయక్, డాక్టర్ భగీరథి, డాక్టర్ సూరిబాబు, జిల్లా మీడియా అధికారి బెల్లం నరసింహారావు, ఇన్‌చార్జి మాస్‌మీడియా అధికారి శ్రీనివాసరావు, డ్రగ్ డీలర్స్ అసోసియేషన్, రిటైల్ కెమిస్టుల అసోసియేషన్, హోల్ సెల్ డీలర్స్ అసోసియేషన్, వీసీడీ అసోసియేషన్ నాయకులు డి. కృష్ణారెడ్డి, వి. సుబ్బారావు, జీ వెంకారెడ్డి, అంకిరెడ్డి, ఎం. రవి, రమణ, సుబ్బారావు తదితరులు ఉన్నారు.



జీఎస్టీపై అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న జేసీ గోపాలకృష్ణ

రాష్ట్రంలో విచ్చలవిడిగా నకిలీ మద్యం

- రాజ్యసభ సభ్యుడు వైవీ ఆరోపణ

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) :రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మద్యం దుకాణాలు, బెల్టు షాపుల ద్వారా కల్తీ మద్యం విక్రయాలు చేస్తున్నారని రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి ఆరోపించారు. స్థానిక లాయర్‌పేటలోని ఆయన నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కల్తీ మద్యం లేకుండా ప్రభుత్వ దుకాణాల ద్వారా నాణ్యత ఉన్న మద్యం అమ్మకాలు జరిగాయన్నారు. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మద్యం విధానంలో అనేక అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. షాపులను కూటమి ప్రభుత్వంలోని అధికార పార్టీ నాయకులు దక్కించుకొని ఇష్టారీతిన మద్యం అమ్మకాలను చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మద్య నియంత్రణ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే నర్సీపట్నంలో మెడికల్ కాలేజీని పరిశీలించేందుకు వెళ్లిన జగన్మోహన్‌రెడ్డిని అడ్డుకొనేందుకు అనేక కుట్రలు పన్నారని ఆరోపించారు. ప్రభుత్వ ఆధీనంలో ఉండాల్సిన మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గంగా ఉందన్నారు. ఈవిధానాలను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు చుండూరి రవిబాబు, వై. వెంకటేశ్వరరావుతో పాటు పలువురు వైసీపీ నాయకులు ఉన్నారు.



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి



జిల్లా స్థాయి పెన్షనర్ల సదస్సులో మాట్లాడుతున్న లక్ష్మణరావు

పెన్షనర్లకు నష్టం కలిగించే
విధానాలను రద్దు చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : పెన్షనర్ల ప్రయోజనాలకు తీవ్ర నష్టం కలిగించే పెన్షన్ వ్యాలిడేషన్ సవరణ క్లాజును కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని శాసనమండలి మాజీ సభ్యుడు కేఎస్ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎన్‌జీవో భవన్‌లో జరిగిన జిల్లా స్థాయి సదస్సుకు జిల్లా అధ్యక్షుడు జి. శేషయ్య అధ్యక్షత వహించారు. సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న లక్ష్మణరావు మాట్లాడుతూ ఈ క్లాజు వల్ల ప్రస్తుతానికి కేంద్ర ప్రభుత్వపెన్షన్‌దారులకు, భవిష్యత్‌లో రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్‌దారులకు పెన్షన్‌లో పెరుగుదల ఉండదన్నారు. అందువల్ల ఈ విధానాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే సత్తిరాజు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షనర్లు, ఉద్యోగుల ప్రయోజనాలకు విఘాతం కలిగించే విధంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. ప్రపంచ బ్యాంకు షరతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తలొగ్గి పెన్షన్లు, జీతభత్యాలను ఏ విధంగా కోత పెట్టాలో ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. ఈపీఎఫ్ పెన్షనర్లకు రూ వెయ్యినుంచి 4వేల వరకు మాత్రమే నెలసరి పెన్షన్ వస్తోందని, ఇంత తక్కువ పెన్షన్ ఒక ఎమ్మెల్యే లేదా మాజీ ఎమ్మెల్యే తన కుటుంబాన్ని నడపగలరా అని ప్రశ్నించారు. ఎన్‌జీవో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే శరత్‌బాబు, ఆర్‌సీహెచ్ కృష్ణారెడ్డిలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు వెంటనే పీఆర్సీ కమిటీని నియమించి 30శాతం ఐఆర్ మంజూరు చేయాలన్నారు. పీఆర్సీ డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కే సుబ్బారావు మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు నాగేశ్వరరావు, బ్రహ్మానందరెడ్డి, దశరథరామయ్య, వి.రత్నం, ఎస్.పోలేరయ్య, వీ. కొండయ్య, గురువారెడ్డి, కే వెంకటేశ్వర్లు, వీరాస్వామి, శ్రీనివాసరావు, మీనాకుమారి, రాజ్యలక్ష్మి, సంజీవరావు, కాలం సుబ్బారావు, చీకటి శ్రీనివాసరావు, సీహెచ్ రాంబాబు ఉన్నారు.

సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ బదిలీ



మార్కాపురం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం సబ్ కలెక్టర్ బి.సహదిత్ వెంకట్ త్రివినాగ్ బదిలీ అయ్యారు. ప్రభుత్వం 31 మంది ఐఏఎస్‌లను బదిలీ చేసింది. అందులో భాగంగా మార్కాపురం సబ్ కలెక్టర్‌గా పనిచేస్తున్న వెంకట్ త్రివినాగ్‌ను గృహ నిర్మాణశాఖ డిప్యూటీ సెక్రటరీగా నియమించింది. 2022 బ్యాచ్‌కు చెందిన ఈయన 2024 సెప్టెంబర్‌లో మార్కాపురం సబ్ కలెక్టర్‌గా విధుల్లో చేరారు. ఆయనకు ఇదే మొదటి పోస్టింగ్. విధులపట్ల నిబద్ధత కలిగిన అధికారిగా పేరు తెచ్చుకున్నారు. ఏడాది పాటు పనిచేసినా కింది స్థాయి సిబ్బంది, ప్రజల నుంచి చురుకైన అధికారిగా మన్ననలు పొందారు.

గాలిగోపుర నిర్మాణానికి భారీ విరాళం


చెక్కును అందజేస్తున్న లక్ష్మీనరసింహారావు

ఒంగోలు కల్చరల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం రంగారాయుడు చెరువు దగ్గర బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో పునర్నిర్మాణం జరుగుతున్న శ్రీభువనేశ్వరి సమేత పశుపతీశ్వరస్వామి దేవస్థాన గాలి గోపుర నిర్మాణానికి పద్య సారస్వత పరిషత్ జాతీయ అధ్యక్షుడు చదలవాడ లక్ష్మీనరసింహారావు భారీ విరాళాన్ని అందజేశారు. ఈ మేరకు రూ.7లక్షల చెక్కును ఆయన అడ్వాన్సుగా గురువారం బ్రాహ్మణ సేవా సమితి కార్యవర్గానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన భార్య చదలవాడ కామేశ్వరి జ్ఞాపకార్థం గాలి గోపుర నిర్మాణ పూర్తి ఖర్చును తాను విరాళంగా ఇస్తున్నట్లు చెప్పారు. అనంతరం సేవాసమితి సభ్యులు లక్ష్మీనరసింహారావును సత్కరించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు సీవీఎల్.సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులు మహంకాళి వెంకట శేషయ్య, గంజాం శ్రీరంగనాథ్, సముద్రాల భీమశంకరశాస్త్రి పాల్గొన్నారు.

ఉద్యోగుల ఆర్థిక బకాయిలను విడుదల చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక బకాయిలను ప్రభుత్వం విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో గురువారం స్థానిక దివ్యాంగుల కార్యాలయంలో టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్.సూర్యనారాయణ వీడియో సందేశాన్ని ఉద్యోగులకు వినిపించారు. అనంతరం కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు గత కొంతకాలంగా ఆర్థిక బకాయిలు విడుదల కాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పీఆర్సీ ఇచ్చేందుకు కమిటీని నియమించి ఐఆర్‌ను ప్రకటించాలన్నారు. ఉద్యోగులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, వాటిని పరిష్కరించేవిధంగా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎం.శ్రీనివాసరావు, చంద్రశేఖర్, పద్మజ, మురళీ, విజయకుమారి, శ్రీనివాసరావు, పోలినేని వెంకటేశ్వర్లు, నిర్మల, ఆదాం, దయకుమారి తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో ప్రథమ బహుమతి

కొండపి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా ఒంగోలు క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో కె.ఉప్పలపాడు జడ్పీ స్కూల్‌లో టెన్త్ చదువుతున్న సోమరాజుపల్లి శృతి ప్రథమ బహుమతి సాధించింది. ఈ సందర్భంగా మెమొంటో, ప్రశంసాపత్రం అందుకున్న శృతిని ఎంఈవోలు కె.సురేఖ, పి.రామారావు గురువారం స్కూల్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు. స్కూల్ హెచ్ఎం వి.సునన్నకుమార్, స్కూల్ ఎస్ఎంసీ చైర్మన్ సోమరాజుపల్లి రాఘవేంద్రశర్మ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

ఎమ్మెల్యే దామచర్ల ● నగర సుందరీకరణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశం ● కార్పొరేషన్ అధికారులతో సమీక్ష


లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగర అభివృద్ధి కోసం చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, అలాగే నగర సుందరీకరణ కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఆదేశించారు. గురువారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో ఇంజనీరింగ్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, శానిటేషన్ విభాగాల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ అభివృద్ధి పనులకు ఆదాయ వనరులైన పన్నుల వసూళ్లలో పురోగతి సాధించాలన్నారు. ఇంజనీరింగ్ అధికారులు డివిజన్ వారీగా అవసరమైన అభివృద్ధి పనులకు అంచనాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. త్వరలోనే రూ.8 కోట్లతో గుంటూరు రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టనుండగా, నగర సుందరీకరణ కోసం సెంటర్ డివైడర్లు, ఫుట్‌పాత్‌లు, పూర్తి స్థాయిలో బాగు చేయాలని తెలిపారు. ఈనెల 23వ తేదీన నగరంలో 5వేల పూల మొక్కలు పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రత్యేకించి ట్రంక్‌రోడ్డు విస్తరణపై అధికారులు త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. 80అడుగులకు రోడ్డు విస్తరణ చేయనుండగా, అందుకు సంబంధించి వ్యాపారులకు మరోసారి నోటీసులు జారీ చేసి, సంక్రాంతి నాటికి పనులు ప్రారంభం అయ్యేలా చూడాలని స్పష్టం చేశారు. అలాగే పెద్ద మసీద్ వద్ద మెయిన్ డ్రైన్‌పై ఆక్రమణలు తొలగించాలని ఆదేశించారు. కొద్దిపాటి వర్షం కురిసినా నీరు రోడ్లపైకి చేరుతుందని, క్రమం తప్పకుండా కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలని సూచించారు. అలాగే ఇప్పటికే చేపట్టిన అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా కమిషనర్, ఎంఈ ఎప్పటికప్పుడు పరిశీలన చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలోనే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని, వచ్చే ఏడాదిలోపు నగర రూపు రేఖలు మార్చి కార్పొరేట్ హంగులతో తీర్చి దిద్దాలన్నారు. అందుకోసం కేంద్ర, రాష్ట్రం నుంచి రావాల్సిన నిధులను తాను తీసుకువచ్చేందుకు కృషి చేస్తాని తెలిపారు. అలాగే శ్మశాన వాటికల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. త్వరలోనే పనుల పురోగతిపై మరోసారి సమీక్ష నిర్వహిస్తానని ఎమ్మెల్యే అధికారులకు వెల్లడించారు. సమావేశంలో మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి, కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, ఎండీ ఏసయ్య, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌తో భరోసా

సీఎం సహాయ నిధి ద్వారా పేదల ఆరోగ్యానికి భరోసా లభిస్తుందని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం తన నివాసంలో 36మంది లబ్ధిదారులకు రూ.65.36లక్షల విలువైన చెక్కులను అందజేశారు. ప్రతి కుటుంబం సంతోషంగా ఉండాలన్నదే ప్రభుత్వం లక్ష్యమని తెలిపారు. లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు.

మర్రిపూడి మండల తెలుగు యువత అధ్యక్షుడిగా 'మాకినేని'


సత్యను సన్మానిస్తున్న శ్రీనివాసరావు, రాజేష్

మర్రిపూడి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : మర్రిపూడి మండల తెలుగు యువత అధ్యక్షుడిగా చిలంకూరు గ్రామానికి చెందిన మాకినేని శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా శివరాయునిపేటకు చెందిన గురిజాల రాజేష్‌లను నియమించారు. ఆమేరకు వారు ఉత్తర్వులను అందుకున్నారు. ప్రముఖ వ్యాపారవేత్తగా అచ్చమ్మ గ్రూప్ ఆఫ్ అధినేతగా రాజేష్ మండలంలో పలుసేవా కార్యక్రమాలతో పాల్గొంటున్నారు. శ్రీనివాసరావు చిలంకూరు క్రియాశీలక నేతగా గుర్తింపు పొందారు. ఈ సందర్భంగా వారు గురువారం మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యను కలిసి సత్కరించారు.

మాగుంటకు సత్కారం


ఎంపీ మాగుంటను సత్కరిస్తున్న చైర్మన్ వెంకట్రావు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో గురువారం లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డిని ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ రాచగర్ల వెంకట్రావు తన కుటుంబ సభ్యులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాగుంటను శాలువతో సత్కరించి బొకే అందజేశారు. వెంకట్రావు తన కుటుంబ సభ్యులను ఎంపీకి పరిచయం చేశారు.

సీఎంను కలిసిన మాగుంట

సీఎం చంద్రబాబు నాయుడును ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి గురువారం సాయంత్రం ఉండవల్లిలోని సీఎం కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఒంగోలు విమానాశ్రయంతో పాటు వైపాలెం నియోజకవర్గంలో 39 రోడ్ల నిర్మాణానికి పీఎంజీఎస్‌వై పథకం కింద నిధులు మంజూరు, కోస్టల్ కారిడార్‌రోడ్డు నిర్మాణం, పీఎంఈ బస్సు సేవ పథకం తదితర అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఆయా సమస్యలపై సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించి ఆయా పనులు చేపట్టేలా హామీ ఇచ్చారని మాగుంట పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఒంగోలు క్రైం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా నగరంలోని పలుప్రాంతాలలో శుక్రవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ పాండురంగరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక కర్నూల్‌రోడ్, శ్రీరామ్‌కాలనీ, గణపతినగర్, విరాట్ నగర్, చైతన్యనగర్, ఆంధ్రకేసరినగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు పేర్కొన్నారు.

సచివాలయంలో ఎలక్ట్రానిక్ వస్తువుల ప్రదర్శన

సంతనూతలపాడు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చొరవతో జీఎస్టీ తగ్గింపులో భాగంగా అనేకరకమైన ఎలక్ట్రానిక్ వస్తువుల ధరలు తగ్గాయని, వీటినికి సంబంధించి ఈనెల 10, 11వ తేదీల్లో ఎలక్ట్రానిక్ వస్తువులను సంబంధిత శాఖవారు సంతనూతలపాడు సచివాలయం వద్ద ప్రదర్శిస్తారని ఎంపీడీవో డి.సురేష్‌బాబు గురువారం తెలిపారు. ఏ వస్తువు ఎంతమేర తగ్గిందో సంబంధిత అధికారులు వివరిస్తారని ఆయన పేర్కొన్నారు.

విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన

సంతనూతలపాడు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులో గురువారం స్థానిక జడ్పీహైస్కూల్లో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో విద్యార్థులకు మానసిక, శారీరక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కెరీర్ అండ్ మెంటల్ కౌన్సిలర్ పి.గ్రేస్‌పుష్పరాగం విద్యార్థులకు పలు సూచనలను చేశారు.

జీఎస్టీ తగ్గింపుతో వైద్యరంగంలో వెసులుబాటు

● జేసీ గోపాలకృష్ణ
● వెంకటరమణ హాస్పిటల్‌లో అవగాహన సదస్సు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ గోపాలకృష్ణ, డాక్టర్ సీతారామయ్య, వైద్యులు


జీజీహెచ్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిన నూతన జీఎస్టీ తగ్గింపుతో వైద్య రంగంలోనూ విలువైన వైద్యసేవలకు వెసులుబాటు లభించిందని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ పేర్కొన్నారు. గురువారం ఒంగోలులోని వెంకటరమణ హాస్పిటల్‌లో జీఎస్టీ తగ్గింపుపై వెంకటరమణ హాస్పిటల్, ఎన్టీఆర్ వైద్య సేవ సంయుక్తంగా నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నూతన జీఎస్టీతో అన్ని వస్తువులతో పాటు వైద్య రంగంలో కూడా వెసులుబాటును కల్పించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత నెల 21 నుంచి అక్టోబరు 19వ తేదీ వరకు జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు అవగాహన కల్పించాలని నిర్ణయించిందన్నారు. ప్రజలు జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కలిగి ఉండాలని, సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య మాట్లాడుతూ వైద్యరంగంలో ప్రతి దానిలో జీఎస్టీ తగ్గిందన్నారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ కామేపల్లి చంద్రశేఖర్, కంటి వైద్య నిపుణుల సుబ్రహ్మణ్యేశ్వరి, ఎన్టీఆర్ వైద్యసేవ కో ఆర్డినేటర్ డాక్టర్ పోతకమూరి హేమంత్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో..

స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో జీఎస్టీ తగ్గింపుపై అవగాహన ర్యాలీని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు మాట్లాడుతూ వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు ఆర్థిక వెసులుబాటు కల్పించిందని చెప్పారు. మెడికల్ షాపులు, వైద్య పరికరాలు, ఇతర వైద్య సేవల్లో జీఎస్టీ తగ్గింపుపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంవో డాక్టర్ మాధవిలత, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ తిరుపతిరెడ్డి, హెచ్‌వోడీ డాక్టర్ ప్రభాకర్, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ చెంచయ్య, పలువురు వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఒడా చైర్మన్‌కు సత్కారం


చైర్మన్ రియాజ్‌ను సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ షేక్ రియాజ్‌ను టీడీపీ నాయకులు సత్కరించారు. గురువారం స్థానిక సంతపేటలోని ఒడా కార్యాలయంలో కొల్లిపల్లి సురేష్ ఆధ్వర్యంలో రియాజ్‌ను కలిసి శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు డైరెక్టర్ పప్పు శ్రీను, టీడీపీ 25వ డివిజన్ అధ్యక్షుడు పులివర్తి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సంతకాల సేకరణ : వైసీపీ

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో ప్రైవేటీకరణ చేసేందుకు చర్యలు తీసుకోవడం దుర్మార్గంగా ఉందని వైసీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి ఆరోపించారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేసే విధానాలను వైఖరిని వ్యతిరేకిస్తూ శుక్రవారం నుంచి ఈనెల 22వరకు ప్రతి నియోజకవర్గంలో సంతకాల సేకరణ, 28న నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు, వచ్చేనెల 12న నియోజకవర్గాల నుంచి సంతకాలు చేసిన వినతిపత్రాలను జిల్లాకేంద్రాలకు చేర్చే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు 26న వాటని గవర్నర్‌కు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి అదెన్న, కేవీ.రమణారెడ్డి, వై.వెంకటేశ్వరరావు, బొట్ల రామారావు, పాలడుగు రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేసిన నిందితుడిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని రాష్ట్ర మాల ఉద్యోగుల అధ్యక్షుడు టి.అశోక్ డిమాండ్ చేశారు. జిల్లా మాల జేఏసీ, ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో గురువారం రాత్రి స్థానిక కలెక్టరేట్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. సీజేపై దాడి చేయడం సభ్యసమాజం సిగ్గుపడాలన్నారు. ఇటువంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎం.రవికుమార్, లక్ష్మణ్, నారాయణ, శాంతారావు, బి.రాజు, చక్రవర్తి, ఆదిశేషు, వెంకట్రావు, సుదర్శన్, శోభన్, పోతురాజు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం నిందితుడి దిష్టిబొమ్మను దహనం చేశారు.

అనంతపురంలో ఐద్వా రాష్ట్ర మహాసభలు

కొండపి, అక్టోబరు9 (ఆంధ్రజ్యోతి): ఈనెల 13, 14, 15 తేదీల్లో అనంతపురంలో జరిగే ఐద్వా రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని మిట్టపాలెం గ్రామంలో ఆమె ఐద్వా పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలోని మహిళలతో ఆమె మాట్లాడారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభలో చర్చించి భవిష్యత్ కార్యక్రమాలకు మహాసభలు వేదికగా మారనున్నాయన్నారు. కార్యక్రమంలో మిట్టపాలెం గ్రామ కమిటీ సభ్యులు సిహెచ్ ఎస్తేరమ్మ, సౌజన్య, ఏసమ్మ, విశ్రాంత, ప్రమీల, విమల పాల్గొన్నారు.

బాణసంచా విక్రయానికి అనుమతి తప్పనిసరి : ఎస్ఐ

పొన్నలూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పొన్నలూరులో గురువారం ఎస్ఐ అనుక్, పోలీస్ సిబ్బంది పలు దుకాణాల్లో తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా బాణసంచా అక్రమంగా నిల్వ ఉంచినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని తెలిపారు. లైసెన్స్ గల దుకాణాదారులు మాత్రమే బాణసంచా అమ్మాలని, మిగతా ఎవరు విక్రయించినా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

డ్వాక్రా రుణాలను మొబైల్ యాప్ ద్వారానే రికవరీ చేయాలి

● స్త్రీనిధి డీజీఎం ఉమామహేశ్వరరావు
● సీసీలు, వీవోఏలతో సమీక్ష



మాట్లాడుతున్న డీజీఎం ఉమామహేశ్వరరావు

కొండపి, అక్టోబరు9 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక గ్రూపు సభ్యులు తీసుకున్న గ్రూపు, వ్యక్తిగత రుణాలను ఇకపై మొబైల్ యాప్ ద్వారానే రికవరీ చేయాలని వెలుగు స్త్రీనిధి డీజీఎం అల్లు ఉమామహేశ్వరరావు అన్నారు. గురువారం ఆయన కొండపిలోని వెలుగు కార్యాలయంలో సీసీలు, వీవోఏల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణాల మంజూరు, రికవరీల్లో అవకతవకలు లేకుండా ప్రభుత్వం గట్టి చర్యలు చేపట్టిందని, నిబంధనలకు విరుద్ధంగా రికవరీలను వ్యక్తిగతంగా వసూలు చేసినా, వాడుకున్నా కఠిన చర్యలు ఉంటాయని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. మండలానికి రూ.15 కోట్ల వరకు స్త్రీనిధి రుణాలు ఇచ్చే అవకాశం ఉందని ఆయన అన్నారు. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ ద్వారా జీవనోపాదుల పెంపునకు రూ.50 లక్షల రుణం ఇచ్చే అవకాశం ఉందని, ఎన్ఆర్ఎల్ఎం-సీఐఎఫ్ రుణాలు రూ.19 లక్షలా 50 వేల వరకు రుణాలు మహిళలకు ఇచ్చే అవకాశం ఉందని, అర్హులైన వారిని గుర్తించి వారికి రుణ సౌకర్యం కల్పించాలని డీజీఎం ఆదేశించారు. జీవనోపాదులు పెంపునకు, స్వయం ఉపాధికి ఈ రుణాలు సద్వినియోగం అయ్యేలా చూడాలని సీసీలకు ఆయన సూచించారు. వీవోఏలకు డివైజర్లు అందజేశారు. సమావేశంలో స్త్రీనిధి జిల్లా మేనేజర్ ఎం. శ్రీనివాసులు, వెలుగు ఏపీఎం బి.గోపీనాథ్, సీసీలు డి.మల్లికార్జున, వి.కృష్ణారెడ్డి, సీహెచ్.గోవిందమ్మ, కె.రామానుజులు, కె.రమణమ్మ, కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

సీజనల్ పండ్లు తప్పనిసరిగా తీసుకోవాలి

● సీడీపీవో సుశీలాదేవి


మాట్లాడుతున్న సీడీపీవో సుశీలాదేవి

కొండపి, అక్టోబరు9 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, కిశోర బాలికలు, చిన్నారులు సీజనల్‌గా లభించే పండ్లను తప్పనిసరిగా ఆహారంగా తీసుకోవాలని ఐసీడీఎస్ కొండపి ప్రాజెక్ట్ సీడీపీవో బి.సుశీలాదేవి అన్నారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా గురువారం పెరిదేపిలోని అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన పోషకాహారంపై అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఎత్తు ప్రకారం బరువు ఉండేలా చూసుకోవాలని, సమతుల్య ఆహారం తీసుకోవాలని, రక్త హీనత లేకుండా చూసుకోవాలని ఆమె సూచించారు. సమావేశంలో సూపర్‌వైజర్ విక్టోరియారాణి, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులను చేపట్టాలి

● ఎంపీడీవో సురేష్‌బాబు


చెత్త సేకరణను పరిశీలిస్తున్న ఎంపీడీవో సురేష్‌బాబు

సంతనూతలపాడు, అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు విధిగా నిర్వహించాలని ఎంపీడీవో డి.సురేష్‌బాబు ఆదేశించారు. గురువారం పి.గుడిపాడులో జరుగుతున్న ఇంటింటి చెత్త సేకరణను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లోని సైడ్‌కాలువల్లో చెత్తను ఎప్పటికపుడు తొలగించాలని, అంటువ్యాధులు ప్రబలకుండా సైడు కాలువల వద్ద బ్లీచింగ్ చల్లించాలని, రాత్రివేళల్లో దోమలు వృద్ధి చెందకుండా ఫాగింగ్ చేయించాలని చెప్పారు. తాగునీటిని క్లోరినేషన్ చేయించాలని కార్యదర్శులకు సూచించారు.

- సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయంలో స్వామిత్వ సర్వేపై ఎంపీడీవో సురేష్‌బాబు సమీక్ష చేశారు. గంగవరం రెవెన్యూ క్లస్టర్‌లోని పనులకు సంబంధించి అధికారులతో మాట్లాడారు.

రైతులకు అవగాహన

సంతనూతలపాడు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొడ్డువారిపాలెం, చిలకపాడు, పి.తక్కెళ్లపాడు గ్రామాల్లో గురువారం వ్యవసాయశాఖ, ఒంగోలు ఆత్మ ఆధ్వర్యంలో ప్రదర్శన క్షేత్రం నిర్వహించారు. ఏవో పావని, ఆత్మ బీటీఎం జి.క్రిష్ణ రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.


తనిఖీ చేస్తున్న ర్యాక్సీ జాగిలం

పోలీసుల విస్తృత తనిఖీలు

గిద్దలూరు టౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు పట్టణంలోని పలు ప్రాంతాలలో బుధవారం పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. గిద్దలూరు అర్బన్, రూరల్ సీఐలు కె.సురేష్, రామకోటయ్య ఆధ్వర్యంలో నార్కోటిక్ శిక్షణ పొందిన రాక్సీ జాగిలం హ్యాండ్లర్ వెంకటేశ్వర్లుతో కలిసి పట్టణంలోని రైల్వేస్టేషన్, బస్టాండ్, అర్బన్‌కాలనీ, పలు దేవాలయాలు, మార్కెట్ ప్రాంతం, దిగువమెట్ట తాండా, రైల్వేస్టేషన్, పీఆర్ కాలేజి ప్రాంతాలలో విస్తృతంగా తనిఖీలు చేశారు. పేలుడు పదార్థాలు, గంజాయి, నిషేధిత వస్తువుల తరలింపును అరికట్టడమే ఈ తనిఖీల లక్ష్యమని సీఐలు సురేష్, రామకోటయ్య తెలిపారు.

గోడౌన్‌లో జాగ్రత్తలు పాటించండి

రాచర్ల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : టపాకాయలు స్టాక్ ఉన్న గోడౌన్‌లో తగు జాగ్రత్తలు పాటించాలని గిద్దలూరు రూరల్ సీఐ జె.రామకోటయ్య అన్నారు. మండలంలోని ఎడవల్లి గ్రామ సమీపంలో ఉన్న టపాకాయల గోడౌన్‌లను గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. దీపావళి సందర్భంగా ప్రజలు టపాకాయల కొనుగోలు కోసం గోడౌన్ వద్దకు వస్తుంటారని అలాంటి సమయాల్లో పేలుడు పదార్థాల వలన ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా యాజమాన్యం తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. లైసెన్స్ లేకుండా ప్రభుత్వ అనుమతి పొందకుండా అమ్మకాలు జరపడం, నిల్వ ఉంచడం నేరమన్నారు. ప్రభుత్వ అనుమతి పొందిన తర్వాతే విక్రయాలు జరపాలని సూచించారు. అనంతరం ఆయన రికార్డులు పరిశీలించి స్టాక్ వివరాలను షాప్ యజమానులను అడిగి తెలుసుకున్నారు.

నేటి నుంచి బోధనేతర పనుల బహిష్కరణ

రాచర్ల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఫ్యాప్టో పిలుపుమేరకు నేటి నుంచి విధులను బహిష్కరిస్తున్నామని ఉపాధ్యాయ సంఘాలు తెలిపాయి. ఈ మేరకు మండల విద్యాశాఖ అధికారి షేక్ మొయినుద్దీన్‌కు సంఘ ప్రతినిధులు బుధవారం ఎంఈవో కార్యాలయంలో మెమొరాండం అందజేశారు. మితిమీరిన బోధనేతర కార్యక్రమాల వలన బోధన సమయం హరించుకుపోతుందని ఉపాధ్యాయులకు బోధనపై ఆసక్తి తగ్గిపోయేలా పనులు పెరిగిపోయాయని అన్నారు. ఈ సమస్యపై ఉన్నతాధికారులు స్పందించకపోవడంతో నేటి నుంచి విధులను బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పీ రమణారెడ్డి, జే సుధాకర్, ఎన్.చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, రమణయ్య, పవన్ కుమార్ ఉన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు మేలు

పొదిలి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ తగ్గింపుతో ప్రతి కుటుంబానికి ఎంతో మేలు జరుగుతందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సయ్యద్ ఇమాంసాహెబ్ అన్నారు. పట్టణంలోని విశ్వనాథపురంలో జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గోపి టీడీపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తలమళ్ల ఆనకట్టకు మరమ్మతులు

» త్వరలో పనులు చేపడతాం

» ఇరిగేషన్ అధికారులు


నిరుపయోగంగా ఉన్న ఆనకట్ట

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పొదిలి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలో అతి ప్రతిష్టాత్మకమైన తలమళ్ల ఆనకట్ట దీనస్థితిపై ఈనెల ఆరవ తేదీన దీనస్థితిలో మూసి ఆయకట్టు శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఇరిగేషన్ అధికారులు స్పందించారు. ఆనకట్టు లోతట్టు ప్రాంతం ఇసుక మేటలతో పూడిపోవడంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయింది. దీనికితోడు కాలువలు, తూములు శిథిలావస్థకు చేరాయి. పలు చోట్ల ప్రధాన కాలువకు గండ్లు పడ్డాయి. ఈ ఆయకట్టుకు మరమ్మతులు చేపడితే పొదిలి, మర్రిపూడి మండలాలకు వేల ఎకరాల్లో ఆయకట్టు రైతులకు ఊరట లభిస్తుంది. ఆహార ధాన్యాలతో పాటు పశువులు దాణా కొరత తీరుతుంది. ఆయా గ్రామాల్లో చెరువులను నింపవచ్చు. ఇప్పటికే ఇరిగేషన్ అధికారులు రూ.5కోట్ల40లక్షలతో మరమ్మతులకు ప్రాథమిక అంచనా రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, సాంఘిక శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి చొరవ తీసుకొని నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

ఘనంగా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి జన్మదిన వేడుకలు

తిరుమలలో స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే


తిరుమలలో స్వామివారి దర్శనం అనంతరం ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి


గిద్దలూరులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకుడు కృష్ణకిషోర్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. టీడీపీ శ్రేణులు గ్రామాల్లో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. పార్టీ కార్యాలయంలో భారీ కేక్‌ను ముత్తుముల కృష్ణకిశోర్‌రెడ్డి కట్ చేసి అభిమానులు పంచిపెట్టారు. ఏబీఎం పాలెం తెలుగు బాప్టిస్ట్ చర్చిలో టీడీపీ నాయకులు ప్రార్థనలు చేశారు. గాంధీబొమ్మ సెంటర్‌లో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్‌చైర్మన్ బైలడుగు బాలయ్య, గోడి ఓబులరెడ్డి, మార్తాల సుబ్బారెడ్డి, కౌన్సిలర్ బి.చంద్రశేఖర్‌యాదవ్, చిన్నశ్రీను, షానేషావలి, లొక్కు రమేష్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. కాగా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా తిరుమలలో శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతోపాటు నాయకులు అంబవరం శ్రీనివాసరెడ్డి, నంది శ్రీను, రామచంద్రారెడ్డి, పంచాయతీరాజ్ డీఈ సుబ్బారెడ్డి ఉన్నారు.

కంభం : కంభం, అర్ధవీడు మండలాలలో ఎమ్మెల్యే అశోక్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. కందులాపురం సెంటర్‌లో టీడీపీ నియోజకవర్గ నాయకుడు ముత్తుముల కృష్ణకిషోర్ రెడ్డి కేక్ కట్ చేశారు. కంభం అర్బన్ కాలనీలోని ఉర్దూ పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. అర్ధవీడు మండలం నాగులవరం, చీమలేటిపల్లి గ్రామాలలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గోన చెన్నకేశవులు, టీడీపీ ఎన్నారై రఫి, చిన్న కంభం యూనిట్ ఇన్చార్జి అలవల ప్రసాద్, తోట శ్రీనివాసులు పాల్గొన్నారు.

బేస్తవారపేట : పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో కృష్ణకిషోర్‌రెడ్డి, సోరెడ్డి మోహన్‌రెడ్డి, రాము, భూపాల్‌రెడ్డి, సైదులు, అనిత, సత్యేలి కృష్ణ పాల్గొన్నారు.

కొమరోలు : కొమరోలులో సొసైటీ అధ్యక్షుడు ముత్తుముల సంజీవరెడ్డి, తాటిచర్లమోటులో టీడీపీ మండలాధ్యక్షుడు బోనేని వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను ముత్తుముల కృష్ణకిషోర్‌రెడ్డి కట్‌చేసి పంచిపెట్టారు. రాజుపాలెంలో ఏఎంసీ వైస్ ప్రెసిడెంట్ గోడి ఓబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఇడమకల్లు సొసైటీ అధ్యక్షుడు బిజ్జం రవీంద్రారెడ్డి, డైరెక్టర్ తిరుమలరెడ్డి, వెంకటేశ్వర్లు, బాలిరెడ్డి, శంకర్ రెడ్డి, భూపాల్‌యాదవ్, అనపా వీరశేఖర్, గర్రె శేషు పాల్గొన్నారు.

రాచర్ల : ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి జన్మదిన వేడుకలను స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ (మండల పార్టీ అధ్యక్షుడు) కటికె యోగానంద్ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమానికి అహర్నిశలు పాటుపడుతున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ఎన్నో పుట్టిన రోజులు జరుపుకోవాలని, భగవంతుడు ఆయనకు మంచి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎరిక్షన్‌బాబు

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

» తాగునీటి పథకాన్ని ప్రారంభించిన ఎరిక్షన్‌బాబు

పెద్ద దోర్నాల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు పేర్కొన్నారు. మండలంలోని కటకానిపల్లె గ్రామంలో తాగునీటి పథకాన్ని ఎరిక్షన్‌బాబు గురువారం ప్రారంభించారు. గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించే క్రమంలో నూతనంగా బోరు వేయించి మోటార్‌ను ఏర్పాటు చేశారు. ప్రారంభించేందుకు వచ్చిన ఎరిక్షన్‌బాబుకు ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. చాన్నాళ్లుగా పడుతున్న నీటి ఇబ్బందులు తీర్చినందుకు ప్రజలు ఆయనకి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించి వారిలో ఆనందాన్ని చూడాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు షేక్ మహబూబ్ బాషా, టీడీపీ నాయకులు దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య, చంటి, కె సుబ్బారెడ్డి, ఎలకపాటి చంచయ్య, యోహాను,రావెళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

గ్రామ సభలలో పనులకు ఆమోదం

మార్కాపురం రూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : గ్రామ సభల ద్వారా ఉపాధి పనులకు ఆమోదం తెలపాలని ఏపీవో నాగరాజు తెలిపారు. మండలంలోని భూపతిపల్లి గ్రామంలోని సచివాలయంలో గురువారం ఎన్ఆర్ఈజీఎస్ పనుల ఆమోదంపై గ్రామ సభ నిర్వహించారు. ఆమోదం పొందిన పనులను ప్రాధాన్యతాక్రమంలో ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ కాశిం, సచివాలయ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

పెద్దారవీడు, అక్టోబరు 10 (అక్టోబరు) : గ్రామాలలో పారిశుధ్య పనులపై క్షేత్ర స్థాయి సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీవో ఎస్.జాన్‌సుందరం అన్నారు. మండలంలోని దేవరాజుగట్టులో గురువారం రోడ్ల వెంట ముఖ్యంగా ఈబీసీ కాలనీలో పర్యటించారు. గ్రామంలో రోడ్ల వెంట చెత్త ఎక్కువగా ఉండడం, ముఖ్యంగా ప్రజలకు తాగునీరు సరఫరా అయ్యే పైపు లైన్లు, కొళాయిల వద్ద పారిశుధ్యం అధ్వానంగా ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది ప్రతిరోజు గ్రామంలో విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ముఖ్యంగా అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న కారణంగా నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాలలో వీధుల వెంట బ్లీచింగ్ చల్లే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈబీసీ కాలనీలో చెడిపోయిన బోరుకు వెంటనే మరమ్మతులు చేయించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈని ఆదేశించారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో సహాయం

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): వాసవీ కుటుంబ స్వచ్ఛ పథకం కింద మహిళకు చెక్కును వాసవీ క్లబ్ నాయకులు గురువారం అందజేశారు. వాసవి, వనితా క్లబ్ సభ్యురాలు పెసల బాలమ్మ మరణించడంతో వారసుడు రవికుమార్‌కు రూ.4,0,3800 చెక్కును అందించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ నాయకులు కిరణ్ కుమార్, సూరె ఉమాదేవి, సూరె సురేంద్ర, వెంకటేశ్వర్లు, నాగలక్ష్మి, కల్యాణి, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

గిద్దలూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలకు శ్రీ వివేకానంద హయ్యర్ సెకండరీ పాఠశాలలో 1969-70 విద్యాసంవత్సరంలో 12వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందచేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈవో ఎం.రామచంద్రారెడ్డి, సెయింట్ షాలెం పాఠశాల కరస్పాండెంట్ విక్టర్‌పాల్, పూర్వవిద్యార్థుల సంఘం ప్రతినిధులు పి.త్రిమూర్తిరెడ్డి, శ్రీనివాసరావు, మానసిక వికలాంగుల పాఠశాల ప్రిన్సిపాల్ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

53 గేదెలు, 350 గొర్రెలకు వైద్య పరీక్షలు

తర్లుపాడు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మీర్జపేటలో ఆత్మ రిలయన్స్ ఫౌండేషన్ సహకారంతో ఏడీఏ సీహెచ్ రమేష్ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 52 గేదెలకు, 350 గొర్రెలు, మేకలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పశువులకు మేపు కొరకు గడ్డి విత్తనాలు కూడా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి విష్ణువర్ధన్ రెడ్డి, పశువైద్య సిబ్బంది ప్రసాద్, వాణి, ఆత్మ టెక్నికల్ మేనేజర్ డి.కాశయ్య పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులంటే అంత అలుసా?

టీడీపీ నాయకుడు మల్లికార్జున్


మాట్లాడుతున్న మల్లికార్జున్

మార్కాపురం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : 1922 నుంచి క్రమ పద్ధతిలో రిజిస్ట్రేషన్‌లు జరిగి 2010లో తాము డబ్బులిచ్చి కొనుకున్న భూములను కబ్జా చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని టీడీపీ నాయకుడు వక్కలగడ్డ మల్లికార్జున్ అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని గోగులదిన్నె ఇలాకాలో 40 ఎకరాల భూమిని ఆర్య వైశ్య సామాజిక వర్గానికి చెందిన నలుగురుం కొనుగోలు చేసినట్లు చెప్పారు. ఆ భూములు తమ పూర్వీకులవంటూ కొందరు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వాళ్లు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఇతర సామాజికవర్గాల వాళ్లు కొనుగోలు చేసి అనుభవిస్తున్నప్పుడు ఎవరూ ఆ భూముల జోలికి వెళ్లలేదన్నారు. కానీ మేము కొన్న తర్వాత నుంచే కొందరు గొడవలు సృష్టిస్తున్నారని, ఆర్యవైశ్యుల భూములంటే అలుసా అని ప్రశ్నించారు. అన్ని రకాల ఆధారాలున్నా తమను ఒక్క మాట కూడా సంప్రదించకుండా అలా ప్రచారం చేయడం సరికాదన్నారు. సక్రమ పద్ధతిలో కొనుక్కున భూములను వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కోర్టుల్లో న్యాయం పోరాటం చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బొంతల పుల్లారావు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సత్యనారాయణ, చెన్నకేశవస్వామి దేవస్థాన ట్రస్ట్‌బోర్డు మాజీ చైర్మన్ యక్కలి కాశీవిశ్వనాథం పాల్గొన్నారు.

డ్రైవర్‌పై దాడి .. ఆటో అపహరణ

దొనకొండ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : డ్రైవర్‌ను కత్తితో గాయపర్చి ఆటోను అపహరించుకెళ్లిన ఘటన మండలంలోని మల్లంపేట గ్రామ సమీపంలో గురువారం జరిగింది. అందిన సమాచారం మేరకు.. మార్కాపురం పట్టణంలోని పూలసుబ్బయ్య కాలనీకి చెందిన శ్రీరామ్ నాగరాజు ఆటో అద్దెకు తీసుకొని నడుపుకుంటూ జీవిస్తుంటాడు. గురువారం మార్కాపురం ఆర్టీసీ డిపో వద్ద గుర్తు తెలియని వ్యక్తి దొనకొండకు బాడుగకు మాట్లాడుకుని వస్తున్నారు. ఈక్రమంలో మండలంలోని మల్లంపేట గ్రామం దాటి కొంతదూరం రాగానే ఆటో కూర్చున్న వ్యక్తి డ్రైవర్ వీపుపై ఒక్కసారిగా కత్తితో గాయరిచి నిందితుడు ఆటోను అపహరించుకెళ్లాడు. రక్తపు మడుగులో పడిఉన్న నాగరాజును స్థానికులు 108 మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు. వైద్యులు పరీక్షించి కత్తి శరీరంలో ఇరుక్కుపోయిందని, ఒంగోలు తీసుకెళ్లాలని తెలిపారు. ఒంగోలు రిమ్స్‌లో వైద్యులు పరీక్షించి గుంటూరు వైద్యశాలకు తరలించారు. దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ త్యాగరాజు తెలిపారు.

పాఠశాలలను త్వరితగతిన పూర్తి చేయాలి

సర్వసభ్య సమావేశంలో సభ్యుల డిమాండ్


ఎంఈవోను ప్రశ్నిస్తున్న సభ్యులు

కొనకనమిట్ల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలో అసంపూర్తిగా ఆగిఉన్న పాఠశాలల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీటీసీ సభ్యుడు ఉడుముల రామనారాయణరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు మెట్టు వెంకటరెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ అధ్యక్షతన మండల సర్వసభ్యసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉడుముల మాట్లాడుతూ మండలంలో విద్యాశాఖ పనితీరు బాగాలేదని అధికారుల పర్యవేక్షణ లోపంతో పాఠశాలల పనితీరు సక్రమంగా లేదని ఎంఈవో డాంగేషరీఫ్‌ను నిలదీశారు. మండల ఉపాధ్యక్షుడు మెట్టు వెంకటరెడ్డి మాట్లాడుతూ బచ్చలకురపాడు ఎస్సీ కాలనీలోని పాఠశాలల నిర్మాణం అసంపూర్తిగా ఉన్నందున పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మండలంలో ఎన్ని పాఠశాలలు అసంపూర్తిగా ఉన్నాయో తెలపాలని వాటిని త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలని తెలిపారు. మండలంలో అసంపూర్తిగా 32 పాఠశాలలు ఉన్నాయన్నారు. ఎంఈవో స్పందిస్తూ నిధుల లేమితో నిలిచిపోయాయన్నారు. నిధులు రాగానే పూర్తి చేస్తామన్నారు. మునగపాడులోని ఓ ఇంటికి రూ.34వేల కరెంట్ బిల్లు రావడంపై పరిశీలిస్తామని ఏఈ తెలిపారు. గొట్లగట్టు ఎంపీటీసీ సభ్యుడు సభలో సభ్యులు కానివారిని ఎలా అనుమతిస్తారని వారిని పంపించాలన్నారు. ఎంపీడీవో ఈశ్వరమ్మ వెంటనే వారిని పంపించివేశారు. బెల్టు దుకాణాలతో ప్రజలు ఇబ్బంది పడతున్నారు. ఎక్సైజ్ అధికారుల చర్యలు తీసుకోవాలని సభ్యులు తెలిపారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు ఏడుకొండలు, ఈవోఆర్డీ శ్రీదేవి, చినారికట్ల, రేగడపల్లి సొసైటీ అధ్యక్షుడు సానికొమ్ము వెంకటేశ్వరెడ్డి, కనకం నరసింహారావు, ఏవో ప్రకాష్‌రావు, పలువురు ఎంపిటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పలుశాఖల అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల సమస్యలను పరిష్కరించండి


ఎమ్మెల్యే కందులను కలిసిన మాజీ సైనికులు

మార్కాపురం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : మాజీ సైనికుల సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిని మాజీ సైనికుల హౌసింగ్ బోర్డు సొసైటీ సభ్యులు కోరారు. స్థానిక జవహర్‌నగర్ కాలనీలోని పార్టీ ఆఫీసులో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హౌసింగ్ సొసైటీని ఏర్పాటు గురించి ఆయనకు వివరించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే కందుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హౌసింగ్ బోర్డు సొసైటీ అధ్యక్షుడు చిన్నయ్య, కార్యదర్శి వెంకటనారాయణరెడ్డి, జైజవాన్ అసోసియేషన్ అధ్యక్షులు హరి నారాయణరెడ్డి, కార్యదర్శి శేషసాయి పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాలపై శిక్షణ

గిద్దలూరు టౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వ్యవసాయ కార్యాలయంలో సబ్ డివిజన్ పరిధిలోని గ్రామ వ్యవసాయ, ఉద్యాన, పట్టుపరిశ్రమ విస్తరణాధికారులకు బుధవారం పంట కోత ప్రయోగాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ కె.సెంచిరెడ్డి పంట కోత పద్ధతిని వివరించారు.కార్యక్రమంలో వ్యవసాయ సంచాలకులు కె.రాజశ్రీ, వ్యవసాయాధికారులు విజయభాస్కర్‌రెడ్డి, మహబూబ్‌బాషా, మెర్సీ, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్స్ మున్వర్, ఫరీద, వ్యవసాయ విస్తరణాధికారులు, గ్రామ వ్యవసాయ, ఉద్యాన, పట్టుపరిశ్రమశాఖల సహాయకులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయాలి


కార్యాలయానికి చేరిన కొత్త కార్డులు

ఎర్రగొండపాలెం రూరల్, అక్టోబర్ 9 (ఆంధ్రజ్యోతి): కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేయాలని తహసీల్దార్ మంజునాథరెడ్డి వీఆర్వోలకు సూచించారు. గురువారం కార్యాలయంలో వీఆర్వోల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యాలయానికి చేరిన కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. తప్పులు ఉంటే సరిచేసి ఇవ్వాలని సూచించారు. మొత్తం 19 పంచాయతీలకు గాను 43 రేషన్ షాపులు ఉండగా, మొత్తం 19,718 రేషన్ కార్డులు ఉన్నట్లు తహసీల్దార్ తెలిపారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

పామూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని డీఆర్వో వెంకటసుబ్బయ్య అన్నారు. మండలంలోని నర్రమారెళ్ల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం వన్యప్రాణి వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు వీఎస్ఎస్ ఛైర్మన్ గుంటుపల్లి శ్రీనివాసులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సుభద్ర, జిలాని, మనోహర్‌రావు, ప్రభుదాసు, రవీందర్‌రెడ్డి, వెంకటరత్నం, బసవయ్య, తదితరులు పాల్గొన్నారు.ల్గొన్నారు.

సీఎస్‌పురంకు తీరని అన్యాయం

పామూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలానికి డీఎస్సీలో తీరని అన్యాయం జరుగుతుందని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్‌రసూల్, మండల కమిటీ అధ్యక్ష కార్యదర్శులు టి.శ్రీనివాసులు, జేఎస్ ఆనంద్ పేర్కొన్నారు. మండలంలో 37 ఎస్జీటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అయితే, మూడు పోస్టులు మాత్రమే చూపించారన్నారు. దీంతో మండలంలో విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. నాలుగు హిందీ పోస్టులు ఖాళీగా ఉండగా, ఒక్క పోస్టు కూడా లేదన్నారు. ఏడు పీడీ పోస్టులకుగాను రెండు ఖాళీలు చూపించారన్నారు.

డీపీవోకు సన్మానం

తాళ్లూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆంధ్ర అవార్డును అందుకున్న డీపీవో, మండల ప్రత్యేకాధికారి ఎం.వెంకటేశ్వరరావును ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు సన్మానించారు. గురువారం తాళ్లూరు పర్యటనకు వచ్చిన డీపీవోను ఎంపీడీవో చాంబర్‌లో ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అజిత, తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా బాణసంచా అమ్మితే చర్యలు

పామూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతులు లేకుండా దీపావళి మందుల అమ్మకాలు చేపడితే కేసులు నమోదు చేస్తామని సీఐ ఎం.భీమానాయక్ హెచ్చరించారు. ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం పట్టణంలో బాణసంచా విక్రయ దుకాణాలను ఎస్ఐ కిశోర్‌బాబుతో కలిసి పరిశీలించారు. టపాసులు అమ్మే దుకాణాలను, గోడౌన్‌లను పరిశీలించి తగు సూచనలు చేశారు.

అమృత్ పథకం అమలు ఎప్పుడో..!

- గత మూడేళ్లుగా వాయిదా పడుతున్న వైనం



దర్శి పట్టణ వ్యూ

దర్శి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): దర్శి మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు స్వచ్ఛమైన మంచినీరు అందించాలనే సంకల్పంతో కేంద్రప్రభుత్వం అమృత్ పథకం ద్వారా అందించిన నిధులతో ఏర్పాటుచేయతలపెట్టిన ఇంటింటికి కొళాయి పథకం అడుగు ముందుకు పండటంలేదు. పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 2023 జూన్‌లో అమృత్ పథకం కింద రూ.121 కోట్లు మంజూరయ్యాయి. ఆనాటి పాలకుల అసమర్థతో చాలాకాలం టెండర్లు ఖరారుకు నోచుకోలేదు. ఆతర్వాత 2024 మార్చిలో టెండర్లు ఖరారు చేశారు. ఆవెంటనే ఎన్నికలు రావటంతో సంబంధిత కాంట్రాక్టర్ పనులు ప్రారంభించలేదు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాత టెండర్లు రద్దు చేసింది. ఆతర్వాత అంచనా లు పెంచి రూ.130.60 కోట్లతో గత జూలైలో మళ్లీ టెండర్లు పిలిచారు. ఈసారి మూడు జిల్లాల యూనిట్‌గా టెండర్లు పిలవటంతో పెద్ద కాంట్రాక్టర్లు మాత్రమే టెండర్లు వేయగలిగారు. ఆతర్వాత మళ్లీ ఏ కారణంచేతనో రెండోసారి వేసిన టెండర్లు కూడా రద్దయ్యాయి. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా అమృత్ పథకం అమలు రాష్ట్రప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడిఉంది. మళ్లీ ఎప్పుడు టెండర్లు పిలుస్తారో అర్థంకాని పరిస్థితి నెలకొంది.

దర్శి మున్సిపాలిటీలో సుమారు 40వేల మంది జనాభా ఉన్నారు. ప్రస్తుతం ఎస్‌ఎస్‌పీ రక్షిత మంచినీటి పథకం ద్వారా తాగునీరు అందిస్తున్నప్పటికీ ఫిల్టర్లు సరిగా పనిచేయక అన్నిప్రాంతాలకు నీరందక శివారు ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముండ్లమూరు మండలంలోని పులిపాడు చెరువును మంచినీటి చెరువుగా మార్చి సాగర్ జలాలను ఆ చెరువుకు నింపి ఫిల్టర్ చేసి పైపులైన్ల ద్వారా దర్శి పట్టణ ప్రజలకు ఇంటింటికి కొళాయి ద్వారా నీరందించే లక్ష్యంతో ఈ పథకాన్ని రూపొందించారు. అయితే, ఆచరణలో అమలు కాకపోవటంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

గత వైసీపీ పాలకుల అసమర్థతో పథకం నిర్మాణానికి నోచుకోకపోవటం తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా జాప్యం జరగటం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజల అవసరాలను గుర్తించి ఈపథకం త్వరగా ప్రారంభమయ్యే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

రోడ్ల అభివృద్ధికి రూ.11.30 కోట్లు మంజూరు

- టీడీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్



మాట్లాడుతున్న టీడీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్, పాల్గొన్న నేతలు

కనిగిరి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం రూ.11.30 కోట్లు మంజూరుచేసిందని టీడీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ అన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి కృషితో ఇవి మంజూరయ్యాయన్నారు. గురువారం స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో రహదారులు దారుణంగా ఉన్నాయన్నారు. గుంతల రోడ్డులో ప్రజలు పడరానిపాట్లు పడ్డారన్నారు. వీటి దుస్థితిని గమనించిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఎన్నికల ప్రచారంలో రోడ్లు అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత పలుమార్లు రోడ్లు, భవనాలశాఖ మంత్రిని కలిసి కనిగిరి రోడ్ల దుస్థితిని వివరించి వినతి పత్రాలు అందించాన్నారు. ఇటీవల సీఎం చంద్రబాబునాయుడుకు రోడ్ల దుస్థితికి సంబం ధించిన ఫొటోలను చూపించి ప్రజల ఇబ్బందులను వివరించారన్నారు. సానుకూలంగా స్పందించిన సీఎం చంద్రబాబు నిధులు మంజూరు చేశారని తెలిపారు. నిధులు మంజూరు చేసిన సీఎంచంద్రబాబుకు, ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి కనిగిరి నియోజకవర్గ ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. నిధుల సమీకరణకు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర చూపించిన చొరవ, కృషికి కనిగిరి ప్రజలు రుణపడి ఉంటారన్నారు. కనిగిరి నుంచి గార్లపేట రోడ్డు అభివృద్ధికి రూ.3 కోట్లు, పామూరు పట్టణానికి రూ.2.80 కోట్లు, పెదగోగులపల్లి నుంచి సీఎస్‌పురం వరకు రూ.5.50 కోట్లు మంజూరైనట్టు తెలిపారు. సమావేశంలో టీడీపీ నాయకులు రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, వీఆర్ మనోహరరావు (చిరంజీవి), తమ్మినేని వెంకటరెడ్డి, రోషన్ సంధాని, జంషీర్, అహ్మద్, నజిముద్దీన్, లక్ష్మయ్య, షరీఫ్, అచ్చాల రవి, ఏఎంసీ డైరెక్టర్ షేక్ వాజిదాబేగం, కరణం అరుణ, దొరసాని, తులసి తదితరులు పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై అవగాహన ర్యాలీ

పీసీపల్లి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై వైద్యశాఖ ఆధ్వర్యంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ వైద్యశాల నుంచి బ్యాంకు సెంటరు వరకు ఏఎన్ఎంలు, ఆశా వర్కర్‌లు, వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. బ్యాంకు సెంటరులో మానవహారం ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఎంపీడీవో జీవీ క్రిష్ణారావు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సేవలు, రాయితీలపై ప్రతి కుటుంబం అవగాహన పెంపొందించుకోవాలన్నారు.

కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను సమాయత్తం చేయాలి



కంచర్లవారిపల్లి హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనశాలను పరిశీలిస్తున్న డీఈవో కిరణ్‌కుమార్

కనిగిరి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను సమాయత్తం చేయాలని డీఈవో ఏ.కిరణ్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని కంచర్లవారిపల్లి, లింగారెడ్డిపల్లి హైస్కూళ్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఫ్ఏ2 పరీక్షలు వచ్చేవారం నుంచి జరుగుతా యన్నారు. టైమ్‌టేబుల్ ప్రకారం పకడ్బందీగా పరీ క్షలు నిర్వహించాలన్నారు. కెరీర్ గైడెన్స్ గురించి పదో తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. డీ ఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులు సోమవారం నుంచి విధులకు హాజరయ్యేలా ఉత్తర్వులు ఇస్తామన్నా రు. హైస్కూళ్లలో ఉపాధ్యాయుల కొరత దాదాపు తీరు తుందన్నారు. లింగారెడ్డిపల్లి హైస్కూల్‌లోని కిచెన్ గా ర్డెన్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. డీఈవో వెంట ఎంఈవోలు డీవీ సుబ్బారావు, యూవీ నారాయ ణరెడ్డి, రాజాల కొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు

తాళ్లూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండలపరిషత్ సమావేశం హాలులో గురువారం పంచాయతీ కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరచేయాల్సిన కార్యదర్శులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. సచివాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయాలన్నారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించమన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగితేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఎంపీడీవో పి.అజిత మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు ప్రతిరోజు ఉదయం 10.30 గంటలకు, సాయంత్రం 5 గంటలకు బయోమెట్రిక్ తప్పకుండా వేయాలన్నారు. ఎన్టీఆర్ పెన్షన్ల పంపిణీలో కొందరు సచివాలయ ఉద్యోగులు తమ ఇష్టమైన సమయానికి వెళ్లి పంపిణీ చేస్తున్నారని అన్నారు. ఉదయం 6 గంటల నుంచే పెన్షన్ల పంపిణీ చేపట్టాలన్నారు.

డ్రైవర్‌పై దాడిచేసి ఆటో అపహరణ



కత్తిపోటుకు గురైన ఆటో డ్రైవర్ నాగరాజు

దొనకొండ, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): డ్రైవర్‌ను కత్తితో గాయపర్చి ఆటో అపహరించుకెళ్లిన ఘటన మండలంలోని మల్లంపేట గ్రామ సమీపంలో గురువారం చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు.. మార్కాపురం పట్టణంలోని పూలసుబ్బయ్య కాలనీకి చెందిన శ్రీరామ్ నాగరాజు అనే వ్యక్తి ఆటో అద్దెకు తీసుకొని నడుపుకుంటూ జీవిస్తుంటాడు. గురువారం మార్కాపురం ఆర్టీసీ డిపో వద్ద గుర్తుతెలియని వ్యక్తి దొనకొండకు బాడుగకు మాట్లాడుకుని వస్తున్నారు. ఈక్రమంలో మండలంలోని మల్లంపేట గ్రామం దాటి కొంతదూరం రాగానే గుర్తుతెలియని వ్యక్తి ఆటో డ్రైవర్ వీపుపై ఒక్కసారిగా కత్తితో బలంగా గాయపర్చాడు. అనుకోని ఈఘటనతో నాగరాజు రక్తపు మడుగులో పడిపోగా, నిందితుడు ఆటోను అపహరించుకెళ్లాడు.

రక్తపు మడుగులో పడిఉన్న ఆటో డ్రైవర్ నాగరాజును స్థానికులు చూసి 108కు సమాచారం అందించగా, మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు. అక్కడ వైద్యులు పరీక్షించి కత్తి శరీరంలో ఇరుక్కుపోయిందని మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలు తీసుకెళ్లాలని తెలిపారు. ఒంగోలు రిమ్స్‌లో వైద్యులు పరీక్షించి గుంటూరు వైద్యశాలకు తరలించగా, బాధితుడి పరిస్థితి ప్రమాదకరంగా ఉందనేది సమాచారం. సంఘటనా ప్రదేశాన్ని దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ త్యాగరాజు తెలిపారు.

పంటకోత ప్రయోగాలతో ప్రయోజనం

దర్శి అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): పంట కోత ప్రయోగాలతో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఏడీఏ బాలాజీనాయక్ తెలిపారు. గురువారం స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో సబ్ డివిజన్ పరిధిలోని రైతుసేవా కేంద్రం సిబ్బందికి పంట కోత ప్రయోగాలపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట కోత ప్రయోగాలతో కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించి చైతన్యవంతులను చేయాలన్నారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ జి.రమేష్, శాస్త్రవేత్త మానస, వ్యవసాయాధికారులు, రైతుసేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

పర్యటనల పేరుతో అల్లర్లు సృష్టించచమే జగన్ లక్ష్యం

దర్శి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): పర్యటనల పేరుతో అల్లర్లు సృష్టించటమే జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ధ్వజమెత్తారు. ఈమేరకు గురువారం ఓ ప్రకటన విడుదలచేశారు. పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీలు నిర్మిస్తే నష్టమేమిటని కోర్టులు కూడా సమర్థిస్తున్నప్పటికీ జగన్ అండ్ కో బ్యాచ్ తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నంచేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులు కొరత ఉన్నప్పుడు పీపీపీ విధానం ద్వారా మెడికల్ కళాశాలలు నిర్మించటంవల్ల విద్యార్థులకు న్యాయం జరుగుతుందన్నారు. గత ఐదేళ్లల్లో జగన్ ఒక్క మెడికల్ కళాశాలనైనా నిర్మించారా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ, ప్రతి రెవెన్యూ డివిజన్‌లో ఇంజనీరింగ్ కళాశాల నిర్మించి సామాన్యులకు ఉన్నత విద్య అందేవిధంగా కృషి చేస్తుందన్నారు. కర్ణాటకలో 12 మెడికల్ కళాశాలలు పీపీపీ విధానం ద్వారా నిర్మిస్తున్న విషయం కనిపించటం లేదా అని ప్రశ్నించారు. వైసీపీ నాయకులకు కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి దిక్కుతోచక అరాచకాలు సృషించేందుకు కుట్రలు చేస్తున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.

వేపగుంపల్లిలో పారిశుధ్య పనులు

పీసీపల్లి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేపగుంపల్లిలో గురువారం పారిశుధ్య పనులు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పరిశుభ్రత ప్రజల ఆరోగ్యానికి మూలం అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులబారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రతిఒక్కరూ పారిశుధ్య పనుల్లో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ విశ్వరూపాచారి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పటిష్టతకు కృషిచేయాలి

పామూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): టీడీపీ పటిష్టతకు కృషి చేయాలని ఆపార్టీ మండల అధ్యక్షుడు బొల్లా నరసింహారావు అన్నారు. గురువారం జరిగిన టీడీపీ నాయకులు, బూత్, క్లస్టర్, కేఎస్ఎస్ సభ్యుల సమావేశానికి పట్టణ అధ్యక్షుడు సయ్యద్ అమీర్‌బాబు అధ్యక్షత వహించారు. నరసింహారావు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలన్నారు. సమావేశంలో పువ్వాడి వెంకటేశ్వర్లు, జి.దశరథరామయ్య, యారవ శ్రీను, పాలపర్తి వెంకటేశ్వర్లు, అంచూరి వెంకట్‌రెడ్డి, వై.ప్రసాదరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పామూరు పాఠశాలకు 21 బెంచీలు బహూకరణ

పామూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం మోదీ సేవా పక్షోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు 21 బెంచీలను ఎంఈవో పి.కోటిరెడ్డి, విద్యాకమిటీ ఛైర్మన్ జి.కొండలరావుకు అందజేశారు. కార్యక్రమంలో యారవ శ్రీను, నారాయణ, కేవీ సుబ్బారావు, పువ్వాడి వెంకటేశ్వర్లు, బి.జయరామిరెడ్డి, పాలపర్తి వెంకటేశ్వర్లు, ఏ.ప్రభాకర్‌చౌదరి, ఉమ్మడి శ్రీను, దరిశి ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

బోధనేతర పనులు చేయం

కురిచేడు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): బోధనేతర పనులు చేయమని ఫ్యాప్టో నేతలు గురువారం మండల విద్యాశాఖాధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పనులు మాత్రమే చేస్తామన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో రాచమల్లు శ్రీనివాసరెడ్డి, షేక్ ఖాదర్‌వలి, శివరామక్రిష్ణ, ఏ.శ్రీనివాసరెడ్డి, వెంకటస్వామి, ఎం.శ్రీనివాసరావు, మహబూబ్ బాషా, లక్ష్మయ్య, మస్తాన్‌వలి, మణికుమార్, చక్రపాణి, సింగరయ్య, ఏసుదాసు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధచూపాలి

తాళ్లూరు,అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా పంచాయతీఅధికారి, మండల ప్రత్యేకాధికారి ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం తాళ్లూరు, శివరాంపురం గ్రామ ఎస్సీ కాలనీలో ఆయన పర్యటించారు. కాలనీలు అపరిశుభ్రంగా ఉండి, మురుగు కాల్వల్లో పూడిక తీయకపోవటంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతిఒక్కరు తమ ఇంటితోపాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచాలన్నారు. స్వర్ణ పంచాయతీ పోర్టల్ ద్వారా ఇంటి నుంచి ఇంటి పన్నులు జమచేసే సౌకర్యం కల్పించందన్నారు.

ఈనెలాఖరులోగా పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్నులను చెల్లించాలన్నారు. గ్రామాల్లో చెత్త సంపద తయారీ కేంద్రాల్లోచి వర్మికంపోస్ట్ తయారు చేసి గ్రామపంచాయతీలకు ఆదాయం సమకూరే చర్యలు చేపట్టాలని ఎంపీడీవోకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.అజిత, సర్పంచ్ మేకల చార్లెస్ సర్జన్, గ్రామ కార్యదర్శి షేక్ షహనాజ్‌బేగం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాణసంచా నిల్వలపై పోలీసుల ఆకస్మిక తనిఖీలు

కనిగిరి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): బాణసంచా నిల్వలపై పట్టణంలోని పలు ఫ్యాన్సీ షాపులు, గోడౌన్‌లను గురువారం డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్, సీఐ ఖాజావలి, ఎస్ఐ శ్రీరాం పోలీసు సిబ్బందితో కలసి గురువారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పోలీసు నిబంధనలకు వ్యతిరేకంగా బాణసంచా నిల్వలు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దీపావళి రానున్న నేపథ్యంలో లైసెన్స్ కల్గి, పోలీసు ఆంక్షలకు లోబడి మాత్రమే అమ్మకాలు సాగించాలన్నారు. పొదిలి రోడ్డులోని టకారిపాలెం వద్ద బాణసంచా అమ్మకాల షాపుల గోడౌన్‌ను పరిశీలించారు. సంబంధిత వ్యాపారస్తులకు ఏదైనా అకస్మాత్తుగా అగ్నిప్రమాదాలు సంభవిస్తే తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దర్శి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలోని అద్దంకి రోడ్డు, పుచ్చలమిట్ట, ఆటోనగర్, మోటుపల్లి రోడ్డు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 6 నుంచి 9 గంటల వరకు కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ డి.అనుప్సచన్‌కుమార్ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో నూతన విద్యుత్ లైన్లు ఏర్పాటుచేస్తున్నందున విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నందున ప్రజలు సహకరించాలని కోరారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

ముండ్లమూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్య దోరణిని అవలంబిస్తుందని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు లెవీ ప్రసాదు అన్నారు. గురువారం స్థానిక విద్యా వనరుల కేంద్రం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించి ఎంఈవో - 1 కాలేషావలికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గోగుల కోటేశ్వరరావు, ఎలీషా, రమణారెడ్డి, ఎస్‌కే మస్తాన్‌వలి, బి.లింగారావు, తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు

ముండ్లమూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఎస్ఐ కె.కమలాకర్ అన్నారు. గురువారం రాత్రి మండలంలోని వేంపాడు గ్రామంలో జరిగిన పల్లె నిద్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.ఎవరైనా కొత్త వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తుంటే వెంటనే తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మేదరమెట్ల కొండలరావు, గంగినేని శేషగిరిరావు, ముప్పాళ్ళ కోటేశ్వరరావు, సోమేపల్లి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్

కనిగిరి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ద్వారా ఎంపికైన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు గురువారం రాత్రి పామూరు రోడ్డులోని అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో డీఈవో కిరణ్‌కుమార్ కౌన్సెలింగ్ నిర్వహించి స్థానాలు కేటాయించారు. జిల్లాలో 124 మంది సెకండరీ గ్రేడ్ తెలుగు, ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైనవారికి ఈనెల 3వ తేదీ నుంచి శిక్షణ ఇస్తున్నారు.

గురువారం రాత్రి కౌన్సెలింగ్ నిర్వహించి ఉత్తర్వు లు ఇచ్చారు. వీరందరూ సోమవారం వారికి కేటాయించిన పాఠశాలల్లో విధుల్లో చేరాలని డీఈవో తెలిపారు. కార్యక్రమంలో ఏంఈవోలు యూవీ నారాయణరెడ్డి, ఐ.సంజీవి, రాజాల కొండారెడ్డి, పాల్గొన్నారు.





పల్నాడులో వరి పొలాలు

బంధిఖానాలో.. బాల్యం



ఆట పాటలు.. కేరింతలు.. తుళ్లింతలు.. గిల్లికజ్జాలు.. అందమైన ఊహలు.. ఇలా ఎన్నో మధురానుభూతుల్లో సాగాల్సిన బాల్యం వివాహ బంధంలో బందీగా మారిపోతోంది. అనాదిగా సమాజాన్ని పట్టి పీడిస్తున్న దురాచారాల్లో బాల్య వివాహం కూడా ఒకటి. 150 ఏళ్ల క్రితం 1872లోనే బాల్య వివాహాలను రద్దు చేస్తూ అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం చట్టం చేసినా అది నేటికీ సమాజాన్ని వీడటం లేదు. ఫలితంగా ముక్కుపచ్చలారని ఎంతో మంది చిన్నారుల జీవితాలు మూడు ముళ్ల బంధంలో చిక్కి శల్యమవుతున్నాయి. బాల్య వివాహాల సంఖ్య ఇటీవల కాలంలో భారీగా పెరుగుతుండడం సమాజాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. కొవిడ్ అనంతర కాలంలో ఈ సంఖ్య గణనీయంగా పెరిగిందని గణాంకాలు చెబుతున్నాయి.

- పల్లెల కంటే.. పట్టణాల్లో అధికంగా చిన్నారి పెళ్లి కూతుళ్లు..
- బాల్య వివాహాల్లో రాష్ట్ర సగటు దాటిన ఉమ్మడి గుంటూరు
- 35.4 శాతంతో రాష్ట్రంలో నాలుగో స్థానం
- కోవిడ్ అనంతరం ఆందోళనకరంగా పెరుగుదల

- బాపట్ల

నాలుగో స్థానంలో ఉమ్మడి జిల్లా..

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే లెక్కల ప్రకారం ఉమ్మడి గుంటూరు జిల్లాలో 2019- 20లో 35.4 శాతం బాల్య వివాహాలు జరిగాయి. ఇది రాష్ట్ర సగటు 29.3 శాతం కంటే 6 శాతం అధికం. కోవిడ్ అనంతర కాలంలో ఈ సంఖ్య మరింత పెరిగింది. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అడ్డుకుంటున్న కేసుల సంఖ్య ఏటికేడాది పెరగడమే ఇందుకు నిదర్శనం. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 2018లో 31 బాల్య వివాహాలను ఐసీడీఎస్ అధికారులు అడ్డుకోగా.. ఆ సంఖ్య 2019 నాటికి 23కు తగ్గింది. అయితే కొవిడ్ ప్రభావం మొదలైన 2020లో 34, 2021లో 37 వివాహాలను అధికారులు అడ్డుకున్నారు. ఆ ఏడాది తొలి నాలుగు నెలల్లోనే 12 బాల్య వివాహాలను అడ్డుకున్నారు.



పనిచేయని చట్టాలు

బాల్య వివాహాల రద్దు కోసం ప్రభుత్వం అనేక చట్టాలు చేస్తోంది. బ్రిటీష్ పాలనలోనే పలు చట్టాలు జరిగాయి. 1872లో అప్పటి గవర్నర్ జనరల్ మేయో తొలిసారి బాల్య వివాహ రద్దు చట్టం చేశారు. ఆ తరువాత 1929లో లార్డ్ ఇర్విన్ కాలంలో 'శారద' చట్టం చేశారు. ప్రొహిబిషన్ ఆఫ్ చైల్డ్ మ్యారేజెస్ యాక్ట్-2006ను చేశారు. ఈ చట్టం ప్రకారం ఆడపిల్లల వివాహ వయసు 18, మగపిల్లల వివాహ వయసు 21గా నిర్ణయించారు. కిందటేడాది ఈ చట్టాన్ని సవరించి ఇద్దరి వయసును 21 ఏళ్లకు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

సిరుల వరి



అంచనాలకు మించి వరి సేద్యం

- ఖరీఫ్ కళకళ.. 5.31 లక్షల ఎకరాల్లో సాగు
- అనుకూలించిన పరిస్థితులు
- పల్నాడు జిల్లాలో 43 వేల ఎకరాలు అధికం

ఖరీఫ్ వరి సాగు కళకళలాడుతోంది. అన్నదాతలు అంచనాలకు మించి వరి సేద్యం చేశారు. గతేడాది కంటే సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. గత ఖరీఫ్, రబీ సీజన్‌లలో ధాన్యం దిగుబడులు ఆశాజనకంగా ఉండటంతో రైతులు వరి సాగు వైపు మొగ్గు చూపారు. మిరప సాగు చేసే రైతులు కూడా ఈ సారి వరి సాగు చేపట్టారు. వరినాట్లు చివరి దశకు చేరుకున్నాయి. ఈ వారంలో పూర్తవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. నాగార్జునసాగర్.. కృష్ణా డెల్టా ఆయకట్టు పరిధి పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 5.31 లక్షల ఎకరాల్లో వరి సాగైంది.

(రేపల్లె, ఆంధ్రజ్యోతి)

సాగర్.. కృష్ణా డెల్టా ఆయకట్టు ప్రాంతాలు ధాన్యాగారంగా పేరొందాయి. ఖరీఫ్‌లో వరి సాగు పెరగడంతోనే యూరియా సమస్యలు తలెత్తుతున్నాయి. గతేడాది సాగు అంచనాలతో యూరియా సరఫరా చేయడంతో.. కొరత ఏర్పడుతోంది. పల్నాడు జిల్లాలో వరి సాధారణ సాగు విస్తీర్ణం 96,498 ఎకరాలు కాగా 1,29,630 ఎకరాల్లో ఇప్పటికి వరి సాగైంది. గతేడాది 85,990 ఎకరాల్లో వరి పండించారు. క్రితం సారి కంటే 43,640 ఎకరాల్లో వరి సాగు పెరగడం గమనార్హం. ఇంకా మూడు నుంచి నాలుగు వేల ఎకరాల్లో వరినాట్లు వేసే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది.

● గుంటూరు జిల్లాలో సాధారణ వరి సాగు విస్తీర్ణం 1,53,143 ఎకరాలు కాగా 1,53,868 ఎకరాల్లో ఇప్పటికే వరి సాగైంది. మరో రెండు నుంచి మూడు వేల ఎకరాల్లో వరినాట్లు వేసే అవకాశం ఉంది. గతేడాది 1,40,935 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఈ ఏడాది 12,933 ఎకరాలు వరి సాగు అధికం. ఈ ఏడాది ఖరీఫ్ ధాన్యం దిగుబడులు కూడా పెద్ద ఎత్తున పెరగనున్నాయి. ప్రభుత్వం వరి దిగుబడులను ముందుగానే అంచనా వేసి ఇందుకు తగ్గట్టుగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ దిశగా పౌరసరఫరాల శాఖ చర్యలు చేట్టాలి.

● బాపట్ల జిల్లాలో వరి ప్రధానంగా సాగు చేస్తారు. ఈ జిల్లాలో కృష్ణా డెల్టా.. సాగర్ ఆయకట్టులు ఉన్నాయి. వరి సాధారణ సాగు విస్తీర్ణం 2,47,245 ఎకరాలు కాగా ఇప్పటికే 2,48,193 ఎకరాల్లో సాగైంది. సాగర్ ఆయకట్టులో చివరి భూముల్లో వరి నాట్లు ఇంకా జరుగుతున్నాయి. ఇంకో ఐదు వేల ఎకరాల్లో వరి నాట్లు వేసే అవకాశం ఉంది. గతేడాది సాగు విస్తీర్ణం చూస్తే 2,20,903 ఎకరాలు కాగా.. ఈ ఏడాది 27,290 ఎకరాలు అధికం.

నాలుగేళ్లలో వరి సాగు ఎకరాల్లో..

జిల్లా	2022	2023	2024	2025
పల్నాడు	92,773	27,675	85,990	1,29,630
బాపట్ల	2,42,755	2,13,383	2,20,903	2,48,193
గుంటూరు	1,54,895	1,39,005	1,45,935	1,53,935

31 పనులకు రూ.48.28 కోట్లు

అభివృద్ధి పనుల్లో పురోగతి కనిపించాలి ● సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశాలు

బాపట్ల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా మినరల్ ఫండ్ రూ.51 కోట్ల నిధి నుంచి వివిధ శాఖల ద్వారా 31 అభివృద్ధి పనులకు రూ.48.28 కోట్లు మంజూరు చేసినట్లు కలెక్టర్ డాక్టర్ వి. వినోద్‌కుమార్ తెలిపారు. వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టరేట్‌లో గురువారం జరిగిన సమావేశంలో కలెక్టర్ ప్రసంగించారు. డీఎమ్ఎఫ్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల్లో ప్రతీవారం పురోగతి కనిపించాలని అధికారులను ఆదేశించారు. ఇంజనీరింగ్ అధికారులు బృందంగా ఏర్పడి సమన్వయంతో పనిచేస్తే సత్ఫలితాలు లభిస్తాయన్నారు. అధికారులే తమకు తాము లక్ష్యాలను నిర్దేశించుకుంటూ వాటిని సకాలంలో పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 61 ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో తాగునీటిని పరీక్షించాలన్నారు. ఆర్వో ప్లాంట్లన్నీ వినియోగంలో ఉండాలన్నారు. బీచ్‌ల వద్ద మంజూరు చేసిన సామాజిక మరుగుదొడ్లు, సీసీరోడ్ల పనులను మొదలు పెట్టాలన్నారు.

167ఏ జాతీయ రహదారిని పూర్తిచేయాలి

చీరాల ఓడరేవు నుంచి పిడుగురాళ్ల వరకు నిర్మిస్తున్న 167ఏ జాతీయ రహదారి పనులను నవంబరు నెలాఖరకు పూర్తిచేయాలని కలెక్టర్ తెలిపారు. రహదారి వెంట రోడ్డు భద్రతపై సూచిక బోర్డులు ఉండాలని, మొక్కలు నాటాలన్నారు. ఎంపీ ల్యాడ్స్‌తో చేపట్టే పనులను గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ అనంతరాజు, గృహ నిర్మాణశాఖ పీడీ వెంటేశ్వర్లు, సమగ్రశిక్షాభియాన్ ఏపీసీ నాగిరెడ్డి, సీపీవో షాలెంరాజు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీతో అసమానతలు తగ్గుదల

- జీఎస్టీ సంస్కరణలపై అవగాహనలో ఎంపీ కృష్ణప్రసాద్



ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న ఎంపీ కృష్ణప్రసాద్, కలెక్టర్ వినోద్‌కుమార్

చీరాల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పేదల్లో ఆర్థిక అసమానతలు తగ్గించేందుకే కూటమి ప్రభుత్వం జీఎస్టీ సంస్కరణలు ప్రవేశపెట్టినట్లు ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, కలెక్టర్ డా.వినోద్‌కుమార్ తెలిపారు. చీరాల ఏరియా వైద్యశాల ప్రాంగణంలో గురువారం సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మెడికల్ దుకాణదారులతో కలిసి జీఎస్టీ తగ్గింపుపై కొనుగోలుదారులకు అవగాహన కల్పించారు. వైద్య పరీక్షలు, ప్రాణాంతక, దీర్ఘకాలిక వ్యాధుల మందులపై జీఎస్టీ తగ్గింపుతో రోగులకు ధరాభారం తగ్గిందన్నారు. బీమాలో సైతం 18 శాతం జీఎస్టీ తగ్గించినట్లు తెలిపారు.

నాలుగు నెలలుగా జీతాలు లేవు..

అంతకముందు ఏరియా ఆస్పత్రిలో ఎంపీ, కలెక్టర్ తనిఖీ చేశారు. వివిధ వార్డుల్లో ఉన్న రోగులతో వారు మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో నాలుగు నెలలుగా జీతాలు అందక ఇబ్బంది పడుతున్నట్లు పారిశుధ్య కాంట్రాక్టు కార్మికులు ఎంపీ ఎదుట విలపించారు. దీంతో స్పందించిన ఆయన సమస్య పరిష్కారం దిశగా అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డా.విజయమ్మ, డీసీహెచ్ఎస్ పద్మావతి, గుంటూరు జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ కృష్ణ, ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ, మున్సిపల్ చైర్మన్ సాంబశివరావు, కమిషనర్ రషీద్, హాస్పిటల్ సూపరింటెండెంట్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ప్రాంగణంలో రోడ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ ఉమామహేశ్వర్

అంతర్గత రోడ్లు వేగంగా నిర్మించాలి

- అధికారులను ఆదేశించిన కలెక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో అంతర్గత రోడ్లను వేగంగా నిర్మించాలని ఆర్అండ్‌బీ అధికారులను కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్మించనున్న అంతర్గత రహదార్లు, ఏటీఎం గది ప్రతిపాదిత ప్రాంతాన్ని, పోలీసుకవాతు మైదానాన్ని ఎస్పీ బి.ఉమామహేశ్వర్, ఆర్అండ్‌బీ డీఈ అరుణకుమారిలతో కలిసి కలెక్టర్ గురువారం పరిశీలించారు. జిల్లా మినరల్ ఫండ్ రూ.47.9 లక్షలతో ప్రతిపాదించిన రహదార్ల పనులను పరిశీలించిన కలెక్టర్ అధికారులకు పలుసూచనలు చేశారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా, నాణ్యతతో పనులను చేపట్టాలన్నారు. రహదారి వెంట మొక్కలు నాటాలన్నారు. కలెక్టరేట్ మరమ్మతులను త్వరగా పూర్తి చేయాలని చెప్పారు.



చీరాలలో ఇటీవల కురిసిన వర్షానికి జలమయమైన ఓ వీధి

చీరాలలో డ్రెయిన్లు అధ్వానం

కొన్ని వార్డులకే పారిశుధ్యం పరిమితం ● చిన్నపాటి వర్షానికి మురుగు పారక అవస్థలు



సైడ్ కాల్వల దుస్థితి

చీరాల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఏడు దశాబ్దాల క్రితం నిర్మించిన డ్రెయిన్లు అధ్వానంగా మారగా.. అనేక ప్రాంతాల్లో మురికినీటి పారుదల వ్యవస్థ లేక.. అపరిశుభ్రతతో చీరాలవాసులు అల్లాడుతున్నారు. ఓ మోస్తరు వర్షానికే రోడ్లు తటాకాల్లా మారుతున్నాయి. నీటి పారుదల లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోజుల తరబడి నీటి నిల్వతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఎంతో చరిత్ర ఉన్న చీరాల పురపాలక సంఘంలో డ్రెయినేజీ వ్యవస్థ దయనీయంగా మారింది. మున్సిపాలిటీలో 33 వార్డులు ఉండగా, అందులో సుమారు 2 లక్షల మంది జనాభా ఉన్నారు. అయితే ఇప్పటికీ 1948లో నిర్మించిన 161 కిలోమీటర్ల డ్రెయిన్లే దిక్కయ్యాయి. వాటిలో కొన్ని శిథిలమవగా ప్రస్తుతం 139 కిలోమీటర్ల మేర మాత్రమే డ్రెయిన్లు వినియోగంలో ఉన్నాయి. ఐక్యనగర్, రామనగర్, శ్రీనివాసనగర్ తదితర ప్రాంతాల్లో నేటికీ డ్రెయిన్ల సౌకర్యం లేదు. పట్టణంలో డ్రెయిన్లు లేక పోవడం, ఉన్నవి కూడా అధ్వానంగా ఉండటం.. నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో అపరిశుభ్రత తాండవిస్తోంది. దీంతో ఆయా ప్రాంతాలు దోమలకు ఆవాసాలుగా మారాయి. రోగాలతో ప్రజలు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. ఓ వార్డులో ఇటీవల ఓ బాలుడు డెంగీతో మృతి చెందాడు. దీంతో పట్టణవాసులు భయాందోళన చెందుతున్నారు.

రూ.కోటితో అభివృద్ధి పనులు

డ్రెయినేజీ వ్యవస్థపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. రూ.కోటి ఉడా నిధులతో డ్రెయిన్ల అభివృద్ధికి ప్రతిపాదనలు జరిగాయి. టెండర్ల ప్రక్రియ ముగిసింది. త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.

రూ.5.87 కోట్లతో రోడ్లు, డ్రెయిన్లు

- యద్దనపూడి మండలంలో 62 పనులకు నిధులు
- ఇప్పటికే రూ.4.45 కోట్లతో 24 పనులు పూర్తి

: ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



యద్దనపూడి గ్రామంలో పూర్తయిన సీసీ రోడ్డు

యద్దనపూడి(మార్టూరు), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గ్రామాలలో సీసీ రోడ్లు, సైడ్ డ్రెయిన్ల నిర్మాణానికి ఉపాధి హామీ పథకంలో రెండో విడత 62 పనులకు రూ.5.87 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. మండలంలో రోడ్ల అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. అనంతవరం గ్రామంలో 7 పనులకు రూ.కోటి, వింజనంపాడు గ్రామంలో 4 పనులకు రూ.35.50 లక్షలు, యనమదల గ్రామంలో 3 పనులకు రూ.31.30 లక్షలు, పూనూరు గ్రామంలో 7 పనులకు రూ.73.20 లక్షలు, పోలూరు గ్రామంలో 6 పనులకు రూ.42.50 లక్షలు, యద్దనపూడి గ్రామంలో 6 పనులకు రూ.63.50 లక్షలు, శ్యామలవారిపాలెంలో ఒక పనికి రూ.15 లక్షలు, తనుబొద్దివారిపాలెంలో 3 పనులకు రూ.20 లక్షలు, చిమటావారిపాలెంలో 3 పనులకు రూ.22.50 లక్షలు, గన్నవరం గ్రామంలో 4 పనులకు రూ.40 లక్షలు, జాగర్లమూడి గ్రామంలో 9 పనులకు రూ.71.40 లక్షలు,సూరవరపుపల్లి గ్రామంలో 5 పనులకు రూ.31.50 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. మున్నంగివారిపాలెంలో ఒక పనికి రూ.10 లక్షలు, చింతగుంటపాలెంలో 2 పనులకు రూ.10.30 లక్షలు, చింతపల్లిపాడులో 2 పనులకు రూ.30.50 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులతో త్వరలోనే గ్రామాలలో పనులను ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇప్పటికే మొదటి విడతలో మంజూరైన రూ.4.45 కోట్లతో 24 పనులను పూర్తి చేసినట్లు తెలిపారు.

రేపల్లె రోడ్లకు రూ.16.20 కోట్లు : మంత్రి అనగాని



రేపల్లె, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): తీరప్రాంతంలోని రేపల్లె నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి రూ.16.20 కోట్లు మంజూరైనట్లు మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. కూటమి అధికారంలో వచ్చి 15 నెలల్లోనే గ్రామాల్లో రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షలతో సీసీ రోడ్లు అభివృద్ధి చేశామన్నారు. వైసీపీ హయాంలో రహదారులు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. రోడ్లకు మరమ్మతులు చేయాలని విన్నవించుకున్నా నాటి పాలకులు పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. అడిగిన వెంటనే ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి నిధులు కేటాయించారని తెలిపారు. తాజాగా మంజూరైన నిధులతో పెనుమూడి నుంచి లంకెవానిదిబ్బ ఆర్అండ్‌బీ రహదారికి రూ.10.20 కోట్లు, రేపల్లె, నిజాంపట్నం ఆర్అండ్‌బీ రహదారికి రూ.3 కోట్లు, చందోలు బ్రిడ్జి నుంచి నిజాంపట్నం ఆర్అండ్‌బీ రోడ్డు నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు.

జేసీగా.. భావన వశిష్ఠ్



(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

బాపట్ల జిల్లా జేసీగా భావన వశిష్ఠ్‌ను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఆదేశాలు జారీ చేసింది. 2019 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆమె స్వస్థలం హర్యానా. అసిస్టెంట్ కలెక్టర్‌గా విజయవాడలో ట్రైనింగ్ పొందిన భావన వశిష్ఠ్ తర్వాత 15 నెలలు పార్వతీపురం సబ్‌కలెక్టర్‌గా విధులు నిర్వహించారు. జీఎస్‌డబ్ల్యూఎస్ అడిషనల్ డైరెక్టర్‌గా 15 నెలలు పని చేశారు. ఎన్నికలకు ముందు ఏఎస్ఆర్ జిల్లా జేసీగా తొలి పోస్టింగ్ దక్కించుకున్నారు. కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా గడచిన పదిహేను నెలలుగా విధులు నిర్వహిస్తున్నారు. తాజా ఆదేశాలలో భాగంగా జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఆమె నియామకం జరిగింది.

డీఆర్‌వోను ఇన్‌చార్జి జేసీగా...

ఐదు నెలల క్రితం బాపట్ల జేసీగా పనిచేసిన ప్రఖర్‌జైన్‌ను ఆర్టీజీఎస్ సీఈవోగా నియమించింది. దీంతో అప్పటి నుంచి జేసీ పోస్టు ఖాళీగానే ఉంది. రెండు నెలల క్రితం డీఆర్వో గంగాధర్‌గౌడ్‌కు ఇన్‌చార్జి జేసీ బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తాజా నియామకాల్లో ఆ పోస్టును భర్తీ చేయడంతో ఇక పై రెవెన్యూ సంబంధిత విభాగాల్లో పనులు ఊపందుకోనున్నాయి.



మంత్రి లోకేశ్‌తో పండిత పరిషత్ నాయకులు

విద్యా మంత్రికి పండిత పరిషత్ కృతజ్ఞతలు

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : బాషా పండితులకు ఉద్యోగోన్నతులు కల్పించిన విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలిసి పండిత పరిషత్ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పండిత పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిచంద్ర కుమార్ మాట్లాడుతూ.. డీఈవో భాషా పండితులకు మంత్రి ఉద్యోగోన్నతులు కల్పించారని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని భాషా బోధకులకు గౌరవం కల్పించాలనే సత్ సంకల్పంతో ప్రభుత్వం రాష్ట్రంలోని 10,224 బాషా పండిత పోస్టులను స్కూల్ అసిస్టెంట్ భాషాలుగా ఉన్నతీకరణ చేస్తూ 2018లో ప్రభుత్వ ఉత్తర్వులు 91 విడుదల చేసిందని తెలిపారు. కానీ గత ప్రభుత్వంలో కొన్ని ఉపాధ్యాయ సంఘాల నిర్వాకం వల్ల ఎస్జీటీలకు ఉద్యోగోన్నతులు కల్పించడంతో సుమారు 1,200 మందికిపైగా బాషా పండితులు ఉద్యోగోన్నతి లేక ఇబ్బందులు పడ్డారని తెలిపారు. ఈ సమస్యపై మంత్రి లోకేశ్ స్పందించి దసరా కానుకగా భాషా పండితులకు ఉద్యోగోన్నతులు కల్పించారని తెలిపారు. కార్యక్రమంలో పండిత పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు సంపత్ కృష్ణ, బాధ్యులు పెదబాబు, శ్రీరాజ్, రాజేష్ పాల్గొన్నారు.



టపాసుల హోల్‌సేల్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న సీఐ సుబ్బారావు

నకిలీ టపాసులు అమ్మితే చర్యలు

మార్కాపురం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : నకిలీ టపాసులు అమ్మితే చర్యలు తప్పవని మార్కాపురం సీఐ పి.సుబ్బారావు హెచ్చరించారు. పట్టణంలోని పలు హోల్‌సేల్ టపాసుల దుకాణాలను ఆయన గురువారం తనిఖీ చేశారు. ముందుగా స్టాక్‌ను, ప్రమాదాలు జరగకుండా తీసుకుంటున్న రక్షణ చర్యలు, బిల్లులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర ప్రాంతాల నుంచి ఎలాంటి బిల్లులు లేకుండా టపాసులు తెచ్చి అమ్మితే కఠిన చర్యలు తప్పవన్నారు. అధీకృత హోల్‌సేల్ దుకాణాల నుంచే రిటైల్ వ్యాపారులు బిల్లుతో కొనుగోలు చేసి అమ్మకాలు చేసుకోవాలని సూచించారు. దీపావళి పండుగ సందర్భంగా డిమాండ్‌ను అడ్డుపెట్టుకుని అధిక ధరలకు అమ్మితే లైసెన్స్‌లు రద్దు చేస్తామని సీఐ తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ ఎం.సైదుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

త్రిపురాంతకం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : బైక్‌పై వెళుతున్న యువకులను ఎదురుగా వచ్చిన ఫోర్‌వీలర్ ఆటో ఢీకొట్టిన ఘటనలో యువకుడు మృతిచెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. గురువారం మండల పరిధిలోని మేడపి సమీపంలో ప్రమాదం జరిగింది. గణపవరం గ్రామం నుంచి ఐటివరం వెళ్లేందుకు ముగ్గురు యువకులు బైక్‌పై బయలు దేరారు. మేడపి దాటిన తరువాత అటువైపు నుంచి వస్తున్న వాహనం ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న మందా పేరయ్య (19) అక్కడికక్కడే మృతిచెందగా, మందా కోటేశు, బెజవాడ ప్రవీణ్ తీవ్రంగా గాయపడ్డారు. వారిలో కోటేశు పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరు తరలించారు. అయితే గత ఏడాది పేరయ్య తండ్రి చనిపోయారు. వెటర్నరీ కోర్సు చదువుతున్న పేరయ్య ఒక్కడే కుమారుడు కావడంతో కుటుంబీకుల రోదన మిన్నంటాయి. బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలంటూ కుటుంబ సభ్యులు కొంతసేపు ఆందోళన చేపట్టారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎర్రగొండపాలెం ఏరియా వైద్యశాలకు తరలించారు. ఎస్సై శివబసవ రాజు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న సీఐ అసాన్ బాధిత కుటుంబాలతో మాట్లాడారు.



పేరయ్య (ఫైల్)



స్లాబ్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఈఈ పీవీ రావు

నిర్మాణాలు పటిష్టంగా ఉండాలి

రాచర్ల అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : చేపట్టే నిర్మాణాలు పటిష్టంగా ఉండాలని సమగ్ర శిక్షా అభియాన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్ఎస్ఏఈఈ పీ వెంకటరత్నంరావు అన్నారు. రాచర్ల కేజీబీవీ పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణాలను గురువారం ఆయన పరిశీలించారు. స్లాబును త్వరగా పూర్తి చేయాలని, నిర్మాణాల్లో నిబంధనలు పాటించాలని ఆయన తెలిపారు. అనంతరం ఆదర్శ పాఠశాలను పరిశీలించి సమస్యలు తెలుసుకున్నారు. పాఠశాలలో హాస్టల్ బిల్డింగ్ గదుల మరమ్మతులు, మరికొన్ని సమస్యలు ఉన్నట్లు గుర్తించి, రూ.11లక్షల నిధులు మంజూరయ్యాయని, వాటిని వినియోగించుకొని మైనర్ పనులన్నీ పూర్తి చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏఈ మహేష్, అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

ఉద్యోగుల ఆర్థిక బకాయిలను విడుదల చేయాలి

● ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక బకాయిలను ప్రభుత్వం విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్ రెడ్డి కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో గురువారం స్థానిక దివ్యాం గుల కార్యాలయంలో టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్.సూర్యనారాయణ వీడియో సందేశాన్ని ఉద్యోగులకు వినిపించారు. అనంతరం కిరణ్‌కు మార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు గత కొంత కాలంగా ఆర్థిక బకాయిలు విడుదల కాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పీఆర్సీ ఇచ్చేందుకు క మిటీని నియమించి ఐఆర్‌ను ప్రకటించాలన్నారు. ఉద్యోగులు అనేక సమస్యల తో ఇబ్బందులు పడుతున్నారని, వాటిని పరిష్కరించేవిధంగా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎం.శ్రీనివాసరావు, చంద్రశేఖ ర్, పద్మజ, మురళీ, విజయకుమారి, శ్రీనివాసరావు, పోలినేని వెంకటేశ్వర్లు, నిర్మ ల, ఆదాం, దయకుమారి తదితరులు పాల్గొన్నారు.

మణికంఠ గ్రానైట్‌పై మూకుమ్మడి దాడులు

విజిలెన్స్, రెవెన్యూ, మైన్స్ అధికారుల సంయుక్త సర్వే

అక్రమ క్వారీయింగ్ కార్యకలాపాలపై తనిఖీలు

నేడూ కొనసాగనున్న పరిశీలన

చీమకుర్తి,అక్టోబరు9 (ఆంధ్రజ్యోతి): చీమకుర్తి పరిధిలో ఉన్న మణికంఠ గ్రానైట్(కృష్ణసాయి గ్రూప్ ఆఫ్ కంపెనీస్) సంస్థపై గురువారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, మైన్స్‌రెవెన్యూ అధికారులు మూకుమ్మడి దాడులు నిర్వహించారు.కృష్ణసాయి గ్రూప్ ఆఫ్ కంపెనీస్‌లో భాగంగా ఉన్న మణికంఠ గ్రానైట్ సంస్థ ప్రభుత్వ భూములు ఆక్రమించుకోవటమే కాక వాటిలో అక్రమ క్వారీయింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతుందని, ఈ సంస్థపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని ఏపీ డిప్యూటీ జనరల్ ఆఫ్ మైన్స్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు మలినేని కోటేశ్వరరావు అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు.దీనికి స్పందించిన డీజీ ఆదేశాల మేరకు గురువారం ఆకస్మికంగా మూకుమ్మడి తనిఖీలు నిర్వహించారు. చీమకుర్తి పట్టణంలోని సర్వేనంబర్లు 973బై1 నుంచి 6,9,11,12(పి),13(పి), 974బై1 నుంచి 9,11,971 బై5,533(పి)534బై4,5, 971బై6పిలలో గెలాక్సీ గ్రానైట్‌కు సంబంధించి అక్రమ క్వారీయింగ్ కార్యకలాపాలను సాగిస్తుందన్న ఫిర్యాదు మేరకు అధికారులు ఆయా సర్వే నంబర్లలో తనిఖీలు జరిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మణికంఠ గ్రానైట్ అనధికారికంగా ప్రభుత్వ భూముల్లో డంపుల నిర్వహణ, కటింగ్ ఫ్యాక్టరీ నిర్మించి,అందులో కార్యకలాపాలు నిర్వహిస్తున్నారా లేదా అనే అంశాలపై అధికారులు ఫోకస్ చేశారు.ఆయా సర్వే నంబర్లలో మండల సర్వేయర్ మోజెస్ తన సిబ్బందితో కలిసి కొలతలు తీశారు.మైన్స్ అధికారులు రికార్డులు పరిశీలించారు. అన్ని సర్వే నంబర్లలలో కొలతలు పూర్తికాకపోవటంతో శుక్రవారం కూడా సర్వే ఇతర విభాగాల్లో తనిఖీలు నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. కొలతలు, తనిఖీలు పూర్తయిన తర్వాత ఉన్నతాధికారులకు నివేదికను అందించనున్నారు.

కృష్ణసాయి గ్రూపు కార్యకలాపాలపై ఆరోపణలు

కృష్ణసాయి గ్రూపు క్వారీయింగ్ కార్యకలాపాలపై మొదటినుంచి ఫిర్యాదులు,ఆరోపణలు సాగుతూనే ఉన్నాయి.ప్రభుత్వ, వాగు, కొండపోరంబోకు భూములను ఆక్రమించుకొని క్వారీయింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు గత కొన్నేళ్లుగా వస్తున్నాయి. రెవెన్యూ అధికారులకు ఈ విషయం తెలిసినా ఏనాడు పట్టించుకున్న పాపాన పోలేదు. రెవెన్యూ రికార్డుల్లో క్లియర్‌గా ప్రభుత్వ భూములు అని ఉన్న సర్వే నంబర్లలో క్వారీయింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నా చూసి,చూడకుండా పోతున్నారే తప్ప చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.ఫిర్యాదులు వచ్చినపుడు సర్వే నిర్వహించటం తర్వాత మమ అనిపించటం ఓ తతంగం ఏళ్ల తరబడి సంస్థ వలుకుబడితో సాగుతూనే ఉంది.ఒంగోలు నుంచి కర్నూలు వెళ్లే రాష్ట్రరహదారికి ఇరువైపులా అత్యంత విలువైన గెలాక్సీ గ్రానైట్ నిక్షేపాలున్న భూములు ఈ సంస్థకున్నాయి. వీటిలో తమ కార్యకలాపాలు చేసుకుంటే ఎవరికి ఇబ్బం ది ఉండదు.కానీ ఇవి చాలవన్నంటుగా ప్రభుత్వ భూములను సైతం ఆక్రమించుకొని కార్యకలాపాలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వస్తుండటం,పదే పదే ఫిర్యాదులు రావటం అధికారులు తనిఖీలు జరపటం గత కొన్నేళ్లుగా ప్రహసనంలా జరుగుతుండటం సంస్థ ప్రతిష్ఠ మసకబారేలా చేస్తుంది. ప్రస్తుతం అధికారులు జరిపే తనిఖీలు అయినా నిష్పక్షపాతంగా,పక్కాగా జరిపి నిజాలు నిగ్గు తేలిస్తే సంస్థపై ఆరోపణ పర్వానికి చెక్ పడే అవకాశం ఉంటుంది.లేదా ఆరోపణలు నిజమైతే చర్యలు తీసుకొనే అవకాశం ఉన్నతాధికారులకు ఏర్పడి పదే పదే ఫిర్యాదులకు చోటు ఉండకుండా ఉంటుంది.



సర్వే చేస్తున్న మైన్స్,విజిలెన్స్,రెవెన్యూ అధికారులు

సర్వే పూర్తయిన తర్వాత వివరాలు వెల్లడిస్తాం

మణికంఠ గ్రానైట్ సంస్థ అక్రమ క్వారీయింగ్ కార్యకలాపలకు పాల్పడుతుందని వచ్చిన ఫిర్యాదును పరిశీలించిన రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయా సర్వే నంబర్లలో సంయుక్త తనిఖీలు, సర్వే నిర్వహిస్తున్నాం.సర్వే ఇంకా పూర్తి కాలేదు.సర్వేతనిఖీలు పూర్తయిన తర్వాత నివేదికను ఉన్నతాధికారులకు నివేదించి వివరాలను వెల్లడిస్తాం.

- రాఘవ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ,మైన్స్ విభాగం

కొన'సాగు'తున్న సాగర్ నీటి పైపులైన్ పనులు

● దశాబ్దాలుగా ప్రజల ఎదురుచూపులు
● పట్టించుకోని ప్రజారోగ్య శాఖ

మార్కాపురం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణంలో అత్యంత కీలకమైన ప్రాంతం 10వ వార్డు. సుమారు 8 బ్లాకులు ఇక్కడే ఉన్నాయి. పేద, మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా జీవించేది కూడా ఇక్కడే. కూలీ నాలీ చేసుకుని ఏ రోజుకు ఆ రోజు కడుపునింపుకునే ప్రజలే అధికం. తెలుగుదేశం పార్టీకి ఈ ప్రాంతం పెట్టని కోట. ఈ కారణంచేతనో ఏమో గతంలో పాలకులు 10వ వార్డు అభివృద్ధిని విస్మరించారు. మరీ ముఖ్యంగా నేటికీ రక్షిత నీటికి కూడా నోచుకోలేని దుస్థితి ఉంది. దశాబ్ద కాలంగా పట్టణమంతా సాగర్ నీరు సరఫరా అవుతున్నా 10వ వార్డు ప్రజలకు మాత్రం ఎదురుచూపులు తప్పడంలేదు. గత వైసీపీ పాలనలో 2023లో 18 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ వేసేందుకు పనులు ప్రారంభించినా నేటికీ 25 శాతం మాత్రమే పనులు పూర్తి చేశారు. పైప్‌లైన్ వేసిన చోట కూడా రహదారులకు మరమ్మతు పనులు పెండింగ్‌లోనేఉన్నాయి. ప్రజా ప్రభుత్వంలోనైనా సాగర్ నీరు అందుబాటులోకి వస్తుందని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

మొదటి నుంచి శీతకన్నే..

మార్కాపురం పట్టణ ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు 2011లో ప్రపంచ బ్యాంక్ నిధులు రూ.52కోట్లతో అండర్ గ్రౌండ్ పైప్‌లైన్ పనులను ప్రారంభించారు. 2014 కల్లా ఆ పనులు పూర్తయ్యాయి. అప్పట్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడంతో అన్నిచోట్ల అండర్ గ్రౌండ్ పైప్‌లైన్ వేసినా స్థానిక 28వ బ్లాక్ నుంచి 34వ బ్లాక్ వరకు వివక్ష చూపింది. కేవలం జవహర్‌నగర్ కాలనీ ప్రాంతంలో మాత్రమే పైప్‌లైన్ వేశారు. ఆ తర్వాత గత వైసీపీ 2023లో 7బ్లాకుల్లో 18 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ వేసేందుకు ప్లాన్ గ్రాంట్ నిధులు రూ.5.2కోట్లు మంజూరు చేసింది. పనులు దక్కించుకున్న ఏవీఆర్ ఇన్ ఫ్రా అప్పట్లో కేవలం 2 కిలోమీటర్ల మేర మాత్రమే అండర్‌గ్రౌండ్ పైప్‌లైన్ వేసింది. సాధారణ ఎన్నికలు రావడం ప్రభుత్వం మారడంతో ఆ సంస్థ పనులు నిలిపివేసింది. కొన్నాళ్ల కిందట ఈ పనిని రఘురామ్ పైప్స్ సంస్థ సబ్ లీజుకు తీసుకుంది. అయినా పనుల్లో వేగం పెరగలేదు. ఆ సంస్థ కూడా 2.2 కిలో మీటర్ల మేర మాత్రమే పనులు చేసింది. పైప్‌లైన్ వేసేందుకు రహదారులను తవ్వినా మరమ్మతు పనులు పూర్తి చేయలేదు. దీంతో ఆ 4.2 కిలో మీటర్ల మేర ఉన్న ప్రాంతాల వాళ్ల రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల ప్రజలే సొంత నిధులతో పైప్‌లైన్ వేసిన ప్రాంతంలో మరమ్మతులు చేసుకున్నారు. వాస్తవానికి పనులు రెండు సంవత్సరాల కాలవ్యవధిలో పూర్తి కావాల్సివుంది. ప్రస్తుతం జరుగుతున్న పనుల తీరును గమనిస్తే మిగిలిన 13.8 కిలో మీటర్ల మేర పైప్‌లైన్ పనులు పూర్తి చేయడానికి ఎన్నేళ్లు పడుతుందో తెలియకుంది. దశాబ్దాలుగా రక్షిత నీటికోసం ఎదురుచూస్తున్న ఈ ప్రాంత ప్రజలు మరికొన్నాళ్లు వేచి చూడాల్సిందే. పనులను పర్యవేక్షిస్తున్న ప్రజారోగ్య శాఖ ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడంతోనే నత్తనడకన పనులు సాగుతున్నట్లు తెలుస్తోంది.



మార్కాపురం 10వ వార్డులో డీప్ బోర్ల ద్వారా నీటిని సమకూర్చుకునేందుకు ప్లాస్టిక్ పైపులే దిక్కు

పైపులు అందుబాటులోకి వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తాం

ప్రస్తుతం కాంట్రాక్టర్ పైపులు అందుబాటులో లేకపోవడంతో పనులు ఆపారు. వాటికి ఆర్డర్ పెట్టారు. వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. పైప్‌లైన్ వేసిన ప్రాంతాల్లో సీసీ రహదారులకు మరమ్మతులను త్వరలోనే చేయిస్తాం. రెండు రోజుల్లో పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం.

- శ్రీనివాసరావు, డీఈ, ప్రజారోగ్యశాఖ

బంధిఖానాలో బాల్యం

(5వ పేజీ తరువాయి)

గుంటూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఐదో జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం రాష్ట్రంలోని 20 నుంచి 24 ఏళ్ల మధ్య వయసున్న యువతుల్లో 29.3 శాతం మంది బాల్య వివాహాలు చేసుకుంటున్నారని తేలింది. ఇది జాతీయ సగటు 23 శాతం కంటే 6 శాతం అధికం. బాల్య వివాహం చేసుకున్న గ్రామీణ మహిళలు 32.9 శాతం ఉండగా, పట్టణ ప్రాంతాల్లో 21.7 శాతం మంది ఉన్నారు. వీరిలో 12.6 శాతం మంది 15 నుంచి 19 ఏళ్లలోపే గర్భం దాల్చారు.

● జిల్లాల పునర్విభజన తర్వాత

- జిల్లాల పునర్విభజన తర్వాత ఒక్క గుంటూరు జిల్లాలోనే 2022లో 32, 2023లో 30 కేసులు నమోదయ్యాయి. 2024లో 29 బాల్య వివాహాలు నమోదవగా వాటిలో 23 బాల్య వివాహాలను అధికారులు అడ్డుకున్నారు. 2025లో గడిచిన తొమ్మిది నెలల్లో 20 కేసులు రిపోర్టవగా 16 బాల్య వివాహాలను అధికారులు అడ్డుకున్నారు.
- పల్నాడు జిల్లాలో 2022, 2023లో 21, 2022లో 12, 2023లో 24, 2024లో 28, 2025లో ఇప్పటి వరకూ 20కి పైగా బాల్యవివాహాలను అధికారులు అడ్డుకున్నారు.
- బాపట్ల జిల్లాలో ఇప్పటి వరకు 29 బాల్య వివాహాలను అధికారులు అడ్డుకున్నారు. కాగా, 2024, 2025లో 58 బాల్య వివాహాలను అధికారులు ఆపగలిగారు. ఇది అధికారులు అడ్డుకున్న బాల్య వివాహాల లెక్క మాత్రమే. అయితే క్షేత్ర స్థాయిలో ఈ సంఖ్య పదుల రెట్లు ఎక్కువగా ఉంటోందన్నది జగమెరిగిన సత్యం.

● ఫిర్యాదు చేస్తేనే..

ఏదో ఒక వివాదం జరిగి, ఎవరైనా ఉద్దేశ పూర్వకంగా ఫిర్యాదు చేస్తే తప్ప బాల్య వివాహాల విషయం అధికారుల వరకూ రావడం లేదన్నది వాస్తవం. ఏదిఏమైనప్పటికీ గడిచిన నాలుగేళ్లలో బాల్య వివాహాల దురాచారం విపరీతంగా పెరిగింది. గ్రామీణ ప్రాంతాల విషయం ఎలా ఉన్నా, పట్టణ ప్రాంతాల్లోనే ఈ మహమ్మారి జడలు విప్పి.. కోరలు చాచి చిన్నారుల జీవితాలను వివాహ బంధనాల్లోకి లాగేయడం తిరోగమన సంకేతాలు ఇస్తోంది.

● వివిధ స్థాయిల్లో కమిటీలు..

బాల్య వివాహాలను అడ్డుకునేందుకు జిల్లా స్థాయిలో కలెక్టర్, డివిజన్ స్థాయిలో డివిజన్ అధికారి, సబ్ కలెక్టర్లు బాల్య వివాహ నిరోధక అధికారులుగా వ్యవహరిస్తారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సీడీపీవో ప్రాజెక్టు స్థాయిలో 3 నుంచి 5 మండలాలకు ఒక బాలల అభివృద్ధి ప్రాజెక్టు అధికారి, మండల స్థాయిలో సంబంధిత తహసీల్దార్ పనిచేస్తారు. గ్రామాల్లో సర్పంచి, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, స్థానిక ఉపాధ్యాయురాలు, మహిళా వార్డు మెంబర్లు, స్వచ్ఛంద సంస్థ, యువజన సమాఖ్య సభ్యుడు, ఆరోగ్య, అంగన్వాడీ కార్యకర్తలు బాల్య వివాహ నిరోధక కమిటీలో సభ్యులుగా ఉంటారు. వీరంతా బాల్య వివాహల వల్ల కలిగే నష్టాలను ఆయా ప్రాంతాల్లో తెలియజేస్తూ.. తల్లిదండ్రుల్లో అవగాహన పెంచుతారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతుంటే అడ్డుకుంటారు. ఈ కమిటీలు నామమాత్రంగా మారిన కారణంగానే బాల్య వివాహాల సంఖ్య ఇటీవల ఆందోళనకర స్థాయిలో పెరుగుతోంది. బాల్య వివాహాలపై ఐసీడీఎస్ కృషి చేస్తున్నప్పటికీ అది ఏమాత్రం సరిపోవడం లేదన్నది గణాంకాల ద్వారా వెలికి తెలుస్తున్న వాస్తవం!

● భయమే కారణమా?

గ్రామాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో బాల్య వివాహాలు జరగడానికి కారణం అవిద్య, అవగాహనాలేమి కారణాలుగా కనిపిస్తున్నాయి. పట్టణ ప్రాంతాల్లోని తల్లిదండ్రుల సమస్య వేరేలా ఉంటోంది. సినిమా, టీవీల దుష్ప్రభావాలు, లైంగిక వేధింపులు, అత్యాచారాల నుంచి బయట పడేందుకు తక్కువ వయసులో పెళ్లిళ్లకు పూనుకుంటున్నారు. సమాజాన్ని ఆవరించిన అభద్రతా భావం ఆడపిల్లలకు శాపంగా మారింది. ప్రజల్లో అవగాహన పెంచి, భయం పోగొట్టి, మహిళలకు, ఆడపిల్లల భద్రతకు భరోసా ఇచ్చేలా ప్రభుత్వం చొరవ తీసుకుంటే తప్ప ఈ బాల్య వివాహాలు అడ్డుకోవడం కష్టమని నిపుణులు చెబుతున్నారు.

బాల్య వివాహాలతో నష్టాలెన్నో..

- శారీరక, మానసిక ఎదుగుదల దెబ్బతింటుంది.
- పరిపూర్ణ వ్యక్తులుగా ఎదిగేందుకు అవకాశం,స్వేచ్ఛ ఉండదు.
- చిన్న వయసులోనే గర్భధారణ తల్లీబిడ్డకు ప్రమాదం.
- తక్కువ బరువుతో శిశు జననం, పౌష్టికాహార లోపం, రక్తహీనత వంటి ఆరోగ్య సమస్యలు వస్తాయి.
- బాలికా విద్యా హక్కును ఇది కాలరాస్తుంది. పిల్లలు నిరక్షరాస్యులుగా, నైపుణ్యం లేనివారుగా మిగిలిపోతారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జనార్దన్

ఏపీబీఎస్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాబ్ మేళా

ఒంగోలు కల్చరల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య (ఏపీబీఎస్ఎస్ఎస్) ఆధ్వర్యంలో డిసెంబర్ 13న నిరుద్యోగులకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను గురువారం ఒంగోలులో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఐటీ, నాన్ ఐటీ, ఫార్మా, బ్యాంకింగ్, ఫైనాన్స్ వంటి సుమారు 50 కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొంటాయని, గుంటూరులో నిర్వహించే ఈ జాబ్ మేళాలో పాల్గొనటానికి నిరుద్యోగులు నవంబరు 22వ తేదీ లోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్‌శర్మ తెలిపారు. జాబ్ మేళాలో పేర్లు నమోదు, వివరాల కోసం 9030353651, 9989773451, 9949722792 సెల్ నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఈ సందర్భంగా మ్మెల్యే దామచర్ల నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో సమాఖ్య మహిళా అధ్యక్షురాలు కామరాజుగడ్డ కుసుమకుమారి, ఉపాధ్యక్షులు ఆదిపూడి గిరిజా శంకర శాండిల్య, ప్రచార కార్యదర్శి ముక్తినూతలపాటి వాసు, ఎస్‌పీటీ రాజేష్, కె.మారుతీ వినయ్, పలువురు బ్రాహ్మణ ప్రముఖులు పాల్గొన్నారు.

స్పాసెంటర్లలో పోలీసుల తనిఖీలు

ఒంగోలు క్రైం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలో ఉన్న స్పా సెంటర్లలో గురువారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. మొత్తం 10 సెంటర్లలో 9 బృందాలు ఏకకాలంలో తనిఖీలు చేశారు. డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు వన్‌టౌన్ సీఐ నాగరాజుతోపాటుగా మరో 8మంది ఎస్ఐలు తనిఖీలు చేపట్టగా కొన్ని సెంటర్లు మూసివేసినట్లు గుర్తించారు. మిగతా సెంటర్లులో ఎలాంటి అసాంఘీక కార్యక్రమాలు జరగడంలేదని సీఐ నాగరాజు వెల్లడించారు.

గాలిగోపుర నిర్మాణానికి విరాళం

ఒంగోలు కల్చరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం రంగారాయుడు చెరువు వద్ద బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో పునర్నిర్మాణం జరుగుతున్న శ్రీభువనేశ్వరి సమేత పశుపతీశ్వరస్వామి దేవస్థాన గాలి గోపుర నిర్మాణానికి పద్య సారస్వత పరిషత్ జాతీయ అధ్యక్షుడు చదలవాడ లక్ష్మీనరసింహారావు భారీ విరాళాన్ని అందజేశారు. రూ.7లక్షల చెక్కును ఆయన అడ్వాన్సుగా గురువారం బ్రాహ్మణ సేవాసమితి కార్యవర్గానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన భార్య చదలవాడ కామేశ్వరి జ్ఞాపకార్థం గాలి గోపుర నిర్మాణ పూర్తి ఖర్చును తాను విరాళంగా ఇస్తున్నట్లు చెప్పారు. అనంతరం సేవాసమితి సభ్యులు లక్ష్మీనరసింహారావును సత్కరించారు.



మహాజనసభలో మాట్లాడుతున్న చైర్మన్ కామేపల్లి సీతారామయ్య

పీడీసీసీ బ్యాంకులో డివిడెండ్ పెంపు

● చైర్మన్ డాక్టర్ సీతారామయ్య

ఒంగోలు విద్య, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పీడీసీసీ బ్యాంకు ఖాతాదారులకు లాభాల్లో డివిడెండ్‌ను 0.10శాతం పెంచి చెల్లించనున్నట్లు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య తెలిపారు బ్యాంకు 74వమహాసభ గురువారం సాయంత్రం ఒంగోలులోని పీడీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ సీతారామయ్య మాట్లాడుతూ ఖాతాదారులకు బ్యాంకు ఆర్జించే లాభాల్లో డివిడెంట్‌ను ప్రకటించారు. నాన్ క్రెడెట్ వ్యాపారం చేసేందుకు సొసైటీలు ముందుకు వస్తే తాము ప్రోత్సహిస్తామన్నారు. సొసైటీల భవన నిర్మాణాలకు పాలకవర్గాలు తీర్మానాలు చేసి పంపిస్తే నిధులు సమకూరుస్తామని చెప్పారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ శ్యామలకాశిరెడ్డి, జిల్లా సహకారాధికారి డి.శ్రీలక్ష్మి, బ్యాంకు సీఈవో శర్మ, బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సీజననల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ సేవల పట్ల ప్రజల్లో సంతృప్తి స్థాయి పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు, మందుల పంపిణీ, ఆలయాల్లో మౌలిక సదుపాయాలు, అట్రాసిటీ చట్టం కింద బాధితులకు పరిహారం చెల్లింపు తదితర అంశాలపై కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజాబాబు, జేసీ గోపాలకృష్ణ, డీఆర్వో చిన ఓబులేషు పాల్గొన్నారు.

క్రీడల్లో తురిమెళ్ల కళాశాల విద్యార్థుల ప్రతిభ

కంభం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఎస్‌జీఎఫ్ అండర్-19 విభాగంలో తురిమెళ్లకు కాలేజీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఒంగోలులో ఈనెల 9వ తేదీ జరిగిన జిల్లా స్థాయి క్యారమ్స్ క్రీడా పోటీల్లో తురిమెళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు జిల్లా స్థాయిలో గెలుపొంది, రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ జీ సోని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. 7వ తేదీన సింగరాయకొండలో జరిగిన క్రీడా పోటీల్లో కూడా తురిమెళ్ల విద్యార్థి మహేష్ 800మీటర్ల పరుగుపందెంలో డిస్కత్రోలో సత్తా చాటిన విషయం తెలిసిందే.

చట్టసభల్లో బీసీలకు ప్రాధాన్యత కల్పించాలి

● మాజీ ఎంపీ చిమటా సాంబు

చీరాల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : బీసీ సామాజిక వర్గానికి చట్టసభల్లో రిజర్వేషన్ శాతం పెంచి ప్రాధాన్యత కల్పించాలని మాజీ ఎంపీ చిమటా సాంబు డిమాండ్ చేశారు. జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు రానున్న స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని అన్నారు. కూటమి ప్రభుత్వం బీసీలకు న్యాయం చేసి చిత్తశుద్ధి చాటుకోవాలని ఎంపీ కోరారు.



హెచ్‌ఎం కొట్టిందని సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న విద్యార్థిని తల్లి

పాఠశాలకు ఆలస్యంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు

● మార్కాపురం జడ్పీ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన సబ్‌కలెక్టర్ వెంకట్ త్రివినాగ్
● హెచ్‌ఎంపై ఆగ్రహం.. ఇలా అయితే చర్యలు తీసుకుంటామని హెచ్చరిక

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలకు ఉపాధ్యాయులు, విద్యార్థులు, వార్డెన్లు ఆలస్యంగా వస్తే చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ హెచ్చరించారు. స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలను గురువారం ఉదయం 9.30గంటలకు ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆలస్యంగా రావడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయినితో మాట్లాడి ఆలస్యంగా వస్తే చర్యలు తప్పవని సబ్‌కలెక్టర్ హెచ్చరించారు.

హెచ్‌ఎం కొట్టడంతో విద్యార్థినికి ఫిట్స్.. ఫిర్యాదు చేసిన తల్లి

పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కీర్తనను ప్రధానోపాధ్యాయిని కొట్టడంతో ఫిట్స్‌కు గురైందని తల్లి పాఠశాలకు వచ్చిన సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. తరచూ పాఠశాలకు లేట్‌గా వస్తుందనే కారణంతో బుధవారం హెచ్‌ఎం శ్రీదేవి కీర్తనను కొట్టడంతో తమ కూతురికి ఫిట్స్ వచ్చిందని తల్లి తెలిపింది. వెంటనే పాపను ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించారని, ఇంటికి వచ్చిన తర్వాత తమకు తెలిసిందని బాలిక తల్లి సబ్ కలెక్టర్ వద్ద విలపించింది. హెచ్‌ఎంపై విచారణ జరిపి నివేదిక పంపాలని సబ్‌కలెక్టర్ త్రివినాగ్ ఎంఈవోను ఆదేశించారు. గతంలో మధ్యాహ్న భోజనం బియ్యం, సరుకుల విషయమై కూడా హెచ్‌ఎంపై ఫిర్యాదులుండడంతో విచారణకు ఆదేశించారు.

అవీ..ఇవీ..

క్యాన్సర్ బాధితునికి ఎల్‌వోసీ అందజేత


ఎల్‌వోసీ అందజేస్తున్న రమేష్

పంగులూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : కాన్సర్ వ్యాధి చికిత్స నిమిత్తం ప్రభుత్వం మంజూరు చేసిన రూ.3 లక్షల ఎల్‌వోసీని టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్ గురువారం బాధితుడు షేక్ మాబూ సుభానికి అందజేశాడు. పంగులూరు గ్రామానికి చెందిన మాబూ సుభాని కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. విషయాన్ని టీడీపీ అధ్యక్షులు రావూరి రమేష్ రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకువెళ్లాడు. ఈ విషయంపై స్పందించిన మంత్రి ముందస్తు చికిత్సకోసం ప్రభుత్వం నుంచి రూ.3 లక్షల ఎల్‌వోసీని మంజూరు చేయించారు. క్యాన్సర్ చికిత్స కోసం నిధులు మంజూరు చేయించిన మంత్రి రవికుమార్‌కు, సహకరించిన టీడీపీ అధ్యక్షులు రావూరి రమేష్‌కు బాదిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

వార్డులో ప్రజలకు పారదర్శక సేవలు

● మున్సిపల్ చైర్మన్ సాంబశివరావు


సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న శ్రీనివాసరావు

చీరాల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : పురపాలక సంఘం పరిధిలోని ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాలని మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు అన్నారు. గురువారం సమావేశ మందిరంలో సచివాలయ సిబ్బంది, పారిశుధ్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. వార్డులో పారిశుధ్య, తాగునీటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఈ రఘురాం, ఎన్విరాన్మెంట్ ఏఈ గీత, ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, మేనేజర్ శ్రీనివాసన్ తదితర పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యం

బల్లికురవ, అక్టోబరు9 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలలో నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా కొత్త విద్యుత్ స్తంభాల లైన్ ఏర్పాటు చేస్తున్నట్లు ఈఈ నల్లూరి మస్తాన్‌రావు తెలిపారు. మండలంలోని వైదన పంచాయతీ పరిధిలోని చవటి మాదిగపల్లెలో ఆర్‌డీఎస్ఎస్ పథకం ద్వారా చేపడుతున్న పనులను గురువారం ఈఈ మస్తాన్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో డీఈఈ సురేంద్రబాబు, ఏఈ శ్రీనివాసరావు, టీడీపీ నేత పోగుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వెంపరాలలో అదుపులో విషజ్వరాలు

● పదిరోజుల పాటు వైద్య శిబిరం, పారిశుధ్య పనులు

అద్దంకి, అక్టోబరు9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంపరాలలో విషజ్వరాలు అదుపులోకి వచ్చినట్లు మోదేపల్లి పిహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గొట్టిపాటి జయసింహ తెలిపారు. 'ఆంధ్రజ్యోతి'లో 'వెంపరాలను వెంటాడుతున్న విషజ్వరాలు' శీర్షికన కథనం ప్రచురితమైన నేపథ్యంలో పదిరోజుల నుంచి మోదేపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. జ్వరాలు తగ్గినప్పటికీ కొద్దిరోజుల పాటు నొప్పులు ఉంటాయని డాక్టర్ జయసింహ తెలిపారు. ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. కొంతకాలం పాటు స్థానికంగా ఉండే వైద్య సిబ్బందితో పాటు మరి కొంత మంది వైద్యసిబ్బందిని గ్రామంలో అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు.

బెదిరింపులపై వేటపాలెం పోలీసులకు ఫిర్యాదు

వేటపాలెం(చీరాల), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : పొలం విషయంలో కొందరు వ్యక్తులు బెదిరిపులకు పాల్పడుతున్నట్లు వేటపాలెం పోలీసులకు అక్కయ్యపాలేనికి చెందిన గొర్ల రాముడు ఫిర్యాదు చేశాడు. తన పూర్వీకుల నుంచి సంక్రమించిన 46 సెంట్లు భూమికి సంబంధించి గ్రామానికి చెందిన జంగిలి రామారావు, వర్గీయులతో విభేధాలు ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. అయితే కోర్టు తమకు అనుకూలంగా తీర్పు అందించి ప్రత్యుర్థులకు అపరాధ రుసుం కూడా విధించినట్లు వివరించారు. అయితే ఉద్దేశ్య పూర్వకంగానే చంపుతామని బెదురిస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారిస్తున్నట్లు వేటపాలెం ఎస్సై జనార్ధన్ తెలిపారు.

మందుబాబులకు జరిమానా

అద్దంకి, అక్టోబరు9 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలను నడుపుతున్న ముగ్గురిని గురువారం అద్దంకి కోర్టులో హాజరుపరచగా న్యాయాధికారి అఖిల ఒక్కొక్కరికి రూ.3 వేల చొప్పున మొత్తం రూ.9 వేల అపరాధ రుసుము విధించినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

వివాద రహితంగా గడియార స్తంభం నిర్మాణం

● వైసీపీ నేతలతో మున్సిపల్ చైర్మన్ భేటీ

చీరాల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఎటువంటి వివాదాలకు తావులేకుండా గడియార స్తంభం ఏర్పాటు చేయనున్నట్లు మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావును కోరారు. గురువారం ఆయన తన ఛాంబర్‌లో వైసీపీ నేతలతో భేటీ అయ్యారు. పట్టణంలో గడియార స్థంభం నిర్మాణం చేపట్టే క్రమంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి సంబంధించిన మెట్లుకు స్వల్ప మార్పులు చేర్పులు చేపట్టాల్సి ఉంది. దీంతో రాజకీయ, ఇతర సమస్యలు తలెత్తకుండా ముందుగా చైర్మన్ సమస్యను వారి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై సానుకూలంగా స్పందించిన నేతలు విషయాన్ని పార్టీ ముఖ్య నేతలతో చర్చించి అభిప్రాయాన్ని తెలుపుతామన్నారు. భేటీ అయిన వారిలో వైసీపీ కౌన్సిలర్ బొనిగల జైసన్‌బాబు, కీర్తి వెంకట్రావు, బత్తుల అనీల్, తోకల అనీల్, చీమకుర్తి బాలకృష్ణ, కంపా అరుణ్, పట్టణ పార్టీ అధ్యక్షులు యాతం మేరీబాబు ఉన్నారు.

నిరుపయోగంగా జనరేటర్

- పనిచేయకుండా మూలకు చేరిన వైనం
- శిథిలమవుతున్నా పట్టించుకోని అధికారులు


నిరుపయోగంగా ఉన్న జనరేటర్

మేదరమెట్ల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన సేవలు అందించే ఉద్దేశ్యంతో ప్రభుత్వ కార్యాలయాల్లో అనేక మౌలిక సదుపాయాలను కల్పిస్తోంది. ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనులపై వచ్చే ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఉండడానికి రాష్ట్రప్రభుత్వం తహసీల్దార్ కార్యాలయాల్లో లక్షలు వేచ్చించి జనరేటర్‌లను ఏర్పాటు చేసింది. విద్యుత్ కోతలతో, సరఫరాలో అంతరాయం వలన ప్రజలకు సేవలు అందుబాటులో ఉండడానికి ఈ ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని 660 మండలాలల్లో ప్రభుత్వం జనరేటర్లను మంజూరు చేసింది. అయితే గత ఏడు సంవత్సరాలుగా ఈ జనరేటర్లు పనిచేయడం లేదు. వీటి నిర్వహణను ఏదైన ఏజెన్సీకి అప్పగించి, నిధులు కేటాయిస్తే జనరేటర్లు పనిచేసేవి. కనీసం ఏజెన్సీ ద్వారా నిర్వహణ చేపట్టక పోవడంతో లక్షల వెచ్చించి కొనుగోలు చేసిన జనరేటర్లు నిరుపయోగంగా మారాయి. ఇవి ఆరుబయట ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఉండడంతో శిథిలావస్థకు చేరాయి.

గతంలో ముఖ్యమంత్రులు, జిల్లా కలెక్టర్లు, వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించే సమయం లో విద్యుత్ అంతరాయం లేకుండా ఉండడం కోసం, కార్యాలయాలల్లోని కంప్యూటర్లు అన్ని పని చేయాడానికి అవసరమైన సామర్థ్యం కలిగిన జనరేటర్లను ఏర్పాటు చేశారు. జనరేటర్ల మాదిరిగానే వీడియో కాన్ఫరెన్స్‌ల కోసం ప్రభుత్వం ఇచ్చిన పెద్ద పెద్ద టీవీలు మరమ్మతులతో మూలకు చేరాయి. చాలా మండలాల్లో అధికారులు తమ లాప్‌ట్యాప్ లలోనే వీడియో కాన్ఫరెన్స్‌లకు హాజరవుతున్నారు.

జనరేటర్లు నిరుపయోగంగా ఉన్న విషయాన్ని కింది స్థాయి అధికారులు కలెక్టర్ దృష్టికి, కలెక్టర్ రాష్ట్రస్థాయి అధికారుల దృష్టికి తీసుకువెళితే సమస్య పరిష్కారం అవుతుంది. మరోకొన్నాళ్లు ఇదేవిధంగా వదిలేస్తే ఈ జనరేటర్‌ను పాత ఇనుము కింద అమ్ముకోవాల్సి వస్తుంది. ఇదే విధంగా మండల కార్యాలయాల్లో టీవీలు కూడా మరమ్మతులకు నోచుకోలేదు. రాష్ట్ర ప్రభుత్వ ఇప్పటికైన స్పందించి జనరేటర్లను వినియోగంలోనిక ఏత ప్రజలు కోరుతున్నారు.

అద్దంకి సీహెచ్‌సీకి ఏఆర్‌టీ సెంటర్ మంజూరు

వసతులను పరిశీలించిన డీఎల్‌వో


వసతులను పరిశీలిస్తున్న బాపట్ల డిఎల్‌వో సోమూనాయక్, తదితరులు

అద్దంకిటౌన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): అద్దంకికి ఏఆర్‌టీ సెంబర్ మంజూరు అయిందని దానికి సంబంధించి అద్దంకి సీహెచ్‌సీలో వసతులను పరిశీలిం చినట్లు బాపట్ల డీఎల్‌వో సోమునాయక్ అన్నారు. గురువారం అద్దంకి సీహెచ్‌సీని ఆ యన పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యశాల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వాహిలా చౌదరితో గదుల లభ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే వైద్యశాలలో టీబీ సెంటర్‌కు గదిని కేటాయించామని, మరొక గదిని ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా ఏఆర్‌టీ సెంటర్ ఏర్పాటుకు ముఖ్యంగా 5 నుంచి 6 గదులు అవసరం అ వుతాయని శాశ్వత భవనం నిర్మాణం జరిగే వరకు తాత్కాలిక గదిని ఏర్పాటు చేయనున్నట్లు సోమునాయక్ తెలిపారు. తద్వారా సెంటర్‌లో డాక్టర్, స్టాఫ్‌నర్స్ ఫార్మసిస్ట్, ఎల్‌టీ అదనంగా రావడంతో పాటు ఉచిత మందుల సౌకర్యం ఉంటుందన్నారు. గతంలో రోగులు అద్దంకి ప్రాంతం నుంచి ఒంగోలు, చీరాల ఏఆర్‌టీ సెంటర్లకు వెళ్లే వారని మంత్రి గొట్టిపాటి రవికుమార్ చొరవతో అద్దంకికి ఏఆర్‌టీ సెంటర్ వచ్చిందన్నారు. దీంతో అద్దంకి ప్రాంతంలోని రోగుల బాధలు తీరనున్నాయని తెలిపారు. ప్రస్తుతం 1300 మంది హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాధిగస్తులకు మందులు అందజేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట సీపీఎం జానీ భాషా, హెల్ప్ స్వచ్చంద సంస్థ డైరెక్టర్ బీవీ సాగర్, సిబ్బంది ఉన్నారు.

అట్లతద్ది సందడి


చినగంజాంలో ఉయ్యాల ఊగుతున్న చిన్నారులు

అద్దంకి, అక్టోబరు9 (ఆంధ్రజ్యోతి): అట్లతద్ది పర్వదినాన్ని మహిళలు గురువారం సాంప్రదాయబద్ధంగా ఉత్సాహంగా నిర్వహించారు. పట్టణంలోని పలు ప్రాంతాలతో పాటు పలు గ్రామాలలో మహిళలు ఊయలలపై ఊగుతూ ఉత్సాహంగా గడిపారు. రంగు రంగుల కాగితాలతో అలంకరించారు. మహిళలు పోటీ పడి ఊగారు. కొత్తగా వివాహమైన యువతులకు పుట్టింటి వారు తద్దెలు తీర్చారు.

చినగంజాం : మండల పరిధిలోని గ్రామాల్లో అట్లతద్ది పండుగను గురువారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారజాము నుంచే నియమ నిష్టలతో, ఉపవాసాలతో మహిళలు గౌరిదేవికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. రాత్రికి గౌరిదేవి వ్రతం నిర్వహించి వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. ఉయ్యాల వేడుకలలో మహిళలు ఉత్సహంగా పాల్గొన్నారు. పలు గ్రామాల్లో ఉయ్యాలను విద్యుత్ దీపాలతో అలకరించారు.

మార్టూరు : మార్టూరు గ్రామంలో గురు వారం రోజు సంపత్ నగర్ యువకులు ఉయ్యాల వేశారు. గతంలో ఐదారుచోట్ల ఇలా ఉయ్యాల వేడుకలు నిర్వహించే వారు. ప్రస్తుతం కేవలం ఒక్కచోట మాత్రమే వేయడంతో పండగ సందడి తగ్గిపోయింది. చాలా మంది మహిళల కు గురువారం అట్లతద్దె పండుగ అనే విషయం కూడా గుర్తు లేదంటే అతిశయోక్తికాదు.

ఖోఖో ఉమ్మడి ప్రకాశం జిల్లా జట్టు ఎంపిక

సత్తా చాటిన పలువురు క్రీడాకారులు


ఉమ్మడి ప్రకాశం జిల్లా అండర్- 19 బాలుర జట్టు

పంగులూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ జూనియర్ కళాశాలల రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలలో పాల్గొనే అండర్-19 బాలుర జిల్లా ఖోఖో జట్టు ఎంపిక గురువారం పంగులూరులో నిర్వహించారు. స్థానిక ఎంఎస్ఆర్ అండ్ బీఎన్ఎం జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో జరిగిన ఖోఖో జిల్లా జట్టు ఎంపిక కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన పలు జూనియర్ కళాశాలల నుంచి 40 మంది క్రీడాకారులు పాల్గొని తమ క్రీడానైపుణ్యం చాటారు. జిల్లాజట్టుకు 12 మంది క్రీడాకారులతో పాటు ముగ్గురు స్టాండ్‌బై క్రీడాకారులను ఎంపిక చేసినట్లు కళాశాల పీడీ, ఖోఖో అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.సీతా రామిరెడ్డి తెలిపారు. ఎంపిక కార్యక్రమంలో సీనియర్ ఖోఖో క్రీడాకారుడు షేక్ అహమ్మద్, పీడీ రవికిరణ్ రెడ్డి, వేణు పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు క్రీడాకారులకు ఎంపిక

ఉమ్మడి ప్రకాశం జిల్లా ఖోఖో జట్టుకు ఎంపికైన క్రీడాకారులను రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి ఎం.సీతారామిరెడ్డి గురు వారం సాయంత్రం ప్రకటిం చారు. జిల్లాజట్టుకు సీహెచ్. బాజీబాబు, ఎస్.భరత్ కుమార్, ఐ.ప్రవీణ్‌రెడ్డి, పి.నరేష్, డి.వినయ్, సి.లక్ష్మీ నరసింహ, సీహెచ్. నాగవర్దన్, ఎం.ఆంజనే యులు, ఐ.అనిల్, కె.మోహనరావు (ఎంఎస్ఆర్ అండ్ బీఎన్ఎం జూనియర్ కళాశాల పంగులూరు), ఎ.రామకృష్ణారెడ్డి (శ్రీవిద్యాని కేతన్ సింగరాయకొండ), ఆర్.విఖ్యాత్‌రావు (సాయిబాబా సెంట్రల్‌స్కూల్, పెళ్ళూరు) ఎంపికయ్యారు. వీరితోపాటు స్టాండ్‌బై క్రీడాకా రులుగా యం.దానియేల్, సి.శివప్రసాద్, బి.గోపీచంద్(పంగులూరు జూనియర్ కళాశాల) ఎంపికయ్యారు. జిల్లా ఖోఖో క్రీడాజట్టు ఎంపికకు అవకాశం కల్పించిన స్కూల్‌గేమ్స్ కార్యదర్శి ఎం.చింపారెడ్డి, ఆర్ఐవో ఆంజనేయులుకు సీతారామిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడాపోటీలలో కొండమంజులూరు విద్యార్థుల సత్తా

● జిల్లాజట్టుకు ఎంపిక


సత్తాచాటిన విద్యార్థులతో ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు

పంగులూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌స్థాయి ఆటల పోటీలలో కొండమంజులూరు విద్యార్థులు సత్తాచాటి జిల్లా జట్టులో స్థానం పొందారు. చీరాల డివిజన్ స్థాయి బాలుర ఖోఖో, బాలికల వాలీబాల్ పోటీలు బుధవారం మార్టూరు మండలం కోలలపూడిలో ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ పోటీలలో పాల్గొన్న కొండమంజులూరు ఉన్నత పాఠశాల విద్యార్థి కప్పెర జాన్‌బాబు అండర్ -17, చొప్పరపు నవీన్ అండర్ -14 ఖోఖో పోటీలలో పాల్గొనేందుకు జిల్లాజట్టులో స్థానం లభించగా, వల్లెపు రమ్యకు జిల్లా వాలీబాల్ జట్టులో స్థానం దక్కింది. ఈ ముగ్గురు క్రీడాకారులను కొండమంజులూరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఐ.అనిత, గ్రామ పెద్దలు, పాఠశాల ఉపాధ్యాయులు గురువారం జరిగిన కార్యక్రమంలో అభినందించారు.

లూథరన్ కళాశాలలో వాలీబాల్ పోటీలకు ఎంపిక

చీరాల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : నేడు సెయింట్ మార్క్స్ లూథరన్ జూనియర్ కళాశాలలో అండర్-19 వాలీబాల్ బాల, బాలికల జట్టుకు క్రీడాకారుల ఎంపిక జరుగుతుందని కళాశాల ప్రిన్సిపల్ గారపాటి పుష్పరాజ్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి చింపారెడ్డి సంయుక్తంగా తెలిపారు. సెలక్షన్స్‌లో పాల్గొనదలచిన వారు 2007 జనవరిలోపు జన్మించి ఉండాలని, ఇంటర్మీడియట్ సెకండియర్‌లోపే విద్యార్థులై ఉండాలని సూచించారు. వివరాలకు 9849505567ను సంప్రదించాలని తెలిపారు.

క్రీడలతో విద్యార్థులకు మానసిక ఉల్లాసం

● పందిళ్లపల్లిలో డివిజన్ స్థాయి పోటీలు ప్రారంభం


క్రీడాకారులతో ఉపాధ్యాయులు

పందిళ్లపల్లి(చీరాల), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : క్రీడల్లో విద్యార్థులు శారీరకంగా ధృడంగా మానసిక ఉల్లాసంగా ఉంటారని పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దీప్తి అన్నారు. వేటపాలెం మండలం పందిళ్లపల్లి హైస్కూల్లో డివిజన్ స్థాయి ఆటల పోటీలను ఆమె ప్రారంభించారు. డివిజనల్ సమన్వయకర్త కర్ణ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో మాట్లాడుతూ గత నెలలో జరగాల్సిన పోటీలు అనివార్య కారణాలతో వాయిదా పడినట్లు వివరించారు. శుక్రవారంతో ముగిసే పోటీలు కోలలపూడి, పందిళ్లపల్లి, ఇంకొల్లు పాఠశాలల్లో వాలీబాల్, షటిల్, బ్యాడ్మింటన్ జరుగుతున్నట్లు చెప్పారు. ఉత్తమంగా రాణించిన క్రీడాకారులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికవతారన్నారు.

చిత్రలేఖనం పోటీలలో విద్యార్థినుల ప్రతిభ


చిత్రలేఖనం పోటీల్లో సత్తా చాటిన వర్షా, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ చూపిన హనీ

మేదరమెట్ల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా బాపట్లలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీలల్లో రావినూతల విద్యార్థులు ప్రతిభ చూపారు. గురువారం బాపట్లలో 'సేవ్ గావ్ చైల్డ్' అనే అంశంపై జిల్లా స్థాయిలో జరిగిన వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలలో రావినూతల హైస్కూల్ విద్యార్థినులు ప్రతిభ చూపించారు. చిత్రలేఖనం పోటీలలో 10వ తరగతి విద్యార్థినీ ఎం.వర్ష ప్రథమ స్థానం, వక్తృత్వ పోటీలో 8వ తరగతి విద్యార్థిని కే.హని, ద్వితీయ స్థానం సాధించినట్లు హెచ్‌ఎం రాఘవరెడ్డి తెలిపారు. గెలుపొందిన విద్యార్థినులకు 11వ తేదీన చిత్రలేఖనం పోటీలో ప్రథమస్థానం సాధించి ఎం.వర్షకు 5 వేలు, వక్తృత్వ పోటీలో ద్వితీయ స్థానం సాధించిన కె.హనీకి రూ.3వేల నగదును కలెక్టర్ చేతుల మీదుగా నగదు బహుమతులు అందుకోనున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన నీతి అయోగ్ అధికారి

మార్టూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వలపర్ల గ్రామంలో 164 నంబరులోని బండ్ల దొడ్డి అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం నీతి అయోగ్ అదికారి వెంకటరమణ పరిశీలించారు. నీతి అయోగ్ ఆదేశాల మేరకు విశాఖ పట్నం పాపులేషన్ రీసెర్చ్ సెంటరుకు చెందిన ఎన్యుమరేటర్ వెంకటరమణ అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రంలో ఉన్న పిల్లలు ఎత్తు, బరువులను తీసుకున్నారు. అనంతరం పిల్లల తల్లులకు బాలింతలకు, గర్భిణులకు సక్రమంగా ఫీడింగ్ అందుతున్నదా..? అని వారితో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంతేగాకుండా కేంద్రం చుట్టుపక్కల ఉన్న ఇళ్లకు వెళ్లి మరిన్ని వివరాలను అడిగి తెలుసుకున్నారు. తరువాత సేకరించిన వివరాలను ఢిల్లీ నీతి అయోగ్‌కు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పర్చూరు సీడీపీవో సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు రక్త పరీక్షలు


రక్త పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

స్వర్ణ(పర్చూరు), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష పథకంలో భాగంగా కారంచేడు మండలం స్వర్ణ గ్రామంలోని ప్రభుత్వ వైద్యశాలలో గురువారం గర్భిణులకు వివిధ రక్తపరీక్షలను ఉచితంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రధానంగా కంప్లీట్ బ్లడ్ పిక్చర్, హెచ్ఐవీ, హైబిఎస్‌జీ యూరిన్ అనాలసిస్ తదితర పరీక్షలు నిర్వహించినట్లు ఇన్‌చార్జి వైద్యాధికారి డి. ప్రదీప్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక వైద్యులు, ల్యాబ్ టెక్నీషియన్స్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు యువకులపై కేసు నమోదు

● మైనర్‌ను వేధించి, ఆమె తల్లిపై కూడా దాడి

● గతంలోనే ఇలానే మరో యువతికి వేధింపులు

మార్టూరు, అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతున్న మైనర్‌ను వేధించడంతోపాటు ప్రశ్నించిన ఆమె తల్లిపై దాడి చేసిన ముగ్గురు యువకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఉన్నాయి. ముగ్గురు యువకులైన తన్నీరు రవితేజ, పల్లపు కేశవ, తన్నీరు గోపీలు ఆకతాయిగా తిరుగుతుంటారు. మండలంలోని వలపర్ల గ్రామంలో ఓ విద్యార్థిని ఇంటర్ చదువుతోంది. అయితే అదేగ్రామానికి చెందిన ఈ ముగ్గురు యువకులు తరచు బాలికను వేదిస్తున్నారు. దీంతో ఈ విషయమై తల్లి అనూరాధ బుధవారం సాయంత్రం గ్రామంలో ముగ్గురు యవకులను ప్రశ్నించింది. దీంతో వారు అనూరాధపై భౌతిక దాడి చేశారు. ఈ నేపథ్యంలో అనూరాధ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా, హెడ్ కానిస్టేబుల్ పులి అంజనేయులు కేసు నమోదు చేశారు. ఇదే క్రమంలో గ్రామంలోని మరో మహిళ కూడా ముగ్గురు యువకులపై మరో ఫిర్యాదు చేశారు. గతంలో తమను కూడా వీరు వేధించారని, ప్రశ్నిస్తే బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

జీఎస్‌టీ తగ్గింపుపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం

చార్టెడ్ అకౌంటెంట్ సతీష్‌బాబు



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న చార్టెడ్ అకౌంటెంట్ సతీష్

అద్దంకిటౌన్, అ క్టోబరు 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ వస్తువులు, ఎగుమతులు, దిగుమతులపై వేసే జీఎస్‌టీ గురించి ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని, చార్టర్డ్ అకౌంటెంట్ దామా సతీష్‌బాబు అన్నారు. గురువారం స్థానిక శ్రీ హర్షిణి వారి విజయతేజ డిగ్రీ కళాశాలలో సూపర్ జిఎస్‌టీ-సూపర్ సేవింగ్‌పై అవగాహన కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ పోపూరి నరసింహరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సతీష్‌బాబు విద్యార్థులకు జీఎస్‌టీ-2.0 గురించి, పన్నుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. పన్నులు దాని రూపంతరాలు, వ్యాట్ తరువాత జీఎస్టీ ఎలా ఏ ర్పడింది, దాని ఉద్దేశం, ప్రస్తుతం 2.0 వలన అత్యవసర, నిత్యవసర వస్తు సేవలపై తగ్గిన జీఎస్టీ ఎంత, దానివలన మధ్య తరగతి ప్రజలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. తద్వారా దేశ ఆర్థికాభివృద్ధికి ఇది ఎలా ఉపయోగపడుతుంది అనే అంశాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం దామా సతీష్‌బాబును కళాశాల యాజమాన్యం సన్మనించి జ్ఞాపికను అందజేసింది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి రమేష్‌బాబు, ఏవో తోకల రాజేష్, కళశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సూపర్ జీఎస్‌టీతో తగ్గిన వైద్యఖర్చులు

అద్దంకి : సూపర్ జిఎస్‌టీ అమలుతో వైద్యఖర్చులు ప్రజలకు బాగా తగ్గాయని మోదేపల్లి పిహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గొట్టిపాటి జయసింహ అన్నారు. మండలంలోని మోదేపల్లిలో పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జయసింహ మాట్లాడుతూ హెచ్‌ఐవీ, టీబీ తదితర వ్యాధులకు ఉపయోగించే మందులపై 12 శాతం ఉన్న జిఎస్‌టీ ని పూర్తిగా తొలగించారన్నారు. సాధారణ వ్యాధులకు సంబంధించి 12 నుండి 18 శాతం ఉన్న జిఎస్‌టీ 5 శాతానికి తగ్గిందన్నారు. వ్యక్తిగత ఆరోగ్య బీమా ప్రీమియంలకు జిఎస్‌టీ పూర్తి మినహింపు ఉందన్నారు. ఇలా వైద్యానికి సంబంధించి అన్ని వర్గాల ప్రజలకు భారం మరింత తగ్గిందన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది నాగేశ్వరరావు, సత్తార్, కన్యాకుమారి, ప్రసన్న, గ్రామస్థులు, పాల్గొన్నారు.





ఈదగాలిలో ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, పక్కన ఎస్పీ అజిత వేజెండ్ల ఇతర అధికారులు


అనుకూలించని వాతావరణం

- సీఎం పర్యటనలో మార్పు
- స్మార్ట్ స్ట్రీట్ బజారు ప్రారంభం వాయిదా
- విశ్వసముద్ర బయో ఇథనాల్ ఫ్యాక్టరీని ప్రారంభించనున్న ముఖ్యమంత్రి

నెల్లూరు (సిటీ), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు పర్యటనలో స్వల్పమార్పు చోటు చేసుకుంది. తొలుత శుక్రవారం మధ్యాహ్నం 1.30 గంటలకు చంద్రబాబు అమరావతిలోని సచివాలయం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 2.20 గంటలకు కోవూరు షుగర్ ఫ్యాక్టరీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకోవాల్సి ఉంది. ఆ తర్వాత నెల్లూరు సిటీలోని షైపాడు గేట్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన స్మార్ట్ స్ట్రీట్‌ను సీఎం ప్రారంభించాల్సి ఉంది. అనంతరం 3.15 గంటలకు వెంకటాచలం మండలం ఈదగాలి వద్ద నిర్మించిన నందగోకులం స్కూల్ ప్రాంగణానికి విచ్చేస్తారు. తొలుత స్కూల్‌ను, ఆ తర్వాత గోశాలను చంద్రబాబు సందర్శిస్తారు. ఈ సందర్భంగా విశ్వసముద్ర బయో ఇథనాల్ ప్లాంట్‌ను ప్రారంభిస్తారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం ప్రసంగిస్తారు. అక్కడ నుంచి సాయంత్రం 5:25 గంటలకు హెలికాప్టర్‌లో విజయవాడకు తిరుగు పయనమవుతారు. అయితే, వాతావరణం అనుకూలించకపోవడంతో నెల్లూరు నగరంలో స్మార్ట్ స్ట్రీట్ బజార్ ప్రారంభం వాయిదా పడింది. మిగతా కార్యక్రమాలు యథావిధిగా జరగనున్నాయి.

ఏర్పాట్ల పరిశీలన

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను ప్రజాప్రతినిధులు, అధికారులు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. వెంకటాచలం మండలం సర్వేపల్లి సమీపంలో ఈదగాలి గ్రామంలో గ్రామంలో ఏర్పాట్లను ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పరిశీలించి, విశ్వసముద్ర బయో ఇథనాల్ ఫ్యాక్టరీ ప్రతినిధులతోపాటు అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట సీఎం కార్యక్రమాల కోఆర్డీనేటర్ వెంకటేష్, ఏపీ వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్, జిల్లా అధికారులు తదితరులు ఉన్నారు. మరోవైపు ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతంతోపాటు చుట్టు పక్కల అంతా పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ అజితా వేజెండ్ల, ఇతర అధికారులు ఏర్పాట్లు, భద్రతపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.



నిధులు లేక.. పనులు కాక!

సీఎం సార్.. ఈ ప్రాజెక్టులు చూడండి

పనులే కాదు.. నిర్వహణనూ గాలికొదిలేశారు!

నెల్లూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి రంగంలో కీలకమైన ప్రాజెక్టులు నిధుల కోసం ఎదురుచూస్తున్నాయి. జిల్లాలో కొన్ని ముఖ్యమైన ప్రాజెక్టుల పనులు జరుగుతున్నా మరికొన్ని ప్రాజెక్టులకు అడుగులు ముందుకు పడడం లేదు. వాటిలో సర్వేపల్లి రిజర్వాయర్ ఆధునికీకరణ, బండేపల్లి-డేగపూడి కాలువ నిర్మాణం, నెల్లూరు, సంగం బ్యారేజీల నిర్వహణ ప్రధానమైనవి. శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటనకు వస్తున్న నేపథ్యంలో ఈ కీలకమైన ప్రాజెక్టులపై దృష్టి పెట్టాలని జిల్లా రైతాంగం కోరుకుంటోంది.

● బ్యారేజీలకు నిర్వహణ లేదు

సోమశిల, కండలేరు జలాశయాలు జిల్లాకు ఎంతటి జీవనాడి వంటివో.. సంగం, నెల్లూరు బ్యారేజీలు కూడా అంతే. ఆ రెండు జలాశయాలు నీటిని నిల్వ చేస్తే, ఈ రెండు బ్యారేజీలు ఆ నీటిని కాలువలకు మళ్లిస్తూ సాగులో కీలకంగా ఉంటున్నాయి. ఇంతటి ప్రాముఖ్యత గల బ్యారేజీలను రూ.500 కోట్లతో నిర్మించారు. అయితే ఈ బ్యారేజీల నిర్వహణను మాత్రం గాలికొదిలేశారు. నాడు వైసీపీ ప్రభుత్వంలో ఎటువంటి ముందుచూపు లేకుండా పనులు పూర్తికాకుండా బ్యారేజీలను ప్రారంభించగా, ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో అదే నిర్లక్ష్య ధోరణి కనిపిస్తోంది. ఈ రెండు బ్యారేజీల వద్ద ఉన్న గేట్లను ఎత్తేందుకు, దించేందుకు ఒక్కరంటే ఒక్క టెక్నికల్ ఆపరేటర్ కూడా లేరంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. వైసీపీ హయాంలోనే ఇరిగేషన్ అధికారులు జిల్లా నుంచి బ్యారేజీల నిర్వహణకు ప్రతిపాదనలు పంపుతున్నారు. కానీ రాష్ట్ర అధికారులు మాత్రం ఏ నిర్ణయం తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.



సంగం బ్యారేజీలో 88 గేట్లు ఉండగా నెల్లూరు బ్యారేజీలో 57 గేట్లు ఉన్నాయి. వీటి ఆపరేషన్స్ కోసం సంగం బ్యారేజీ నిర్వహణకు 28 మంది, నెల్లూరు బ్యారేజీ నిర్వహణకు 20 మంది అవసరమని ఇరిగేషన్ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ రెండు బ్యారేజీల ఫలితంగా ఏటా రూ.వేల కోట్ల పంట ఉత్పత్తులు వస్తున్నా ఏడాదికి రూ.2 కోట్లతో నిర్వహణ చేయలేకపోతున్నారు.

● ప్రమాదంలో సర్వేపల్లి రిజర్వాయర్

డెల్టా ప్రాంతంలోని ప్రధాన నీటి వనరుల్లో ఒకటైన సర్వేపల్లి రిజర్వాయర్ కింద 15,735 ఎకరాల ఆయకట్టు ఉంది. అనధికారికంగా మరో ఐదు వేల ఎకరాలు ఉన్నట్టు అంచనా. 1.73 టీఎంసీల సామర్థ్యం కలిగిన ఈ రిజర్వాయర్ ఆయకట్టుకు నీరు అందించడమే కాకుండా చుట్టుపక్కల గ్రామాలకు తాగునీటిని కూడా అందిస్తోంది. ఈ రిజర్వాయర్ నుంచే కృష్ణపట్నం పోర్టుతోపాటు పరిసరాల్లోని పరిశ్రమలకు నీటిని సరఫరా చేస్తున్నారు. ఎప్పుడో బ్రిటీషు కాలంలో నిర్మించిన ఈ రిజర్వాయర్‌ను ఆ తర్వాత తగిన రీతిలో ఆధునికీకరించలేదు. భారీ వర్షాలు కురిస్తే ఈ రిజర్వాయర్ కట్ట తెగిపోయే ప్రమాదముందని ఇరిగేషన్ అధికారులు ప్రభుత్వానికి కూడా నివేదిక అందజేశారు. అదే సమయంలో సర్వేపల్లి రిజర్వాయర్ అభివృద్ధికిగాను ఇరిగేషన్ శాఖ అధికారులు రూ.50.41 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ఈ ప్రతిపాదనలు ఆర్థిక శాఖ వద్దకు వెళ్లి వెనక్కు వచ్చాయి. గతంలో ఇదే రిజర్వాయర్‌ను సీఎం హోదాలో చంద్రబాబు పరిశీలించారు. ఇప్పుడు కూడా ఆయన చొరవ తీసుకుంటేనే సర్వేపల్లికి ప్రమాదం తప్పుతుంది.

● బండేపల్లి-డేగపూడికి గ్రహణం

2018లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వంలో బండేపల్లి-డేగపూడి కాలువకు మోక్షం లభించింది. రూ.30 కోట్లతో కాలువ నిర్మాణ పనులు అప్పట్లోనే మొదలయ్యాయి. ఇప్పటివరకూ 30 శాతం మేర పనులు జరిగాయి. ప్రస్తుతం కాంట్రాక్టర్ పనులు చేయడం లేదు. ఆ కాంట్రాక్టర్ కాకపోతే మరొకరి ద్వారానైనా పనులు చేయించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.



జలదంకి ప్రాంతంలో దళారులకు ధాన్యం విక్రయిస్తున్న రైతులు (ఫైల్)

రైతుల కష్టం.. దళారులపాలు!

- చివరి దశకు ధాన్యం విక్రయాలు
- ఆలస్యంగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు
- ఈలోపు దళారులకు అమ్మేసిన అన్నదాతలు
- 'మద్దతు' లేక రూ.200 కోట్ల నష్టం

కావలి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది పుష్కలంగా వర్షాలు పడటంతో జిల్లాలో ఖరీఫ్ కింద రైతులు సుమారు.1.8 లక్షల ఎకరాల్లో వరిసాగు చేపట్టారు. అయితే పంట చేతికొచ్చే సమయానికి ధాన్యానికి గిట్టుబాటు ధర లేకపోవడం, సకాలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ప్రకారం పుట్టి రూ.19,725 ఉండగా, రైతులు దళారులకు పుట్టి రూ. 14వేల నుంచి 14,500 వరకు విక్రయించారు. కాగా జిల్లాలో 1.8లక్షల ఎకరాల్లో చేతికొచ్చిన పంట దిగుబడిని, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసే నాటికి మూడో వంతు విక్రయించారు. దీంతో జిల్లా రైతులు సుమారు రూ.200 కోట్ల మేర నష్టపోయారు. ఎకరాకు సుమారు మూడు పుట్లు పండగా, ఒక్కో రైతు ఎకరాకు రూ.15 వేల వరకు నష్టపోయారు.

● ఎవరికి లాభం

చేతుల కాలాక ఆకులు పట్టుకున్నట్లు... రైతులకు జరగాల్సిన నష్టం జరిగాక అధికారులు జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. అది కూడా కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి కొనుగోలు కేంద్రాలు లేక రైతులు నష్టపోతున్న విషయాన్ని గతనెల 22న అసెంబ్లీలో ప్రస్తావించారు. దీంతో రెవెన్యూ, పౌరసరఫరాలశాఖ అధికారులు తర్జనభర్జన పడి, రైస్‌మిల్లర్లతో సమావేశాలు నిర్వహించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. అప్పటికే అల్లూరు ప్రాంతంలో పూర్తిగా విక్రయాలు జరిగిపోయాయి. కావలి కాలువ ప్రాంతాలైన జలదంకి, బోగోలు,దగదర్తి, కావలి ప్రాంతాల్లో కూడా 70 శాతం వరకు ధాన్యం విక్రయాలు పూర్తయ్యాయి.



అల్లూరులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం

అయితే ఇప్పుడు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు వల్ల రైతులకు పెద్దగా ఒరిగేదేమీ లేదు. దళారులు కొనుగోలు చేసిన ధాన్యం మిల్లర్లకు చేరి ఉండటంతో ఆ ధాన్యాన్నే మిల్లర్లు కొనుగోలు కేంద్రాల ద్వారా తీసుకున్నట్లు చూపించి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర మిల్లర్లు పొందే అవకాశాలు ఉన్నాయని రైతులు అంటున్నారు. రైతులకు ఇంకా మిల్లర్లు డబ్బులు ఇవ్వనందున, రైతుల కూడా తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్మినట్లు చూపిస్తే త్వరగా డబ్బులు వస్తాయని మిల్లర్లు చెప్పినట్లుగా చేస్తారు. ఇంకా రైతుల వద్ద మిగిలిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా మిల్లర్లకు అమ్మాలంటే ధాన్యంలో తెల్ల పొట్టు ఉన్నందున, అవి మిల్లింగ్ చేస్తే విరుగుడు ఎక్కువగా వచ్చి బియ్యం తగ్గుతాయని చెప్పి మిల్లర్లు పుట్టికి 50 కిలోలు అదనంగా అడుగుతున్నారని అన్నదాతలు అంటున్నారు.

ఇప్పుడెందుకు...?



వరి కోతలు పూర్తయ్యాక ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఇప్పుడు ఎందుకు...? వరికోతల సమయంలో ఏర్పాటు చేసి ఉంటే రైతులకు గిట్టుబాటు ధర వచ్చేది. కోతలు ముమ్మరంగా జరుగుతున్న సమయంలో పత్తాలేని కొనుగోలు కేంద్రాలు అంతా పూర్తయ్యాక ఏర్పాటు చేయటం ఎందుకు...?

- పాడేటి రాజశేఖర్, అల్లూరు

దొంగలు పడ్డ ఆర్నెల్లకు..



వరికోతలు పూర్తయి, విక్రయాలు అయిపోయాక కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయటం.. దొంగలు పడ్డ ఆరు నెలలకు కుక్కలు మరిగినట్టుగా ఉంది. కొనుగోలు కేంద్రాలు లేనందున ఒక్కో రైతు పుట్టికి రూ.5,000నుంచి రూ. 6,000 వరకు నష్టపోయాడు.

- కొండూరు గోవిందు, రైతు అల్లూరు

ప్రభుత్వ సహకారమేదీ..?



ప్రకృతి సహకరించినా, ప్రభుత్వం సహకారం లేక రైతులు నష్టపోయారు. నేను 32 ఎకరాల్లో ఎడగారు కింద వరి సాగు చేశా. ఎకరానికి 3పుట్ల వంతున 36పుట్లు ధాన్యం రాగా, పుట్టి రూ.14,000 వంతున విక్రయించా. మరో 20ఎకరాల్లో ఎకరానికి మూడన్నర పుట్ల వంతున 70పుట్ల ధాన్యం దిగుబడి వచ్చింది. ఈ రకం ధాన్యం పుట్టి రూ.15000 వంతున విక్రయించా. మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో దాదాపు రూ.4లక్షలు నష్టపోయా.

- బీవీ. క్రిష్ణారెడ్డి, సర్పంచి, ఆదర్శరైతు, వేములపాడు, జలదంకి మండలం

కొత్త టీచర్లు వచ్చేస్తున్నారు..!

వీధి వ్యాపారులకు 'పీఎం స్వనిధి' 8

నేటి నుంచి బోధనేతర పనుల బహిష్కరణ

● ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలి : ఫ్యాప్టో

నెల్లూరు(విద్య), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నుంచి బోధనేతర పనులను బహిష్కరిస్తున్నట్లు ఉపాధ్యాయ సంఘం ఫ్యాప్టో నాయకులు ప్రకటించారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కలిగించాలని కోరారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో గురువారం డీఈవో బాలాజీరావుకు వినతిపత్రం ఇచ్చారు. మితిమీరిన బోధనేతర కార్యక్రమాలతో బోధనకు సమయం లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పలుసార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసుకున్నా పట్టించుకోకపోవడంతో బహిష్కరణకు సిద్ధమైనట్లు తెలిపారు. ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం, మూల్యాంకనానికి సంబంధించిన పనులు మాత్రమే చేపడతామని స్పష్టం చేశారు. గూగుల్ షీట్స్ నింపడం, విద్యాశక్తి, జీఎస్‌టీ 2.0 వంటి సీజనల్ ప్రచార కార్యక్రమాలు ఇకపై చేపట్టబోమని తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో చైర్మన్ కే మధుసూదన్ రావు, సెక్రటరీ జనరల్ షేక్ జావీద్, కోచైర్మన్లు పీ మురళీకృష్ణ, మాస ప్రసాద్, పీ మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రహిత యువతే లక్ష్యం

● టీఎఫ్‌వైసీ 3.0 ప్రారంభం ● 60 రోజులు అవగాహన కార్యక్రమాలు



పోస్టర్ విడుదలలో డీఎంహెచ్‌వో, ఎన్‌సీడీ అధికారులు

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : యువతను పొగాకు ఉత్పత్తుల వాడకం నుంచి దూరం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం శ్రీకారం చుట్టిన టుబాకో ఫ్రీ యూత్ క్యాంపెయినింగ్ (టీఎఫ్‌వైసీ) 3.0 కార్యక్రమం మొదలైంది. దీనికి సంబంధించిన పోస్టర్లను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో సుజాత గురువారం విడుదల చేశారు. పొగాకు రహిత యువత కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఈ అవగాహన కార్యక్రమాలు గురువారం నుంచి డిసెంబరు 8వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. పొగాకు ఉత్పత్తుల వాడకంతో కలిగే నష్టాలపై ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో యువతకు అవగాహన కలిగించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డెమో కనకరత్నం, ఎన్‌సీడీ వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ హబ్‌గా కరేడు

● పోర్టు ఆధారిత పరిశ్రమలతో ఉపాధి, ఉద్యోగావకాశాలు

నెల్లూరు (హరనాథపురం), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : పోర్టు ఆధారిత పరిశ్రమల రాకతో కరేడు గ్రామ రూపురేఖలు పూర్తిగా మారిపోతున్నాయని, ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుతో ప్రాంతీయ అభివృద్ధికి కొత్త నాంది పలకనుందని పేర్కొన్నారు. మొత్తం 4800 ఎకరాల భూసేకరణ అవసరం కాగా ఇప్పటివరకు 515 ఎకరాలకు సంబంధించి రైతులకు అవార్డు పాస్ చేసినట్లు తెలిపారు. భూసేకరణకు ప్రభుత్వానికి సహకరిస్తూ మన ప్రాంతాల అభివృద్ధికి ముందుకొస్తున్న రైతులకు కలెక్టర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుతో ప్రత్యక్షంగా వేలాది మంది స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయని తెలిపారు. పరోక్షంగా వ్యాపారాలు, రవాణా, సేవా రంగాల్లో ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని తెలిపారు. ఇది కేవలం కరేడుకు మాత్రమే కాకుండా మొత్తం జిల్లాకు ఒక పెద్ద ఆర్థిక బలం కలిగించనుందని చెప్పారు. పరిశ్రమల కోసం తమ భూములను కోల్పోయిన రైతులకు ప్రభుత్వం న్యాయపరమైన పరిహారం అందిస్తుందని వివరించారు. కరేడులో ఏర్పడిన ఈ భూసేకరణ భవిష్యత్ తరాలకు ఒక అభివృద్ధి పథమని అన్నారు.

'సోమశిల'కు 16,180 క్యూసెక్కుల ప్రవాహం

అనంతసాగరం అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి గురువారం 16,180 క్యూసెక్కుల వరద వస్తున్నట్లు అధికారులు తెలిపారు. డ్యాంలో 72.471 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గేట్ల ద్వారా 20వేలు, ఉత్తర కాలువకు 100, కండలేరుకు వరద కాలువ ద్వారా 4,000 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.


నేటి నుంచి ఎన్టీఆర్ వైద్యసేవలకు బ్రేక్

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ వైద్య సేవలను శుక్రవారం నుంచి నెట్‌వర్క్ ఆసుపత్రులలో నిలిపి వేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ ఆసుపత్రుల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎల్వీ నారాయణ రావు ఒక ప్రకటనలో తెలియచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నెట్‌వర్క్ ఆసుపత్రులకు రూ.2,700 కోట్ల బకాయిలు ఉన్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సెప్టెంబరు 25వ తేదీన ఆశా రాష్ట్ర కార్యవర్గ భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించిందని, ఆందోలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

సంతపేట సీఐపై వేటు

నెల్లూరు (క్రైం), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకుగాను నగరంలోని సంతపేట పోలీస్‌స్టేషన్ సీఐ దశరథ రామారావును సస్పెండ్ చేస్తూ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 6వ తేదీన అర్ధరాత్రి పెన్నా బ్యారేజీ సమీపంలో జంటహత్యలు జరిగిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే సీఐను సస్పెండ్ చేశారు.

మసక నేత్రం



నెల్లూరు : జాఫర్‌సాహెబ్ కాలువ వద్ద పని చేయని సీసీ కెమెరాలు

నేర నియంత్రణకు, నేరస్థులను గుర్తించేందుకు జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు మొండికేశాయి. వీటి నిర్వహణ విషయంలో పోలీసులు పట్టీపట్టనట్టు వ్యవహరించడంతో స్తంభాలకు దిష్టిబొమ్మల్లా మారాయి. దీంతో ఎన్నో కేసుల్లో దర్యాప్తు ప్రశ్నార్థకంగా మారింది. ఇటీవల నెల్లూరులోని పెన్నా వారధి సమీపంలో జరిగిన జంట హత్యలు జరిగిన విషయం తెలిసిందే. ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఉన్నా పని చేయకపోవడంతో నేర శోధనకు పోలీసులు శ్రమించాల్సి వచ్చింది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సీసీ కెమెరాలు పని చేసేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

- వివరాలు 8లో..

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	118
స్కిన్ చికెన్	214
స్కిన్‌లెస్	236

కోడిగుడ్ల ధర (100): 540

ప్రతి ఒక్కరూ అక్షరాస్యులు కావాలి

లింగసముద్రం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ అక్షరాస్యులు కావాలని ఎంపీడీఓ కట్టా శ్రీనివాసులు సూచించారు. గురువారం మండలంలోని లింగసముద్రం, మొగిలిచెర్ల, వీఆర్ కోట, అన్నెబోయినపల్లి, చినపవని, పెదపవని, మేదరమెట్ల గ్రామాలలో ఎంపీడీఓ శ్రీనివాసులు ఉల్లాస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామాలలోని వయోజనులైన నిరక్షరాస్యులు ప్రతిరోజూ రాత్రి పూట గ్రామాలలోని పాఠశాలలకు వచ్చి చదువుకోవాలని కోరారు. వెలుగు శాఖకు చెందిన వీఓఏలు, ఉపాధిహామీ మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లను వాలంటీర్లుగా నియమించి వయోజనులకు చదువు చెప్పేలా శిక్షణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఎంవి శివకుమార్, ఏపిఎం కె సింహాద్రిరావు, ఏపీవో షేక్ సమీర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.


అక్షర ఉల్లాస్ ప్రారంభం

పెద్దపవని రోడ్డు ఆర్వోబీ వంతెన నిర్మాణం హుళక్కేనా?

● పూర్తయితే పలు మండలాలకు రాకపోకలకు అవకాశం ● తీరనున్న ప్రజల కష్టాలు

కావలి (టౌన్) అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెద్దపవని రోడ్డు 158 రైల్వే గేటు వద్ద నిర్మించతలపెట్టిన ఆర్వోబీ వంతెన నిర్మాణం హుళక్కేనా? అని పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కావలి పట్టణం నుంచి అనేక మండలాలకు ప్రకాశం జిల్లాకు చెందిన అనేక మండలాల ప్రజల రాకపోకలకు పెద్దపవని రోడ్డు ప్రధాన మార్గంగా వుంది. కలుగోళ శాంభవి ఆలయం వద్ద రైల్వే గేట్ వద్ద నిరంతరం వాహనాలతో రద్దీ ఎక్కువవడంతో 2010లో ఆర్వోబి వంతెన నిర్మాణానికి చేసిన ప్రతిపాదనలకు రైల్వే శాఖ ఆర్‌అండ్‌బి ఆమోదం తెలపాయి. 2013 మార్చిలో ఆర్వోబి వంతెన నిర్మాణానికి 31.00 కోట్ల అంచనా వ్యయంతో శిలాఫలకం వేసారు. రైల్వే భాగస్వామ్యమైన రైలు పట్టాలపై ఆర్వోబి వంతెన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసింది. పట్టాలకు కిరువైపులా రాష్ట్రప్రభుత్వానికి చెందిన ఆర్ అండ్‌బి శాఖ వారు చేపట్టాల్సిన వంతెన నిర్మాణ పనులు అంగుళం ముందుకు కదలక రైల్వే శాఖ కట్టిన వంతెన నిరుపయోగంగా మిగిలిపోవడమేకాక వెక్కిరిస్తున్నట్లుగా వుంది. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పోయి టీడీపీ అధికారంలో రాక అనంతరం వైసీపీ తిరిగి టీడీపీ ప్రభుత్వాలు అధికారాల్లో వచ్చాయి. ప్రభుత్వాలు మారుతున్నాయేగాని ఆర్వోబి వంతెన నిర్మాణం మాత్రం ఒక్క అంగుళం కూడా ముందుకు కదలలేదు.


రైలు పట్టాలపై నిర్మించిన ఆర్వోబీ వంతెన


ఆర్వోబీ వంతెన నిర్మాణానికి 2013లో వేసిన శిలాఫలకం

ప్రజల అవస్థలు అన్నీ ఇన్నీ కావు..

అందుబాటులో ఉన్న రైల్వే క్రాసింగ్ గేటు ఎత్తేయడం ఆర్వోబి వంతెన నిర్మాణం జరగక పోవడం రెంటికి చెడ్డ రేవడి అన్నవైనంగా మారి ప్రజలు రాకపోకలు సాగించేందుకు వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరద నీరు ప్రవహించేందుకు పక్కనే ఉన్న తూము మార్గాన ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తూ కాలం వెళ్ళదీస్తున్నారు. వర్షాలు పడినప్పుడు ఆమార్గంలో నీరు చేరి పూర్తిగా రాకపోకలు బంద్ చేసుకోవాల్సిన దుస్థితి.

అండర్ పాస్ నిర్మాణానికి ఎమ్మెల్యే కృషి చేయాలి

ఆర్వోబీ వంతెన నిర్మాణానికి నిధుల లేమి, ఇతర కారణాలతో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో ఆర్వోబీ వంతెన నిర్మాణం హుళక్కేనా? అన్న సందేహాలు నెలకొన్నాయి. సమస్యకు ప్రత్యామ్నాయ పరిష్కారంగా అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణానికి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి చొరవ తీసుకుని రైల్వే అధికారులు ఆర్‌అండ్‌బి అధికారులతో మాట్లాడినట్లు సమాచారం. త్వరలో అండర్ పాస్ బాక్స్ టైపు బ్రిడ్జి నిర్మాణం పనులు ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది.

రాళ్లపాడులో బయటపడ్డ మృతదేహం ఎవరిది?

● హత్యా.. ఆత్మహత్యా..? ● వీడని మిస్టరీ

లింగసముద్రం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టులో గత ఆదివారం రాత్రి బయటపడ్డ వ్యక్తి మృతదేహానికి సంబంధించిన వివరాలు ఇంకా పోలీసులకు లభ్యం కాలేదు. పోలీసులు ఈనెల 6న ఉదయం మృతదేహాన్ని ప్రాజెక్టులో నుంచి బయటకు తీసి కందుకూరు ఏరియా ప్రభుత్వ వైద్యశాలలోని మార్చురీలో భద్రపరిచారు. మృతదేహం ఎవరిది, ఏ ప్రాంతానికి చెందినవాడో తెలుసుకునేందుకు అన్నీ పోలీస్‌స్టేషన్లకు సమాచారం పంపించారు. కానీ ఇప్పటివరకు ఎవరనేది ఆచూకీ తెలియలేదు. మృతదేహాన్ని ప్రాజెక్టులో నుంచి వెలికి తీసినప్పుడు మృతుడి ఒంటిపై చొక్కా లేదు. అలాగే తలపై వెంట్రుకలు లేకుండా గుండు గీయించుకొని ఉన్నాడు. మృతుని నాలుక బయటకు వచ్చి ఉండడం, మెడపై, ఛాతీపై గాయాలుండడంతో హత్యగా భావిస్తున్నారు. కాగా, మృతుడు శనివారం సమీప ఆలయంలో తలనీలాలు ఇచ్చి ఉంటాడని, రాళ్లపాడు మీదుగా ఊరికి వెళ్తుండగా అక్కడే అతని మెడకు ఏదైనా బలమైన తాడు వేసి చంపి, అనంతరం ప్రాజెక్టులో వేసి ఉంటారని పలువురు అనుమానిస్తున్నారు. మృతుడు ఎవరనే తెలిస్తేగానీ హత్యా.. లేక ఆత్మహత్యా అనేది వెలుగు చూస్తుంది.

భూ సమస్యలు పరిష్కరిస్తాం

మండల మీట్‌లో తహసీల్దార్

గుడ్లూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో భూసమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ విజయభాస్కర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ పులి రమేష్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో 18 గ్రామపంచాయతీలకు గాను 11 గ్రామాల్లో మాత్రమే రీసర్వే పూర్తిచేశామన్నారు. అనంతరం కొందరు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ రీసర్వే మండలంలో అస్తవ్యస్తంగా చేయడంతో రైతుల భూసమస్యలు మరింత ఎక్కువయ్యాయని, నెలల తరబడి రెవెన్యూ కార్యాలయాల చుటు తిరుగుతున్నా సమస్యలు పరిష్కారం కావడంలేదని వాపోయారు. గుడ్లూరు - రాళ్లపాడు మంచినీటి పథకం ద్వారా తాగునీరు మురికిగా వస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గుడ్లూరు1 ఎంపీటీసి సభ్యురాలు చెన్నారెడ్డి వరమ్మ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎంపీడీవో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి 15 రోజులకొకసారి పంచాయతీల్లో వాటర్ ట్యాంకులను శుభ్రం చేసి, పైప్‌లైన్‌లు లీకులు లేకుండా ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ అధికారులు బాధ్యత తీసుకొని ప్రజలకు పరిశుభ్రమైన నీరు అందించాలని సూచించారు. విద్యుత్ లైన్లు సక్రమంగా లేకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయని పాజర్ల, పరకొండపాడు సర్పంచులు అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించే విధంగా ఆయా గ్రామాల సర్పంచులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎంఈవో హరిరామ్ కోరారు. పండ్లతోటల సాగుకు రైతులకు సబ్సిడిపై మొక్కలు, రాయితీపై ఎరువులు, పురుగుమందులు, వ్యవసాయ యూనిట్లను అందచేస్తామని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో రవికుమార్, సర్పంచిలు పీ. శంకర్, పీ. వెంకటేశ్వర్లు, వై. శ్రీనివాసులు, జీ. సుబ్బరామయ్య పాల్గొన్నారు.


నీటి సమస్య పరిష్కరించాలని అధికారులను కోరుతున్న ఎంపీటీసీ సభ్యురాలు చెన్నారెడ్డి వరమ్మ

తారురోడ్డు నిర్మాణంపై విజిలెన్స్ విచారణ జరపాలి

కందుకూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి):పట్టణం నుంచి మున్సిపాలిటీ పరిధిలోని వెంకటాద్రిపాలెంకు ఇటీవల నిర్మించిన తారురోడ్డు పనులు అత్యంత నాసిరకంగా జరిగి నెల తిరగకుండానే రోడ్డు నెర్రెలిచ్చినందున ఈ పనులపై విజిలెన్స్ విచారణ జరపాలని వెంకటాద్రిపాలెంకు చెందిన సామాజిక కార్యకర్త జిల్లెలమూడి వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తారురోడ్డును అత్యంత నాసిరకంగా నిర్మించటమే గాక సైడుబర్మ్‌లకు ఒక్క ట్రక్కు కూడా గ్రావెల్ తోలకుండా రోడ్డుసైడు మట్టినే జేసీబీతో వేసి చదునుచేయటంతో వర్షం పడితే వాహనాలు జారిపోతూ ప్రమాదాలు జరుగుతున్నాయని, జేసీబీతో మట్టితీసిన గుంతల కారణంగా రైతులు పొలాల్లోకి వెళ్లే అవకాశం కూడా లేక ఇబ్బందిపడుతున్నారని విమర్శించారు.


నెర్రెలిచ్చిన తారురోడ్డు

చెరువుల అభివృద్ధికి మోక్షమెప్పుడు?

● వర్షాకాలం ప్రారంభమయినా పట్టించుకోని అధికారులు
● మరమ్మతులకు నోచుకోని చెరువు కట్టలు

కొండాపురం. అక్టోబరు9 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రధానంగా చెరువుల నీటి ద్వారానే వరి సాగు చేస్తున్నారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే చెరువులను బాగు చేసుకుంటే ఆయకట్టు సాగుకు అవకాశం ఉంటుంది. వర్షాలు అనుకున్నంత స్థాయిలో పడకపోవడం, కాలువలు సరిగా లేకపోవడంతో వచ్చిన కొద్దిపాటి వాననీరు చెరువులకు చేరడంలేదు. దీంతో చెరువుల అయకట్టు సాగు ప్రశ్నార్థకంగా మారింది. మండలంలోని 19 పంచాయతీల పరిధిలో చిన్నా, పెద్దా కలిపి మొత్తం 36 చెరువులు ఉన్నాయి. ఈచెరువులకింద సుమారు 5 వేల ఎకరాలకుపైగా ఆయకట్టులో వరిని సాగుచేస్తున్నారు. వీటిలో శాయిపేట, కొమ్మి, గరిమెనపెంట గ్రామాలలో ఆయకట్టు ఎక్కువగా ఉండే చెరువులు ఉన్నాయి. గత ప్రభుత్వంలో చెరువు కట్టలను పట్టించుకున్న పాపాన పోలేదు. చేతులు కాలినతర్వాత ఆకులు పట్టుకున్న చందంగా ఇరిగేషన్ అధికారులు పనితీరు ఉంది. వర్షాకాలం ప్రాంభమైనప్పటికీ కాలువలకు మరమ్మత్తులు, కట్టలపై ఉన్న కంపచెట్లను తొలగించడం, చెరువుకట్టలను బలోపేతం చేయడం, పూడికతీత వంటి పనులపై ఇరిగేషన్ అధికారులు ముందు జాగ్రత్తలు తీసుకున్న దాఖలాలులేవు. పెద్ద చెరువులయిన సాయిపేట, గండికట్ల, గరిమెనపెంట పెద్ద చెరువు, గుడవళ్లూరు, సత్యవోలు తదితర చెరువుల అభివృద్ధికి ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామని అధికారులు చెబుతున్నారు. ప్రతిపాదనలకే పరిమితంగత ఏడాది వర్షాలకు తెగిపోయిన కొమ్మి పంచాయతీ పరిధిలోని గండికట్ట చెరువుకు అప్పట్లోనే ఇసుక బస్తాలతో తాత్కాలికంగా మరమ్మతులుచేశారు. తాత్కాలిక మరమ్మత్తులకొరకు రూ 10 లక్షల నిధులు అవసరమవుతాయని ప్రతిపాదనలు పంపినప్పటికీ ఇప్పటివరకు మంజూరు కాలేదు.


గుడవళ్లూరు చెరువులో మొలచిన కంపచెట్లు

14న మున్సిపల్ కాంప్లెక్స్‌ల్లో గదుల వేలం

కందుకూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కందుకూరు మున్సిపాలిటీ పరిధిలోని వివిధ షాపింగ్ కాంప్లెక్స్‌లలో గదులను అద్దెకు ఇచ్చేందుకు ఈనెల 14వ తేదీ ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె అనూష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాత లారీ స్టాండ్ ఆవరణలో నిర్మించిన ఎన్టీఆర్ కాంప్లెక్స్‌లో 1, 3 (ఎస్సీ), 5 (ఎస్టీ), 8 (టీఎల్ఎఫ్ అండ్ ఎస్ఎల్ఎఫ్), 12,13,15,17,18 (జనరల్) రూములకు, కల్లూరి కోటేశ్వరరావు షాపింగ్ కాంప్లెక్స్‌లో ఖాళీ అయిన 6,7 (జనరల్) రూములకు, ముత్యాలకుంట పార్కులో ఉన్న గదికి అద్దె బహిరంగ వేలం నిర్వహించటం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన వారు నిబంధనల ప్రకారం మున్సిపల్ కార్యాలయంలో వేలంలో పాల్గొని రూములు దక్కించుకోవచ్చునని ఆమె తెలిపారు.

నేడు డిజిటల్ బుక్ ఆవిష్కరణ

లింగసముద్రం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక వైసీపీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు డిజిటల్ బుక్ ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుందని మండల వైసీపీ అధ్యక్షుడు నోటి వెంకటేశ్వరరెడ్డి గురువారం తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓవీ రోడ్డులో రోడ్డు విస్తరణలో భాగంగా విద్యుత్‌స్తంభాల మార్పిడి పనులు జరుగుతున్నందున ఎమ్మార్వో ఆఫీసు ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం ఆరున్నర నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయటం జరుగుతుందని ఎఈ టీవీ నరసింహం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలోని సుల్తాన్‌మొహిద్దీన్ హాస్పటల్ ఏరియా, సంతోష్‌నగర్, మక్కా మసీదు ఏరియా, ఎమ్మార్వో ఆఫీసు, బూడిదపాలెం, పాతబ్యాంకు బజారు, కోటకట్టవీధి, అన్నా క్యాంటీన్, పెద్దబజారు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. వినియోగదారులు అసౌకర్యాన్ని గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.

ఆల్ఇండియా తైక్వాండో పోలీసు క్రీడలకు రెఫరీగా అఖిల్



రెఫరీగా ఎంపికైన అఖిల్‌తో తైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అబ్దుల్ సలాం

కందుకూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): జమ్మూ కాశ్మీర్‌లోని శ్రీనగర్‌లో ఈనెల 10 నుంచి 14వ తేది వరకు జరగనున్న ఆల్ ఇండియా 10వ పోలీసు జూడో క్లస్టర్ టోర్నమెంట్‌కు న్యాయనిర్ణేతగా కందుకూరుకు చెందిన పీ. అఖిల్ ఎంపికయ్యారని ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ షేక్ అబ్దుల్‌సలాం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఈ టోర్నమెంట్‌కు రెఫరీగా వ్యవహరించే అవకాశం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి అఖిల్‌కు దక్కటం సంతోషదాయకమన్నారు. ఈ సందర్భంగా అఖిల్‌ను పలువురు అభినందించారు.

నూనె, తీపి పదార్థాల వినియోగం తగ్గించాలి

కందుకూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆధునిక జీవనశైలిలో ఊబకాయం అనేక వ్యాధులకు కారణమవుతున్నందున నూనె, తీపి పదార్థాల వాడకం తగ్గించాలని అంగన్వాడీ సూపర్‌వైజర్ యు ప్రభావతి సూచించారు. ఐసీడీఎస్ 8వ రాష్ట్రీయ పోషణమహా కార్యక్రమంలో భాగంగా సీడీపీఓ ఉషారాణి ఆదేశాలతో మున్సిపాలిటీ పరిధిలోని చుట్టుగుంట, పట్టణంలోని రెవెన్యూ కాలనీ, చాకలిపాలెం అంగన్వాడీ కేంద్రాలలో గురువారం కార్యక్రమాలు నిర్వహించి పోషకాహారం ఆవశ్యకత, ఊబకాయానికి కారణమవుతున్న ఆహార పదార్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమాలలో సూపర్‌వైజర్లు ఎల్ లక్ష్మీదేవి, షేక్ షకీలాబేగం, అంగన్వాడీ కార్యకర్తలు సునీత, నీలిమ, ఈశ్వరమ్మ, పుష్పలత, రోహిణి, సుజాత, రజిని, రాజేశ్వరి, ప్రశాంతి, సుభాషిణి, హసీనా, బేబీరూన్సీ, రమాదేవి పాల్గొన్నారు.


ఊబకాయంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది

మంత్రి లోకేశ్‌ను కలిసిన భాషా పండితులు

కావలి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): భాషా పండితులకు పదోన్నతులు కల్పించినందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ రాష్ట్ర నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కావలికి చెందిన రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు నిమ్మగడ్డ సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. రవిచంద్రకుమార్ తదితర నాయకులు అమరావతిలోని తన నివాసంలో మంత్రిని కలిశారు. గతంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు రాష్ట్రవ్యాప్తంగా 10,224 మంది భాషా పండితులకు స్కూల్ అసిస్టెంట్ భాషా పండితులుగా ఉన్నతీకరణ ప్రక్రియకు శ్రీకారం చుట్టారన్నారు. ప్రస్తుతం మంత్రి లోకేశ్ మిగిలిన భాషా పండితులకు కూడా పదోన్నతులు కల్పించి ఒక మహా యజ్ఞాన్ని పూర్తి చేశాడన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు పండిత పరిషత్ పక్షాన వారు కృతజ్ఞతలు తెలిపారు.


మంత్రి లోకేశ్‌ను కలిసిన పండిత పరిషత్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు,తదితరులు

వ్యక్తిపై దాడి : ఇద్దరిపై కేసు నమోదు

ఉలవపాడు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తిని కొట్టి గాయపరిచిన సంఘటనలో అందిన పిర్యాదు మేరకు ఇద్దరిపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై అంకమ్మ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కరేడు పంచాయతీ పరిధిలోని ఉప్పరపాలెంకి చెందిన ఆటో డ్రైవర్ బాలకృష్ణ గురువారం మధ్యాహ్నం కరేడులోని బ్రాందీ షాపు వద్దకు వెళ్లాడు. ఆ సమయంలో కరేడు ఎస్సీ కాలనీకి చెందిన మేడిద శ్రీకాంత్, దామవరపు శ్రీకాంత్‌లు ఇరువురు ఉప్పరపాలెంకు చెందిన ఇద్దరు వ్యక్తులను కిందపడేసి కొడుతున్నారు. తన గ్రామస్థులు కావడంతో ఆటోడ్రైవర్ బాలకృష్ణ వారినుంచి బాధితులను పక్కకు తప్పించేందుకు యత్నించాడు. దీంతో వారు మాకే అడ్డువస్తావా అని ఆటోడ్రైవర్ బాలకృష్ణను పక్కనే ఉన్న రాళ్ల గుట్టపై పడేసి కొట్టడంతో గాయాలయ్యాయి. బంధువులు ఉలవపాడు సీహెచ్‌సీ తరలించి చికిత్స చేయించారు. వైద్యులు ఇచ్చిన సమాచారంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నెల రోజులైనా.. దొంగను పట్టుకోలేరా!?

జలదంకి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నవరం బ్రహ్మంగారి గుడిలో గత నెల 9వ తేదీ అర్ధరాత్రి రెండు అమ్మవారి తాళిబొట్లు చోరీ అయ్యాయని, సీసీ కెమెరాలో చోరుడి ఫొటో స్పష్టంగా కనిపిస్తున్నా నేటికీ పోలీసులు దొంగను ఎందుకు పట్టుకోవడం లేదని టీడీపీ నాయకుడు పూనూరు రామక్రిష్ణారెడ్డి పోలీసులను ప్రశ్నించారు. అన్నవరంలోని చోరీ జరిగిన గుడిలో భక్తులతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. తక్షణమే చోరీకి పాల్పడ్డ వ్యక్తిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. 8వ నంబరు చౌక ధాన్యపు డిపోలో రేషన్ కోటా తక్కువగా వస్తుండడంతో కార్డుదారులకు బియ్యం అందడం లేదన్నారు. ఎస్సీ కాలనీలో ఇళ్లపై వెళ్తున్న 11 కేవీ విద్యుత్ లైనును తొలగించి, సమస్యను పరిష్కరించిన ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు స్థానికుల తరపున ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకులు కంచి క్రిష్ణారెడ్డి, నాయకులు దేవరిపల్లి రమణారెడ్డి, నాగూర్‌బాషా పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు రామక్రిష్ణారెడ్డి, తదిరులు

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

కావలి రూరల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఎక్కడైనా డీలర్లు నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని కావలి మండల వ్యవసాయ శాఖాధికారిణి లలిత పేర్కొన్నారు. మండలంలోని కొత్తపల్లిలో అమరావతి సీడ్ ప్రోసెసింగ్ యూనిట్ ను గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు కూడా లైసెన్స్ కలిగిన డీలరు వద్ద బిల్లులు తీసుకుని విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన తరువాత 80 నుండి 90 మొలక శాతం చూసుకున్న తరువాత మాత్రమే నార్లు పోసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో విత్తన కేంద్రం డీలర్ ఉప్పాల శీనయ్య తదితరులు పాల్గొన్నారు.


సీడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను తనిఖీ చేస్తున్న ఏవో లలిత

బోగోలులో రోడ్లపైనే వర్షపు నీరు


రోడ్డుపై నిలిచిన వాన నీరు

బిట్రగుంట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలోని పలు ప్రాంతాల్లో గురువారం ఓ మోస్తరు వర్షం కురిసింది. మండల తహసీల్దారు, ఇతర మండల కార్యాలయాలకు వెళ్లే తెలుగు బాప్టిస్ట్ చర్చి రోడ్డులో వర్షపు నీరు నిల్వ ఉండిపోయింది. మట్టి, చెత్తచెదారం నిండిపోవడంతో ప్రధాన కాలువల్లో నీరు స్తంభించిపోయింది. రైల్వే ఎల్సీగేట్ 143 కుమ్మరవీధి మార్గంలో గుంతలు పడడంతో వాననీరు నిలిచి పాదచారులు ఇబ్బందిపడుతున్నారు. యాదవపాలెం, పాత హరిజనవాడ ప్రాంతాల్లో కాలువలు దెబ్బతిన్నందున మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. కొద్దిపాటి వర్షానికే రోడ్లు ఇలా ఉంటే వర్షాకాలంలో మరెంత దారుణంగా ఉంటాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వాన నీరు రోడ్లపై నిల్వ ఉండకుండా తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

12న యాదే కిషోర్‌కుమార్ మ్యూజికల్ నైట్

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): హిందీ చిత్రసీమలో ప్రముఖ నేపథ్య గాయకుడు కిషోర్‌కుమార్ 38వ వర్ధంతి సందర్భంగా ఈనెల 12న మ్యూజికల్ నైట్ నిర్వహిస్తున్నట్లు ప్రముఖ గాయకుడు జావీద్ తెలిపారు. ఈ కార్యక్రమ పోస్టర్లను గురువారం టౌనుహాలులో ఆవిష్కరించారు. మ్యూజికల్ నైట్‌ను నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సహాయ సహకారాలతో నిర్వహిస్తున్నామని తెలిపారు. 12వతేదీ సాయంత్రం 6 గంటలకు టౌనుహాలులో జరిగే ఈ కార్యక్రమానికి సంగీత ప్రియులు హాజరుకావాలని కోరారు.

సాయిపేట పంచాయతీ విభజనకు అభిప్రాయ సేకరణ



మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు

కొండాపురం,అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): మండలంలో మేజర్ పంచాయతీగా ఉన్న సాయిపేటను విభజించేందుకు గురువారం పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచి పీ. కోటేశ్వరమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ పంచాయతీల విభజనకు ప్రభుత్వం జీవో విడుదల చేసిందన్నారు. పంచాయతీలోని మక్కెనవారిపాలెం, వెల్లటూరివారిపాలె, ఇస్కపాలెం, కొమ్ముపాలెం గ్రామాలను ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేసేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు సమావేశం ఏర్పాటు చేశామన్నారు. పంచాయతీని విడగొట్టేందుకు గ్రామ పెద్దలు, ప్రజలు అంగీకరించారు. అనంతరం పంచాయతీ వార్డుసభ్యులతో సమావేశం ఏర్పాటు చేయగా మెజారిటీ సభ్యులు పంచాయతీ విభజన తీర్మానాన్ని ఆమోదించారు. సమావేశంలో ప్రోటోకాల్ పాటించలేదని గ్రామస్థుడు గంటా శ్రీనివాసులు డిప్యూటీ ఎంపీడీవోను అడగగా, ఇది అభిప్రాయసేకరణ సమావేశమని అధికారిక స మావేశం కాదని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రదీప్, సీనియర్ నాయకుడు గంటా లక్ష్మినరసింహులు, గుడవళ్లూరు సొసైటీ అధ్యక్షుడు కుంకు మోహనరావు, మాజీ జడ్పీటీసీ దామా మహేశ్వరరా వు, జిల్లా టెలికాం డైరెక్టర్ టి. అనూష, సాగునీటి సంఘ అధ్యక్షుడు టి. ప్రవీణ్, వల్లూరు వెంకటేశ్వర్లు, దామా శివబాబు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం


ఐరన్ సిరప్‌లు అందచేస్తున్న రామ్‌సెంటర్ నిర్వాహకులు

కావలి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని డాక్టర్ రామ్‌సెంటర్ చైర్మన్ మనోహర్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో డాక్టర్ రామ్‌సెంటర్ విశ్వోదయ సహకారంతో గురువారం ముసునూరులోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, చంద్రబాబు కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాలు సంయుక్తంగా సంపూర్ణ ఆరోగ్యంపై అవగాహన నిర్వహించారు. గర్భిణిలు, బాలింతలు తప్పకుండా ఆకుకూరలు, చిరుధాన్యాలతో కూడిన పోషకాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రామ్‌సెంటర్ డైరెక్టర్ కే. తాతిరెడ్డి, లింగనిర్ధారణ నిషేధ కమిటీ సభ్యుడు మాలకొండారెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుభాషిణి, అంగన్‌వాడీ కార్యకర్తలు రమాదేవి, దీనకుమారి, శివలీల, సుశీల, విజయలత, గర్భిణిలు, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.

పుదుచ్చేరి క్యాంపులో పీజీ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసరావు

కావలి (టౌన్)అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజి పుదుచ్చేరి ప్రభుత్వంచే కావలిలోని వీఎస్‌యు పీజీ కళాశాల విద్యార్థులు ప్రశంశలందుకున్నారు. గురువారం కళాశాలలో ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీ నివాసరావు, ఆచార్యులు విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో పుదుచ్చేరిలో సెప్టెంబరు 17 నుంచి 20 రోజుల పాటు సేవ పర్వ్ క్యాంపెయిన్ జరిగిందన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రొఫెసర్ సుశీల ఆధ్వర్యంలో విద్యార్థులు వ్యాసరచన, సాంస్కృతిక పోటీల్లో విజేతలుగా నిలిచి పుదుచ్చేరి ప్రభుత్వంచే ప్రశంస పత్రాలు అందుకోవడం అభినందనీయమన్నారు. వంశి, శశికళ, రేవతి విజేతలుగా నిలవగా, అనూష, సౌందర్య, ఇందు, దివ్య, అభిలాష్ పోటీల్లో పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కొండాయపాలెం లోని అబైండింగ్ హోప్ ట్రస్ట్‌లో గురువారం పౌష్టికాహార పంపిణీ జరిగింది. సర్వోదయ కళాశాల ప్రిన్సిపాల్ రజని అతిథిగా హాజరయ్యారు. అనారోగ్యంతో ఒత్తిడి, ఆందోళన చెందరాదని సూచించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ నిర్మల్‌కుమార్, లెక్చరర్ స్వర్ణలత, ఏ జయప్రకాష్, సిస్టర్ రమా, సిస్టర్ జయ పాల్గొన్నారు.

‘మాలేపాటి’కి తీవ్ర అస్వస్థత

● అమరావతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో శస్త్రచికిత్స

● హుటాహుటిన తరలిన కుటుంబసభ్యులు

కావలి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర అగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్, టీడీపీ నేత మాలేపాటి సుబ్బానాయుడు గురువారం మధ్యాహ్నం తీవ్రఅస్వస్థతకు గురయ్యారు. అమరావతిలోని వెలగపూడి సచివాలయంలో ఉదయం సీఎం చంద్రబాబు అధ్యక్షతన వ్యవసాయ అనుబంధ శాఖలపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం నుంచి నలతగా ఉండటంతో కొంత విశ్రాంతి తీసుకుంటే తగ్గుతుందన్న భావనతో అమరావతిలోని తన నివాసంలో ఉండిపోయారు. అయితే, సాయంత్రానికి అస్వస్థతకు గురవడంతో వెంటనే సమీపంలో ఉన్న మణిపాల్ ఆసుపత్రిలో చేర్పించగా, బ్రెయిన్‌స్ట్రోక్‌గా వైద్యులు నిర్ధారించారు. వెంటనే శస్త్రచికిత్స నిర్వహించారు. టీడీపీ అగ్రనేతలు కూడా విషయం తెలుసుకుని ఆసుపత్రి వర్గాలను అప్రమత్తం చేశారు. మాలేపాటి పరిస్థితి విషమంగా ఉండటంతో ఆయన కుటుంబసభ్యులు వెంటనే అమరావతికి తరలివెళ్లారు.

నాడు అధ్వానం... నేడు అద్భుతం!



నాడు పిచ్చి మొక్కలు, కరతుమ్మ చెట్లతో కాలువ దుస్థితి

● ఈదగాలి.. ఇడిమేపల్లి కాలువకు మోక్షం

వెంకటాచలం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఈదగాలి - ఇడిమేపల్లి పంట కాలువకు మోక్షం కలిగింది. ఎన్నో ఏళ్ల నుంచి పిచ్చి మొక్కలు, కరతుమ్మ చెట్లతో నిండిపోయి పంట కాలువ అధ్వానంగా తయారైంది. దీంతో ఈదగాలి రెండో నెంబరు తూము నుంచి ఇడిమేపల్లి వరకు సుమారు 2.5 కిలోమీటర్ల వరకు ఈ కాలువనుండి సాగునీటి పారుదల కూడా సక్రమంగా ఉండేది కాదు. దీంతో సుమారు 500 ఎకరాల్లో వరి సాగు చేసుకోలేక రైతులు ఇబ్బందిపడ్డారు. దీంతో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి దృష్టికి కాలువ దుస్థితిని తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన కాలువ మరమ్మతులు చేయాలని ఆదేశించారు. సకాలంలో నీరు అందాలన్న సంకల్పంతో కాలువ మరమ్మతు పనులను పర్యవేక్షిస్తున్నారు. వేగంగా పనులు జరుగుతున్నాయి. మరో నాలుగు రోజుల్లో మరమ్మతు పనులు పూర్తి కానున్నాయి. గత ఐదేళ్ల నుంచి మొన్నటిదాకా మొక్కలు, చెట్లతో పూడిపోయి కాలువ రూపే కనిపించని దుస్థితి. కానీ ఐదారేళ్ల తర్వాత కాలువ పనులకు మోక్షం కలగడంతో స్థానిక రైతుల పర్యవేక్షణలో పనులు చకచకా సాగుతున్నాయి. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతులు పూర్తయిన చోట కాలువ సుందరంగా కనిపిస్తోంది.



మరమ్మతు పనుల అనంతరం సుందరంగా మారిన కాలువ

శిశు కేంద్రాల్లో లోపాలు సరి చేసుకోవాలి

● జిల్లాస్థాయి పరిశీలన కమిటీ

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని శిశు సంరక్షణ కేంద్రాల్లో లోపాలను వాటి యాజమాన్యాలు సరిచేసుకోవాలని జిల్లా స్థాయి పరిశీలన కమిటీ సూచించింది. ఆ కమిటీ సభ్యులు గురువారం నెల్లూరులో స్త్రీశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న శిశుగృహను, బాలసదన్‌ను పరిశీలించారు. అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మిషన్ వాత్సల్య కోఆర్డినేటర్ వీబీ అనురాధ, జిల్లా ప్రొబేషన్ అధికారి ఫరూక్‌బాషా, జిల్లా బాలల సంరక్షణ అధికారి బీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మసక నేత్రం

జిల్లా వ్యాప్తంగా సీసీ కెమెరాల మరమ్మతులు

● అంధకారంలో మ్యాట్రిక్స్ కెమెరాలు

● ప్రైవేటు వాటిపై ఆధారపడిన పోలీసులు ● కేసుల ఛేదనలో జాప్యం

ఆంధ్రజ్యోతి పరిశీలన



నెల్లూరు నగరంలోని పాత చెక్‌పోస్టు వద్ద...



నెల్లూరు : శెట్టిగుంట రోడ్డు కూడలిలో...



నెల్లూరు(క్రైం) అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా 534పైగా మ్యాట్రిక్స్ కెమెరాలు ఉన్నాయి. వీటిని జిల్లా పోలీసు కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అటాచ్ చేసుంటారు. ఆయా ప్రాంతాల్లో నేరాలు జరిగినప్పుడు సంబంధిత పోలీసు సిబ్బంది కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సీసీ ఫుటేజ్‌లను పరిశీలిస్తారు. గత ప్రభుత్వ హయాంలో నెల్లూరుతోపాటు పలు ప్రాంతాల్లో ఇవి దిష్టిబొమ్మల్లా మారాయి. కూటమి ప్రభుత్వంలోనూ వీటిపై ప్రత్యేక దృష్టి సారించలేదు. దీంతో ఎన్నో కేసుల్లో దర్యాప్తు ప్రశ్నార్థకంగా మారింది. ఇవే కాకుండా గతంలో వ్యాపారులు, కళాశాల యాజమాన్యాలు, అపార్ట్‌మెంట్‌లు, దాతల సాయంతో ఆయా ప్రాంతాల్లోని దుకాణాలు, కళాశాలలు, శివారు ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వాటి ఫుటేజ్‌లు కావాలంటే అవి ఏర్పాటు చేసిన ప్రాంతాలకు వెళ్లి పరిశీలించారు. పెన్‌డ్రైవ్‌లో పోలీసులు కాపీ చేసుకొని నేరాల ఛేదనకు కృషి చేసేవారు. అవి కూడా తక్కువ క్వాలిటీ, తక్కువ మెమరీ కలిగి ఉండటంతో కేసుల విచారణ జాప్యం జరుగుతోంది.



జలదంకి : చామదల వద్ద...

పట్టణంలో కన్నా.. పల్లెల్లోనే నయం

ఉదయగిరి : నేర నియంత్రణలో భాగంగా మండలంలో 80 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రధానంగా గండిపాళెం, వెంగళరావునగర్, కొండాయపాళెం, కృష్ణంపల్లి, అర్లపడియ, పుల్లాయపల్లి, బండగానిపల్లి, దాసరిపల్లి, అయ్యవారిపల్లి తదితర పంచాయతీల్లో ఆలయాలు, ప్రధాన కూడళ్లు, ఉదయగిరిలోని ప్రధాన రహదారులు, సెంటర్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పల్లెల్లో ఇవి పని చేస్తుండగా పట్టణంలో కొన్ని సక్రమంగా పని చేయడంలేదు.

● **ఆత్మకూరు:** పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లో పోలీసులు సీసీ కెమెరాలను ఏర్పాటుచేసి, వాటిని సీఐ కార్యాలయం కంట్రోల్ రూమ్‌తో అనుసంధానం చేశారు. హనుమాన్ జంక్షన్, నెల్లూరుపాళెం, ఏఎస్‌పేట క్రాస్ రోడ్డు, సోమశిల రోడ్డు సెంటర్, పోలీస్‌స్టేషన్ సెంటర్, మున్సిపల్ బస్టాండ్, ఆర్టీసీ బస్టాండ్, బజారువీధి, బట్టేపాడు రోడ్డు తదితర 52 చోట్ల వీటిని ఏర్పాటుచేశారు. ఇవి శాంతి భద్రతల పరిరక్షణకు ఉపయుక్తంగా ఉన్నాయి.

● **లింగసముద్రం :** బస్టాండ్ సెంటర్, శ్రీతిరుమణిశెట్టి కోటయ్యస్వామి మందిరం వద్ద, వెంగళాపురం బస్టాండ్ సెంటర్, తాతాహోటల్ సెంటర్, మొగిలిచెర్ల బస్టాండ్ సెంటర్‌తోపాటు గ్రామాల్లో నాలుగేళ్ల క్రితం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా, ఇవి పనిచేయడం లేదు.

● **జలదంకి :** మండలంలోని 60ప్రాంతాల్లో పోలీసులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇవి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కంప్యూటర్‌కు అనుసంధానించారు. రోడ్డుప్రమాదాలకు పాల్పడి తప్పించుకు పోయేవారు నేరస్థులను సీసీ కెమెరాల ద్వారా గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకున్న సంఘటనలు ఉన్నాయి.

● **కావలి :** గతంలో పట్టణంలో ఏర్పాటు చేసి సీసీ కెమెరాలు రెండేళ్లుగా పనిచేయటంలేదు. దీంతో సీసీ కెమెరాలను అనుసంధానం చేసిన పోలీస్ కంట్రోల్ రూం నిరుపయోగంగా ఉంది. కావలిలోని ప్రధాన కేంద్రాల్లో పోలీసులు 22 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటిని ఎప్పటి కప్పుడు పరిశీలిస్తూ నేర నియంత్రణకు చర్యలు చేపట్టారు. ఇవి కొంత కాలం బాగానే పనిచేసినా రెండేళ్ల కిందట వచ్చిన తుఫాన్‌కు పనిచేయకుండా పోయాయి. ప్రస్తుతం పోలీసులు ప్రజలను చైతన్య పరచి ఒకటో పట్టణ పరిధిలో 164, రెండో పట్టణ పరిధిలో 100, రూరల్ పరిధిలో 100 సీసీ కెమెరాలు పెట్టించారు. కొన్ని సందర్భాల్లో ప్రైవేట్ వ్యక్తుల ఇళ్లలో ఉన్న సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేయక నేరస్థులు దొరకడంలేదు.

కావలి : పోలీస్ కమాండ్ కంట్రోల్ సిస్టిమ్ ఉన్న భవనం



● నెల్లూరు నవాబుపేట పోలీసు స్టేషన్ పరిధిలో గల ఓ మద్యం దుకాణంలో ఈనెలలో చోరీ జరిగింది. ఆ పోలీసుస్టేషన్ పరిధిలోని నవాబుపేట సెంటర్, మైపాడుగేటు, శెట్టిగుంటరోడ్డు, వారధి సెంటర్... ఇలా పలు ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఉన్నాయి. వాటి ఫుటేజీలను పరిశీలిస్తే నిందితులను ఇట్టే పట్టేయవచ్చని పోలీసులు భావించారు. అయితే అవి పని చేయక పోవడంతో చేసేది లేక దుకాణాల ముందు వ్యాపారులు ఏర్పాటు చేసుకున్న కెమెరాల్లోని ఫుటేజ్‌లను పరిశీలించాల్సి వచ్చింది.

● నెల్లూరు పెన్నా బ్యారేజీకి సమీపంలోని తిక్కన పార్కు ఎదురుగా ఈనెల 6 అర్ధరాత్రి జంట హత్యలు జరిగాయి. సరిగ్గా సీసీ కెమెరాకు పక్కనే దాడి జరిగి, ఓ వ్యక్తిని కాలువలోకి తోసి హత్య చేయడం, మరో వ్యక్తిని రోడ్డుపై లాక్కుంటూ వెళ్లి కొద్ది దూరంలో ఉన్న జాఫర్ సాహెబ్ కాలువలో పడేసి హత్య చేశారు. సీసీ కెమెరా పక్కనే ఘటన జరిగింది కాబట్టి నేరస్థులను గుర్తించడం పెద్ద పని కాదనుకున్నారు పోలీసులు. తీరా చూస్తే ఆ కెమెరా పనిచేయలేదు. ఉదాహరణకు ఇవి రెండు సంఘటనలు మాత్రమే. వెలుగులోకి రానివి ఎన్నో ఉన్నాయి.

వింజమూరు ఎంపీపీపై అవిశ్వాసం పెట్టండి

కావలి ఆర్డీవోకు 8 మంది ఎంపీటీసీల లిఖితపూర్వక ఫిర్యాదు



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీటీసీలు

కావలి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): వింజమూరు మండలపరిషత్ అధ్యక్షుడు మోహన్ రెడ్డిపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని 8 మంది ఎంపీటీసీలు లిఖితపూర్వకంగా కావలి ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. గురువారం 8 మంది ఎంపీటీసీలు వింజమూరు నాయకులతో కలిసి కావలి ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని ఆర్డీవో ఎం సన్నీ వంశీక్రిష్ణకు ఫిర్యాదు చేశారు. ఎంపీపీ గత నాలుగు సంవత్సరాలుగా మండల సమావేశాలు నిర్వహించడం లేదని, అభివృద్ధి నిధులు సక్రమంగా వినియోగించడంలేదని వారు ఆరోపించారు. దీంతో మండలాభివృద్ధి కుంటుపడిందని, ప్రజా సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. వెంటనే ఆయనపై అవిశ్వాస తీర్మానం పెట్టి, విధుల నుంచి తొలగించాలని వారు కోరారు. దీనిపై స్పందించిన ఆర్డీవో త్వరలో ఈ అంశంపై నిర్ణయం తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు.

పారా లీగల్ వలంటీర్లకు చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న న్యాయాధికారి

నెల్లూరు (లీగల్), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రాంగణంలోని లోక్ అదాలత్ భవన్‌లో గురువారం 110 మంది పారా లీగల్ వలంటీర్లకు న్యాయాధికారులు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన న్యాయాధికారి జీ శ్రీనివాస్ హాజరై ప్రసంగించారు. పారా లీగల్ వలంటీర్లు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ కే వాణి తదితరులు పాల్గొన్నారు.

కొత్త టీచర్లు వచ్చేస్తున్నారు!

● వెబ్, మాన్యువల్ కౌన్సెలింగ్ ప్రారంభం ● 13న విధుల్లోకి ఉపాధ్యాయులు



నెల్లూరు(విద్య), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్యను బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే మెగా డీఎస్సీ నిర్వహించి, ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 651 పోస్టులను భర్తీ చేయనున్నది. డీఎస్సీలో అర్హత సాధించి, ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఈనెల 3 నుంచి 10 వరకు శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణ పూర్తయ్యేలోపే పాఠశాలల ఎంపికకు అవకాశం కల్పించారు. ఈనెల 13న విధుల్లో చేరేలా పాఠశాల విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది.

● **1:1 పద్ధతిలో ఖాళీలు**

టీచర్లు పాఠశాలలను ఎంపిక చేసుకునేందుకు 1:1 పద్ధతిలో ఖాళీలను చూపుతున్నారు. గురువారం నుంచి పాఠశాలల ఎంపికకు సంబంధించి వెబ్, మాన్యువల్ కౌన్సెలింగ్‌లకు అవకాశం కల్పించారు. జిల్లాలో 673 పోస్టులను భర్తీ చేసేందుకు ఖాళీలను ప్రకటించగా, వీటిలో ఐదు పోస్టులను ట్రైబల్ వెల్ఫేర్‌కు కేటాయించారు. మిగిలిన 668 పోస్టులకు ఎంపికయిన అభ్యర్థులకు అన్నీ పరిశీలనలను పూర్తిచేసి, 651 పోస్టులను భర్తీ చేస్తూ నియామక ఉత్తర్వులను అందచేయనున్నారు. మిగలిన 17 పోస్టులకు సంబంధించి వివిధ కారణాలతో తాత్కాలికంగా బ్రేక్ వేసినట్లు అధికారులు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన ఉపాధ్యాయులకు ఈనెల 3 నుంచి 10 వరకు ఇండక్షన్ శిక్షణను జిల్లాస్థాయిలో రెసిడెన్షియల్ విధానంలో నిర్వహిస్తున్నారు. స్కూల్ అసిస్టెంట్ విభాగంలో ఇంగ్లిష్, హిందీ, ఉర్దూ, తెలుగు, ఫిజికల్ ఎడ్యుకేషన్, సోషల్ సబ్జెక్ట్‌ల అభ్యర్థులతో పాటు ఎస్‌జీటీ, ఎస్‌జీటీ ఉర్దూ మీడియం అభ్యర్థులు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలోనూ, స్కూల్ అసిస్టెంట్ బయలాజికల్ సైన్స్, మ్యాథ్స్, ఫిజికల్ సైన్స్ టీచర్లు గొలగమూడిలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్ కళాశాలలోనూ శిక్షణ ఇస్తున్నారు. వీరిలో స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో వెబ్‌ఆప్షన్‌లకు అవకాశం కల్పించగా, ఎస్‌జీటీలకు యూనివర్సిటీ ప్రాంగణంలోనే మాన్యువల్‌గా కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లు ఇచ్చేలా విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. మండల పరిషత్ పరిధిలో 85 మంది, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 13 మంది, మునిసిపాలిటీల్లో 9 మందికి స్కూళ్లను కేటాయించేందుకు మాన్యువల్ కౌన్సెలింగ్‌ను ప్రారంభించారు. మిగిలిన అభ్యర్థులందరికీ కూడా వెబ్ కౌన్సిలింగ్ ద్వారానే పాఠశాలలను కేటాయింపులు నిర్వహించనున్నట్లు డీఈవో బాలాజీరావు తెలిపారు.

● **టీచర్లు లేని పాఠశాలలపై ప్రత్యేక దృష్టి**

జిల్లా విద్యాశాఖ లెక్కల ప్రకారం రాపూరు మండల పరిధిలోని 22 పాఠశాలల్లో అత్యధికంగా పోస్టులను భర్తీ చేయనున్నారు. అనంతరం మర్రిపాడులో 8, దక్కిలిలో 7, సైదాపురంలో 7, కొండాపురంలో 6, సూళ్లూరుపేటలో 6, వరికుంటపాడు, కోట, వాకాడు, దుత్తలూరు మండలాల్లో నాలుగు గ్రామాల్లోని పాఠశాలల చొప్పున పోస్టులు భర్తీ కానున్నాయి. మిగిలిన వారికి ఇతర మండలాల్లో నియామక ఉత్తర్వులు అందిస్తారు. ఆయా మండలాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్నా ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

రోడ్డు ప్రమాదంలో ఉద్యాన విస్తరణ అధికారి మృతి

నెల్లూరు(క్రైం) అక్టోబరు 9 (ఆంధ్ర జ్యోతి): జాతీయ రహదారిపై సౌత్‌రా జుపాళెం జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్ర మాదంలో ఉద్యాన శాఖ విస్తరణ అధికారిణి ఒకరు మృతిచెందారు. పోలీ సుల సమాచారం మేరకు... నెల్లూరులో నివాబు పేట కృష్ణానగర్‌లో డీ ప్రియాంక(34), బాలవిశ్వనాథ్ దంపతు లు నివసిస్తున్నారు. ప్రియాంక కోవూరు లో ఉద్యానవన విస్తరణ అధికారిణిగా పనిచేస్తుండగా ఆమె భర్త కూడా అదే కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గురువారం సాయంత్రం ఆమె వేదాయపాలెం లోని ఆ శాఖ జిల్లా కార్యాలయానికి వెళ్లేందుకు స్కూటీపై జాతీయ రహదారి మీదుగా బయలుదేరారు. సౌత్‌రాజు పాలెం జంక్షన్ వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి మినీ ట్రక్కు స్కూటీని వేగంగా ఢీకొంది. గాయాలపాలైన ఆమెను స్థానికులు సమీపంలోని మెడికవర్ వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. నార్త్ ట్రాఫిక్ పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. వైద్యశాలలోని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ప్రియాంక ఆరు నెలలు ప్రసూతి సెలవులో ఉండి ఒక పాపకు జన్మనిచ్చింది. 10 రోజుల క్రితమే తిరిగి విధుల్లో చేరింది. ఇంతలో ఇలా జరగడం అందరినీ బాధించింది.

అడవుల తనిఖీ

సీతారామపురం : మండలంలోని పండ్రంగి బీట్ అటవీ ప్రాంతాన్ని గురువారం గుంటూరు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం తనిఖీ చేసింది.స్క్వాడ్ బృందం ఎఫ్ఆర్‌వో ఎస్‌వి సుబ్బారావు మాట్లాడుతూ ఎర్రచందనం అక్రమ రవాణాపై అటవీశాఖ సిబ్బంది డేగ కన్ను వేయాలన్నారు.

ముదింపు పరీక్షలకు ఏర్పాట్లు

● 13 నుంచి అన్నీ పాఠశాలల్లో నిర్వహణ

నెల్లూరు(విద్య), అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్నీ పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి రెండవ నిర్మాణాత్మక ముదింపు(ఎస్ఏఎంపీ-2) పరీక్షలను ఈనెల 13 నుంచి నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. జిల్లావ్యాప్తంగా అన్నీ యాజమాన్య పాఠశాలల్లో చదువుతున్న 1 నుంచి 5వతరగతి విద్యార్థులకు 3రోజులు, 6 నుంచి 10వతరగతి విద్యార్థులకు 4 రోజులపాటు పరీక్షలు నిర్వహించేలా టైంటేబుల్‌ను విడుదల చేశారు. 13న తెలుగు, గణితం, 14న హిందీ, సామాన్యశాస్త్రం, భౌతికశాస్త్రం, 15న ఇంగ్లిష్, సాంఘికశాస్త్రం, 16న సంస్కృతం, జీవశాస్త్రం పరీక్షలు నిర్వహిస్తామని డీఈవో బాలాజీరావు తెలిపారు. ఈ రాత పరీక్షలకు ప్రతి సబ్జెక్ట్‌కు 35 మార్కులకు నిర్వహించడంతోపాటు ప్రతి సబ్జెక్ట్‌లో తరగతి గదిలో విద్యార్థి ప్రతిస్పందనలు, రాతపనులు, ప్రాజెక్ట్ పనులకు ఒక్కొక్క దానికి 5 మార్కులు చొప్పున మొత్తం 50 మార్కులు ముదింపు చేస్తామన్నారు. ఈ ఏడాది ప్రత్యేకంగా రెండవ నిర్మాణాత్మక ముదింపు నుంచి సరైన స్థాయిలో విద్యాబోధన ముదింపును ప్రభుత్వ పాఠశాలల్లోని 3, 4, 5 తరగతుల విద్యార్థులందరికీ ఎఫ్ఏటూల్-2 కింద అనుసంధానం చేస్తామన్నారు. అలాగే జవాబులు రాసేందుకు ప్రతి సబ్జెక్ట్‌కు అసెస్‌మెంట్ బుక్‌లెట్‌లు అందించామన్నారు. విద్యార్థులు పరీక్ష రాసిన అనంతరం ఉపాధ్యాయులు జవాబులను మూల్యాంకనం చేసి, ఆ మార్కులను ముదింపు పుస్తకంలో ఇవ్వబడిన ఓఎంఆర్ షీట్‌లో నమోదు చేసి స్కాన్ చేయాలన్నారు. అనంతరం స్కాన్‌చేసిన దాన్ని లీప్ యాప్ ద్వారా అప్‌లోడ్ చేస్తే ఫలితాలను రాష్ట్ర స్థాయిలో ముదింపు చేసి ప్రస్తుత విద్యా ప్రమాణాల మీద, తదుపరి చర్యలపైన ఉపాధ్యాయులకు సూచనలు చేస్తారని డీఈవో తెలిపారు.

పింఛనుదారుల నుంచి దసరా మామూళ్ల వసూలు

● ఎంపీడీవో విచారణ



దసరా మామూళ్లపై లబ్ధిదారులను విచారిస్తున్న ఎంపీడీవో శైలజ

కలువాయి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): దసరా మామూళ్ల పేరుతో ఎన్టీఆర్ భరోసా పింఛనుదారులు ఒక్కొక్కరి నుంచి రూ.100 నగదును ఓ ప్రభుత్వ ఉద్యోగి వసూలు చేసినట్లు వచ్చిన ఆరోపణలపై ఉన్నాతాధికారుల ఆదేశాల మేరకు గురువారం ఎంపీడీవో శైలజ విచారణ జరిపారు. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రమైన కలువాయిలోని ముస్లింపాళెంలో పింఛన్ల పంపిణీ బాధ్యతను స్థానిక పంచాయతీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసే శ్రీనివాసులుకు అధికారులు అప్పగించారు. కాగా, అక్టోబరు నెలకు సంబంధించిన పింఛను నగదు లబ్ధిదారులకు పంపిణీ సమయంలో దసరా మామూళ్ల పేరుతో శ్రీనివాసులు ఒక్కొక్కరి నుంచి రూ.100 తీసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో ఉన్నతాధికారుల ఆదేశం మేరకు ఎంపీడీవో విచారణ చేపట్టారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ దసరా మామూళ్ల వసూళ్లపై తాను లబ్ధిదారులను విచారించగా నగదు వసూలు చేసింది వాస్తవమేనని వారు తెలిపినట్లు ఆమె చెప్పారు. పింఛనుదారుల నుంచి నగదు వసూలు చేసిన ఉద్యోగిపై తదుపరి చర్యలకు ఉన్నతాధికారులకు విచారణ నివేదిక పంపుతున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

వీధి వ్యాపారుల కోసం ‘పీఎం స్వనిధి’

● పథకంపై అవగాహనకు లోక్ కల్యాణ్ మేళాలు ● రూ.10 వేల నుంచి రూ. 15వేలకు పెరిగిన రుణం

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు బతకలేనిస్థితిలో ఉన్న వీధి వ్యాపారులు ఉండే వారు. ఉన్నంతలో పండ్లు, కూరగాయలు కొనుగోలు చేసి వాటిని అమ్మి, వచ్చే సంపాదనతో జీవనం గడిపేవారు. వారి కోసం కేంద్ర ప్రభుత్వం పీఎం స్వనిధి పథకాన్ని ప్రవేశపెట్టి, అండగా నిలబడటతో వారు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. ఈ పథకం కింద ప్రారంభంలో రూ.10వేలు ఇస్తున్న రుణాన్ని, రూ.15వేలకు పెంచింది. గతంలో మొదటి విడతలోరూ.10వేలు, రెండో విడత రూ.15వేలు, చివరగా రూ.50వేల రుణాలను ఈ పథకం కింద ఇచ్చారు. ప్రస్తుతం తొలి విడతలోరూ.15వేలు, రెండో విడత రూ.25వేలు, చివరిగా రూ.50 వేల రుణాన్ని ఇవ్వాలని నిర్ణయిచారు. వీధి వ్యాపారులకు రుణ మొత్తాలు పెరగటంతో వారు ఆనందంలో ఉన్నారు. అదేళ్ల కింద వీధి వ్యాపారులు గుర్తించి గుర్తింపు కార్డులు అందించారు. వీరికి బ్యాంకుల నుంచి స్వల్పకాలిక రుణాలు ఇస్తున్నారు. తీసుకుని సక్రమంగా చెల్లిస్తున్నవారికి అదనంగా రుణాలు అందచేస్తున్నారు.

లోక కల్యాణ్‌మేళా నిర్వహణ

పీఎం స్వనిధి పథకంలో భాగంగా లోకకల్యాణ్ మేళాలను నిర్వహించారు. నెల్లూరు, కావలి, కందుకూరు, బుచ్చి, ఆత్మకూరులలో ఈ మేళాలు నిర్వహించి వీధి వ్యాపారులకు పీఎం స్వనిధి పథకం గురించి తెలియచేశారు. పీఎం స్వనిధి కింద పెంచిన రుణ మొత్తాలను వివరించారు. వీధి వ్యాపారుల నుంచి రుణ దరఖాస్తులు స్వీకరించారు. మెప్మా అధికారులు దరఖాస్తులను పరిశీలించి, గ్రౌండింగ్ పూర్తి చేసి బ్యాంకర్లకు పంపనున్నారు.



పండ్లు అమ్ముతున్న వీధి వ్యాపారి

18,976 మంది వీధివ్యాపారులు

జిల్లాలోని మున్సిపాలిటీల్లో 18,976 మంది వీధి వ్యాపారులు ఉన్నారు. నెల్లూరులో 12,888 మంది, ఆత్మకూరు మున్సిపాలిటీలో 1,377 మంది, కందుకూరులో 1,068, కావలిలో 3,663 మంది వీధి వ్యాపారులు ఉన్నారు. వీరికి తొలి విడతలో రూ.18.97 కోట్లు రుణాలను అందచేశారు. వారిలో 7027 మందికి రెండో విడతలో 14.05 కోట్లు అందచేశారు. మూడో విడతలో 877 మందికి 4.38కోట్ల రుణాలను అందచేవారు. రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించిన వారికి రూ. 25 వేలు, రూ.50వేలు అందచేయటం ఈ పథక విశేషం. కాగా డిజిటల్ చెల్లింపులకే ప్రజలు ఎక్కువగా మక్కువ చూపటంతో, వీధి వ్యాపారులకు డిజిటల్ చెల్లింపులపై శిక్షణ ఇప్పిస్తున్నారు.

వీధి వ్యాపారులకు ఆర్థిక భరోసా

వీధి వ్యాపారులకు పీఎం స్వనిధి పథకం ఓ ఆర్థిక భరోసా, ఈ పథకం వీధి వ్యాపారులందరికి వర్తించేలా వారిని గుర్తిస్తున్నాం. గుర్తింపు కార్డులను అందచేస్తున్నాం. వారికి పెరిగిన రుణ మొత్తాలను వివరిస్తున్నాం. వారు ఆర్థికంగా నిలదొక్కుకోడానికి అన్నీ చర్యలు తీసుకుంటున్నాం.

- లీలారాణి, మెప్మా పీడీ

